www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

తెలుగు జవాను వీరమరణం

పాక్‌తో పోరాడుతూ అమరుడైన ఏపీ అగ్నివీర్ మురళీనాయక్ **10**

ఆపరేషన్ సిందూర్ కోసం జమ్మూ సరిహద్దులకు

అంతకుముందే తల్లిదండ్రులతో ఫోన్‌లో కబుర్లు

తర్వాత గంటల వ్యవధిలోనే అమరుడైన మురళి

జవాను కుటుంబానికి సీఎం పరామర్శ.. 5 లక్షల సాయం

నేడు శ్రీ సత్యసాయి జిల్లా కళ్లితండాకు భౌతికకాయం



మురళీనాయక్‌కు సీఎం చంద్రబాబు నివాళులు



మురళీనాయక్

శనివారం | 10-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 63 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి: సా.5:30 తదుపరి చతుర్దశి, నక్షత్రం: చిత్త తె.3:15 తదుపరి స్వాతి, వర్జ్యం: ఉ.9:11-10:59, దుర్ముహూర్తం: ఉ.5:48-7:30, అమృతఘడియలు: రా.8:01-9:49, రాహుకాలం: 9:00-ఉ.10:30, సూర్యోదయం: 5:48, సూర్యాస్తమయం: 6:34 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఉద్రిక్తంగానే..

వరుసగా రెండో రోజూ పాక్ డ్రోన్ దాడులు

కశ్మీరు నుంచి కచ్ వరకూ 20 నగరాలు లక్ష్యంగా..

నాలుగు రాష్ట్రాల్లో 26 డ్రోన్లను కూల్చివేసిన భారత సైన్యం

డ్రోన్ దాడికి ఫిరోజ్‌పూర్‌లో ముగ్గురికి గాయాలు.. ఒకరు విషమం

సరిహద్దు ప్రాంతాల్లో రెండో రోజూ సైరన్ మోతలు, చిమ్మ చీకట్లు



పాక్ దాడుల నేపథ్యంలో పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో శుక్రవారం రాత్రి బ్లాకవుట్ అమలు చేస్తున్న దృశ్యం

జమ్ము, శ్రీనగర్, అమృతసర్, మే 9: భారత్, పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో వరుసగా రెండో రోజు కూడా ఉద్రిక్త పరిస్థితులే కొనసాగుతున్నాయి. జమ్మూ కశ్మీరు నుంచి గుజరాత్ వరకూ సైరన్ మోతలు వినిపిస్తున్నాయి. రాజస్థాన్‌లోని జైసల్మేర్, జోధ్‌పూర్ సహా జమ్మూ నుంచి పంజాబ్ వరకూ చాలా ప్రాంతాల్లో బ్లాకవుట్ కొనసాగుతోంది. ఇళ్లల్లోనూ బయటా లైట్లు ఆర్పేయడంతో చిమ్మ చీకట్లు నెలకొన్నాయి. అదే సమయంలో, పాకిస్థాన్ తన దుర్బుద్ధిని పోనిచ్చుకోలేదు. జమ్మూ కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌ల్లోని 20 నగరాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని శుక్రవారం రాత్రి కూడా డ్రోన్ దాడులు చేసింది. మరోసారి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడింది. బారాముల్లా నుంచి భుజ్ వరకూ నాలుగు రాష్ట్రాల్లో 26 డ్రోన్ దాడులు చేసింది. వాటన్నిటినీ భారత్ అడ్డుకుని కూల్చేసింది. వీటిలో శ్రీనగర్ విమానాశ్రయం, దక్షిణ కశ్మీరులోని అవంతిపుర

మిగతా 13వ పేజీలో...

కూల్చాం.. నిర్వీర్యపరిచాం

గురువారం ఒక్కరోజే 300-400 టర్కీ డ్రోన్లతో దాడికి పాక్ యత్నం

కశ్మీర్‌లోని లేహ్ నుంచి గుజరాత్‌లోని సర్‌క్రీక్ దాకా 36 నగరాల్లోని సైనిక శిబిరాలే లక్ష్యం

అత్యధిక డ్రోన్లలో ఎలాంటి ఆయుధాలూ లేవు

మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను పరీక్షించడానికే

శిథిలాలపై దర్యాప్తు.. మరిన్ని ఆధారాల సేకరణ

పౌర విమానాలను పాక్ అడ్డుగా పెట్టుకుంది

మీడియాతో విక్రమ్ మిస్రి, సోఫియా, వ్యోమికా

జమ్మూలో చొరబాటుకు యత్నం

ఏడుగురిని హతమార్చిన బీఎస్ఎఫ్

సమగ్ర కథనాలు 11, 12, 13లో

ఆ ఇద్దర్నీ అప్పగించండి!

మౌలానా మసూద్ అజర్, హఫీజ్ సయీద్‌ను అప్పగించాలని పాకిస్థాన్‌కు భారత్ డిమాండ్?

భారత దాడులతో కరాచీ పోర్టు దెబ్బతింది

పోర్ట్ ట్రస్ట్ అధికారిక 'ఎక్స్'లో పోస్ట్.. తర్వాత మాటమార్చి మరో పోస్ట్

తమ ఖాతా హ్యాకయ్యిందని.. పోర్ట్ సురక్షితంగానే ఉందని వివరణ

రుణాలతో ఆదుకోవాలని అంతర్జాతీయ భాగస్వాములకు పాక్ వినతి

'ఎక్స్' ఖాతాలో పోస్టు.. అంతలోనే మళ్లీ దానిపైనా మాట మార్పు

కరాచీ పోర్టు ధ్వంసంపై పోర్టు ట్రస్ట్ ట్వీట్

Karachi Port Trust Official
@official_kpt

Karachi Port has sustained heavy damage following a strike by India resulting in unacceptable loss of property. Emergency response efforts are underway. Updates on restoration will be provided regularly. We stand resilient.
#IndianNavyAction #IndiaPakistanWar #KarachiPort

పాక్‌కు ఐఎంఎఫ్ రుణం

100 కోట్ల డాలర్ల విడుదలకు ఓకే.. భారత్ అభ్యంతరం

ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశానికి అప్పిస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని హెచ్చరిక.. ఓటింగ్‌కు దూరం

టర్కీ షూట్!

200 బులెట్లు కాల్చే డ్రోన్లను పాక్‌కు ఇచ్చిన టర్కీ

అయినా లెక్కచేయని భారత సైన్యం

పాక్ డ్రోన్లను, క్షిపణుల్ని అద్భుతంగా అడ్డుకున్న మన ఎయిర్ డిఫెన్స్

యుద్ధంలో ఒక పక్షం మరో పక్షాన్ని చాలా సులభంగా దెబ్బ తీస్తే సైనిక పరిభాషలో దానిని 'టర్కీ షూట్' అంటుంటారు. 19వ శతాబ్దం ప్రారంభంలో అమెరికాలో తుపాకులతో షూటింగ్ ప్రాక్టీస్ చేయడం కోసం టర్కీ పక్షుల్ని వాడేవారు. ఆ పక్షిని సులభంగా కాల్చినట్లుగా శత్రు పక్షాన్ని అవలీలగా దెబ్బతీశారనే అర్థంలో ఈ ప్రయోగం వాడుకలోకి వచ్చింది. టర్కీ (ఇప్పుడు తుర్కియే) నుంచి దిగుమతి చేసుకున్న డ్రోన్లను వందల సంఖ్యలో భారత్‌పై గురి పెట్టిన పాక్‌కు కూడా ఇప్పుడు ఇదే పరిస్థితి ఎదురవుతోంది.



తుపాకీతో కూడిన టర్కీ డ్రోన్

తుర్కియే డ్రోన్లను, పాక్ క్షిపణుల్ని భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు సులభంగా దెబ్బతీస్తున్నాయి. పాక్ ప్రయోగించిన 90 శాతానికి పైగా ఆయుధాలను గాలిలోనే అడ్డుకుని పేల్చివేయగలుగుతున్నాయి. భారత్‌లోని 15 నగరాల్లో గల సైనిక స్థావరాలపై గురువారం తెల్లవారుజామున పాక్ దాడులు చేసింది. ఆ తర్వాత గురువారం మధ్యాహ్నం నుంచి జమ్మూ, ఉధంపూర్ వంటి అనేక చోట్ల భారత సైనిక పోస్టులపై, చివరికి పౌర ఆవాసాలపై కూడా వరుస దాడులకు దిగింది. ఇందుకోసం పాక్ వివిధ రకాల డ్రోన్లు, క్షిపణుల్ని ఉపయోగించింది. గురువారం నుంచి ఇప్పటివరకూ పాక్ 300 నుంచి 400కు పైగా తుర్కియే డ్రోన్లను భారత్‌పైకి ప్రయోగించిందని, వీటిలో అత్యధిక డ్రోన్లను

మిగతా 12వ పేజీలో...



13

నిత్యావసరాలకు కొరత లేదు

ఏ మాత్రం ఆందోళన అవసరం లేదు

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు: కేంద్రం

పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయన్న చమురు కంపెనీలు

ఐపీఎల్ వాయిదా



'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో వారంపాటు నిలిపివేత

58 మ్యాచ్‌లు పూర్తి.. మిగిలినవి 16

భారత్‌ను వీడనున్న విదేశీ క్రికెటర్లు **9**



హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ (2024) క్రిస్టినా పిజ్‌కోవా **2**

హైదరాబాద్‌లో నేటి నుంచే మిస్‌వరల్డ్ పోటీలు

జెత్వానీ కేసులో పీఎస్ఆర్‌కు నో బెయిల్ **2**

కల్తీ నెయ్యి కేసులో 12 మందిపై

'సిట్' చార్జిషీటు **14**

మరో పది రోజుల్లో రెండోది కూడా..



త్రివిధ దళాధిపతులు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్, భద్రతా సలహాదారుతో ప్రధాని మోదీ సమావేశం

ఏ పరిస్థితులకైనా సిద్ధం!

దేశ రాజధాని ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం

ఎయిర్ సైరన్ల ఏర్పాటు.. మాక్‌డ్రిల్స్ నిర్వహణ

పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు రద్దు

దేశవ్యాప్తంగా ఆరోగ్య శాఖ సన్నద్ధతపై నడ్డా సమీక్ష

15 వరకు 24 విమానాశ్రయాల మూసివేత

చండీగఢ్‌లో మళ్లీ సైరన్లు.. జమ్మూలో బ్లాక్ అవుట్

న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్‌తో యుద్ధవాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రాష్ట్రాలు కూడా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నాయి. సరిహద్దు రాష్ట్రాల్లో పాఠశాలల మూసివేత, రాత్రివేళ విద్యుత్తు కోత, ఉద్యోగులకు సెలవులు రద్దు వంటి చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో దేశ రాజధాని ఢిల్లీలో భారీగా బలగాలను మోహరించడంతో పాటు కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు, ఎయిర్ సైరన్ల ఏర్పాటు, మాక్ డ్రిల్స్

మిగతా 13వ పేజీలో...



తిరుమల ఆలయం ముందు ఆక్టోపస్ బలగాలు

తిరుపతి, విశాఖ, బెజవాడ ఎయిర్‌పోర్టుల్లో గట్టి నిఘా

ఆక్టోపస్ నిఘాలోకి తిరుమల

రంగంలోకి ప్రాదేశిక సైన్యం!

అవసరమైతే పిలిపించాలన్న కేంద్రం

ఆర్మీ చీఫ్‌కు మరిన్ని అధికారాల అప్పగింత

టెరిటోరియల్ ఆర్మీలో 50 వేల సిబ్బంది **13**

వీరిలో క్రీడాకారులు, రాజకీయ నేతలూ..

గతంలో పలు యుద్ధాల్లో ఆర్మీకి సహకారం




ప్రాదేశిక సైన్యంలో క్రికెటర్ ధోని (ఫైల్)

సింధు జలాలపై మేమేం చేయలేం! **12**

మాది సహాయక పాత్రే: ప్రపంచ బ్యాంకు

పాక్‌కు మరోసారి గట్టి ఎదురుదెబ్బ



షెహబాజ్



షాహిద్

పాక్ ప్రధాని పిరికిపంద

మోదీ పేరు పలికేందుకే షెహబాజ్ వణుకుతున్నారు

సింహాల సైన్యాన్ని నక్క నడిపిస్తే యుద్ధంలో ఓటమే

ప్రధానికే ధైర్యం లేనప్పుడు సైనికులు ఎలా పోరాడతారు?: పాక్ విపక్ష ఎంపీ షాహిద్ ధ్వజం

భారత డ్రోన్ దాడులపై ఆ దేశ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రతిపక్ష సభ్యులు

న్యూఢిల్లీ, మే 9: భారత్‌తో ఉద్రిక్తతల వేళ పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీ అట్టుడికింది. ఆపరేషన్ సిందూర్‌తో పాటు పాక్‌లోని అనేక ప్రాంతాల్లో డ్రోన్లతో భారత్ దాడులు చేసిన నేపథ్యంలో విపక్షాలు ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై విమర్శలు ఎక్కుపెట్టాయి. ప్రధాని షెహబాజ్ పిరికిపంద అని ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పీటీఐ పాక్ ఎంపీ షాహిద్ అహ్మద్ ఖట్టర్

మిగతా 12వ పేజీలో...

వెంకట్రామిరెడ్డి గీత దాటారు!



అభియోగాలు నిర్ధారించిన కడప కలెక్టర్ **2**

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసుల్లో చార్జిషీట్లు.. రోసా రూల్స్ ఉల్లంఘనపై జీఏడీ గప్‌చుప్.. ఆ ఊసే లేకుండా చేసిన ఆయన సహచరులు

జగన్ వీరభక్తుడిని కాపాడే యత్నాలు.. సచివాలయ ఉద్యోగ వర్గాల్లో చర్చ

ఇక 'లిక్కర్' బాసుల వంతు

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పకు నోటీసులు

రేపు విచారణకు రావాలని పిలిచిన సిట్.. హైదరాబాద్‌లోని ఇళ్లకు బృందాలు

అప్పటికే ఆ ముగ్గురూ అజ్ఞాతంలోకి.. దీంతో వారి ఇళ్లలోనివారికి నోటీసులు **2**

'బెయిల్'పై 13న హైకోర్టు విచారణ.. 11న సిట్ ముందు హాజరు అనుమానమే!

ధర్నా చేయడానికి వెళుతున్నట్టు చెప్పారు

టీడీపీ కార్యాలయంపై దాడి విషయం తెలియదు **14**

సీఐడీ విచారణలో సజ్జల వెల్లడి.. చాలా ప్రశ్నలకు దాటవేత ధోరణి

జూలై 10కి జలాలు

హంద్రీ-నీవా నీటి విడుదలపై సీఎం ప్రకటన

పనుల పూర్తికి 3,873 కోట్లు ఖర్చు చేస్తున్నాం

ఫేజ్-1లో 1.98 లక్షల ఎకరాలకు సాగునీరు

తర్వాతి దశలో 4.04 లక్షల ఎకరాలకు

ఈ ప్రాజెక్టుపై గత పాలకుల నిర్లక్ష్యం

మా ప్రభుత్వం వచ్చాకే పనుల్లో వేగం

రాష్ట్రమంతటా సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం

పీ-4తో పేదరిక నిర్మూలనకు శ్రీకారం

ఛాయాపురం ప్రజావేదికలో చంద్రబాబు వెల్లడి

ఒకప్పుడు కోనసీమ అందాల సీమ. సినిమాలు తీసేవారు. అక్కడ నీళ్లున్నా అవకాశాలు లేవు. ఇప్పుడు అనంతపురం జిల్లాకు నీళ్లు వచ్చాయి.. అవకాశాలు పెరిగాయి. దీని మూలంగా అభివృద్ధిలో అనంతపురం జిల్లా 13వ స్థానానికి చేరుకుంది. అయితే ఇది టాప్ 3లో ఉండాలి.

\- సీఎం చంద్రబాబు



హంద్రీనీవా పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల

అనంతపురం మే 9 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా సుజల స్రవంతి ద్వారా ఈ ఏడాది జూలై 10న నీటిని విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ పథకం ఫేజ్-1, 2 కింద 554 కిలోమీటర్ల మేర కాలువ విస్తరణ, లైనింగ్ పనులకు రూ.3,873 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. గత పాలకుల

మిగతా 10వ పేజీలో...

మహానాడుపై సందిగ్ధత!

దేశమంతా యుద్ధ వాతావరణం **10**

పార్టీ వేడుక నిర్వహణ సరికాదని చర్చ

వాయిదా లేదా కుదింపుపై 14న నిర్ణయం

జీవో 117కు ప్రత్యామ్నాయ జీవో

నేడు విడుదల చేసే అవకాశం **2**

తొమ్మిది రకాలుగా పాఠశాలలు

అందుకనుగుణంగా టీచర్ల బదిలీలు

సీఎస్ కంటే నేనే సుప్రీం!

తీరు మార్చుకోని సీఐసీ బాషా

ఆర్టీఐ కార్యదర్శికి సహకరించొద్దని పేర్కొంటూ సిబ్బందికి సర్క్యులర్ **10**

ఆఫీసులోకి రానివ్వొద్దని హుకుం

వెంకట్రామిరెడ్డి గీత దాటారు!

- అభియోగాలు నిర్ధారించిన కడప కలెక్టర్
- జగన్ వీరభక్తుడిని కాపాడే యత్నాలు!

అమరావతి, మే 9 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో బహిరంగంగానే వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసిన ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌కు వీరవిధేయుడు, పరమభక్తుడైన కె.వెంకట్రామిరెడ్డిపై నమోదైన అభియోగాలు రుజువైనట్లు పంచాయతీరాజ్ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఏపీ కాండక్ట్ నిబంధనలు.. (19(1),(5), 3(1),(2)ను ఆయన ఉల్లంఘించారని కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తన నివేదికలో ధ్రువీకరించినట్లు సమాచారం. సంబంధిత రిపోర్టును ఆయన 25 రోజుల క్రితమే ప్రభుత్వానికి అందజేసినట్లు తెలిసింది. అలాగే ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, మైదుకూరులో ఎన్నికల అధికారులు పోలీసు కేసులు నమోదు చేశారు. వీటిపై చార్జిషీట్లు నమోదైనట్లు సమాచారం. 2024 మార్చి 31న ఈ నాలుగు చోట్ల వెంకట్రామిరెడ్డి ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకుడు చంద్రయ్యతో కలిసి వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసి కోడ్‌ను ఉల్లంఘించారు. ఇందుకుగాను 2024 మార్చి 18న ఆయన్ను సస్పెండ్ చేశారు. వెంకట్రామిరెడ్డి పంచాయతీరాజ్ శాఖలో సెక్షన్ అధికారి. ప్రస్తుతం ఇన్‌చార్జి అసిస్టెంట్ పోస్టులో ఉన్నారు. వైసీపీ ప్రభుత్వంలోనే గాక టీడీపీ కూటమి సర్కారు వచ్చాక కూడా నిబంధనలకు విరుద్ధంగా ఆయనకు ఊరట లభిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ప్రభుత్వం మారినప్పుడు తొలుత ఆయనపై అభియోగాలు నమోదు చేయలేదు. పైగా ఏకంగా సస్పెన్షన్ ఎత్తివేతను ప్రతిపాదిస్తూ ఫైలు పెట్టారు. విషయం బయటకు పొక్కడంతో ఆ ఫైలును ఆపేసి అభియోగాలు నమోదు చేస్తూ గత ఏడాది ఆగస్టు 21న జీవో ఇచ్చారు. 10 రోజుల్లో దీనిపై వెంకట్రామిరెడ్డి వివరణ ఇవ్వకపోతే నేరుగా శాఖాపరమైన చర్యలు నేరుగా తీసుకుంటామని పేర్కొన్నారు. కానీ ఆ తర్వాత రోసా రూల్స్ వర్తించకుండా ఉండేలా ఆ ఫైలును జీఏడీకి పంపారు. జీఏడీలో ఉన్న ఆయన అనుచర ఉద్యోగులు రోసా రూల్స్ ఉల్లంఘనల ఊసే లేకుండా చేశారు. అలాగే కోడ్ ఉల్లంఘన కేసుల్లో చార్జిషీట్లు దాఖలైనట్లు ప్రభుత్వానికి నివేదిక అంది 25 రోజులైనా ఇప్పటివరకు కదలిక లేదు. రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో వైసీపీ వీరభక్తుడిని ఇంతలా కాపాడాల్సిన అవసరం ఏముందో ప్రభుత్వ పెద్దలకే తెలియాలని ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

గ్రూప్ 1 కేసులో ఇన్‌స్పెక్టరు 'అతి'

- ధాత్రి మధు అరెస్టు సమయంలో 'మంచోడు' మాట

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రూపు1 పరీక్షా పత్రాల డిజిటల్ మూల్యాంకనం స్కామ్ కేసులో నిందితుల అరెస్టు సమయంలో ఓ ఇన్‌స్పెక్టరు 'అతి' చేశారు. వివరాలివీ.. ఏపీపీఎస్సీ కార్యదర్శిగా పీఎస్ఆర్ ఉండగా, ఆయన డైరెక్షన్‌లో 'కామ్‌సైన్' డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదనరావు (ధాత్రి మధు) అడ్డదారులు తొక్కినట్టు సిట్ గుర్తించింది. ఏ2గా నిందితుల జాబితాలో చేర్చి ధాత్రి మధును అరెస్టు చేసి జైలుకు పంపింది. అంతకుముందు....హైదరాబాద్ వెళ్లి ధాత్రి మధును అరెస్టు చేసే పనిని ఓ ఇన్‌స్పెక్టర్‌కు సిట్ అప్పగించగా.. "గ్రూపు 1 కేసును అనవసరంగా నమోదు చేశాం సార్..." 'మధు మంచోడు సర్' అనే అర్థం వచ్చేలా ఓ సీఐ మాట్లాడటంతో సెల్ కాన్ఫరెన్స్‌లో ఉన్న ఇద్దరు ఏసీపీలకు చిర్రెత్తింది. ముందు చెప్పిన పని చేయండి అంటూ గట్టి ఆదేశాలు ఇచ్చారు. దీనితో మధుసూదన్‌ను అరెస్టు చేసి విజయవాడకు తరలించారు. ఈ వ్యవహారాన్ని సిట్ అధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. ఆ ఇన్‌స్పెక్టర్‌పై విజయవాడ కమిషనర్‌కు నోట్ పెట్టాలని అధికారులు భావిస్తున్నారు.

నాటి ఇసుక అక్రమాలపై చర్యలు తీసుకుంటున్నాం

- తుది నివేదికకు ఇంకాస్త సమయమివ్వండి.. ఏపీ వినతికి సుప్రీం సమ్మతి

న్యూఢిల్లీ, మే 9 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు కొనసాగుతున్నాయని సుప్రీంకోర్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. తుది నివేదిక అందజేయడానికి మరికాస్త సమయం కావాలని విజ్ఞప్తి చేసింది. గత ప్రభుత్వంలో ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి జేపీ వెంచర్స్‌కు వ్యతిరేకంగా జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) తీర్పు ఇచ్చింది. ఆ సంస్థకు దాదాపు రూ.18 కోట్ల జరిమానా విధించింది. ఈ తీర్పును జేపీ వెంచర్స్ 2023 మే 15న సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. గత విచారణ సందర్భంగా.. మరోసారి సమగ్ర నివేదిక సమర్పించాలని భావిస్తున్నట్లు ఏపీ సర్కారు కోర్టుకు తెలిపింది. ఈ క్రమంలో గత నివేదికలోని అంశాలు, తాజాగా తీసుకున్న చర్యలు తదితర అంశాలతో కూడిన సమగ్ర తుది నివేదిక అందించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. గత ప్రభుత్వ హయాంలోని ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటున్నామని.. తుది నివేదిక సమర్పించడానికి ఇంకొంత సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది అభ్యర్థించారు. దానిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. విచారణను ఆగస్టు 1కి వాయిదా వేసింది.

పీఎస్ఆర్ బెయిల్‌కు విజయవాడ కోర్టు నిరాకరణ

విజయవాడ, మే 9(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుకు విజయవాడ కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. కాదంబరి జెత్వానీపై అక్రమంగా కేసు నమోదు చేయించిన కేసులో పీఎస్ఆర్ అరెస్టయి విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు, కిడ్నాప్ కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ మూడోసారి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో శుక్రవారం వాదనలు ముగిశాయి. న్యాయాధికారి తీర్పును ఈ నెల 13కి రిజర్వు చేశారు.

జగన్ జెడ్‌ప్లస్ భద్రత పిటిషన్‌పై వివరాలు ఇవ్వండి

- కేంద్ర హోంశాఖకు హైకోర్టు ఆదేశం
- సమయం కావాలన్న డిప్యూటీ సొలిసిటర్ జనరల్
- తదుపరి విచారణ వేసవి సెలవుల తరువాతకి వాయిదా

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): జెడ్‌ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ప్రతివాదులను ఆదేశించింది. కేంద్ర హోం కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, సీఆర్‌పీఎఫ్, ఎన్ఎస్‌జీ, రాష్ట్ర హోం ముఖ్యకార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. విచారణను వేసవి సెలవుల తరువాతకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. తనకు జెడ్‌ప్లస్ భద్రత పునరుద్ధరించేలా, ఎన్ఎస్‌జీ లేదా సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో సెక్యూరిటీ కల్పించాలన్న వినతిని పరిగణనలోకి తీసుకొనేలా కేంద్ర హోంశాఖను ఆదేశించాలని కోరుతూ పులివెందుల ఎమ్మెల్యే జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. జగన్ భద్రతను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇటీవల ఘటనలు చూస్తే పిటిషనర్ భద్రత, స్వేచ్ఛ ప్రమాదంలో ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర హోంశాఖకు వినతులు సమర్పించామన్నారు. భద్రత కుదింపుపై హైకోర్టులో గతంలో ఓ వ్యాజ్యం దాఖలు చేశామన్నారు. కేంద్ర హోంశాఖ తరఫున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) పసల పొన్నారావు స్పందిస్తూ.. ఈ వ్యవహారంపై వివరాలు కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. భద్రత విషయంలో పిటిషనర్ గత వ్యాజ్యంలో కూడా కేంద్ర హోంశాఖను ప్రతివాదిగా చేర్చారన్నారు. పిటిషన్ విచారణ పెండింగ్‌లో ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శిని ఆదేశించారు.

ఇక 'లిక్కర్' బాసుల వంతు

ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పకు నోటీసులు.. రేపు విచారణకు రావాలని పిలిచిన సిట్

- హైదరాబాద్‌లోని వారి ఇళ్లకు టీమ్‌లు
- అప్పటికే ఆ ముగ్గురూ అజ్ఞాతంలోకి.. దీంతో వారి ఇళ్లలోని వారికి నోటీసులు
- 'బెయిల్' పిటిషన్లపై 13న హైకోర్టు విచారణ
- 11న సిట్ ముందుకు వారు వచ్చేది అనుమానమే!




రోహిత్‌రెడ్డికి, గోవిందప్ప భార్యకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

అమరావతి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఒకరు నిత్యం జగన్ వెంట ఉండే బంటు ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డి. మరొకరు ఐదేళ్లపాటు సీఎంవోలో అన్నీ తానై వ్యవహరించిన సీఎం కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి. మూడోవ్యక్తి పదిహేనేళ్లుగా భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్‌గా ఉంటూ ఆర్థిక వ్యవహారాలు, ఇతర లావాదేవీలు చక్కబెడుతున్న గోవిందప్ప బాలాజీ! రూ.వేల కోట్ల మద్యం స్కామ్‌లో ఈ ముగ్గురినీ ఆదివారం విచారణకు రమ్మని సిట్ నోటీసులు జారీ చేసింది. శుక్రవారం హైదరాబాద్ వెళ్లిన మూడు బృందాలు అత్తాపూర్‌లోని ఉప్పరపల్లి సన్‌రైజ్ విల్లాలో ఉన్న కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికెళ్లాయి. ఆయన లేకపోవడంతో కుమారుడు రోహిత్‌రెడ్డి చేతికి నోటీసు ఇచ్చాయి. గోవిందప్ప ఇంటికెళ్లి ఆయన భార్యకు నోటీసు అందజేశారు. ధనుంజయ్ రెడ్డి ఇంట్లో లేకపోవడంతో కుటుంబసభ్యులకు ఇచ్చి వెనుదిరిగారు. వేల కోట్ల మద్యం కుంభకోణానికి పాల్పడిన తాడేపల్లి ప్యాలెస్ ముఖ్యులకు అతి దగ్గరగా ఉండే ఈ ముగ్గురు మొత్తం కుట్రలో భాగస్వాములని సిట్ ఇప్పటికే కోర్టుకు తెలిపింది. స్కామ్‌లో కింగ్ పిన్‌గా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి (ఏ1), వాసుదేవరెడ్డి (ఏ2), విజయసాయిరెడ్డి (ఏ4), మిథున్ రెడ్డి (ఏ6)తో కలిసి అన్ని స్థాయిల్లోనూ సమావేశమై వీరు చర్చలు జరిపారని గుర్తించింది. ఏ31గా ధనుంజయ్‌రెడ్డి, ఏ32గా కృష్ణమోహన్‌రెడ్డి, ఏ33గా గోవిందప్పని నిందితుల జాబితాలో చేర్చింది. హైకోర్టును ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించినా వీరికి ఎలాంటి ఉపశమనం లభించలేదు. దీంతో సిట్ అధికారులు ఎప్పుడైనా అరెస్టు చేస్తారనే అనుమానంతో ముందస్తు బెయిల్ పిటిషన్ హైకోర్టులో దాఖలు చేసి ముగ్గురూ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నెల 13న హైకోర్టులో పిటిషన్‌పై విచారణ ఉన్నందున 11న సిట్ ముందుకు వస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఐదేళ్లపాటు అన్నీ తానై..

ఉమ్మడి కడప జిల్లా రాయచోటి ప్రాంతానికి చెందిన ధనుంజయ్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి సన్నిహితంగా ఉండేవారు. వైఎస్ కోటరీలో ధనుంజయ్‌రెడ్డి కీలక సభ్యుడనే వ్యాఖ్యలు వినిపించేవి. రాష్ట్ర విభజన తర్వాత 2019లో జగన్ సీఎం అయ్యాక ధనుంజయ్ రెడ్డికి తిరుగులేని పెత్తనం వచ్చేసింది. సీఎస్, డీజీపీ లాంటి వారి నియామకానికి ముందే సీఎంవో కార్యదర్శిగా నియమితులయ్యారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎందరో అధికారులను మార్చేసినా ధనుంజయ్ రెడ్డి మాత్రం సీఎంవో నుంచి పక్కకు కదల్లేదు. అపరిమితమైన అధికారాలు చెలాయిస్తూ ప్రతి పనిలోనూ వేలు పెట్టి కీలక వ్యవహారాలు చక్కబెట్టారు. జగన్ తరఫున అనేక వ్యవహారాలు చక్కబెట్టిన ఆయన మద్యం స్కామ్‌లోనూ కీలకంగా వ్యవహరించారు. ఏపీఎస్‌బీసీఎల్ ఎండీగా వాసుదేవరెడ్డిని, ఓఎస్‌డీగా సత్యప్రసాద్‌ను నియమించడం నుంచి రాజ్ కసిరెడ్డి పంపించే భారీ నగదు తాడేపల్లి పెద్ద చెప్పిన చోటుకు చేర్చేదాకా... ధనుంజయ్‌రెడ్డి పాత్రను నిర్ధారించే ఆధారాలను సిట్ సేకరించింది. అంతిమ లబ్ధిదారు ఎవరనేది తేల్చే పనిలో పడింది.

ముడుపులు మళ్లించిన గోవిందప్ప..

ఉమ్మడి చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన గోవిందప్ప భారతీ సిమెంట్స్‌లో 2010 ఏప్రిల్ నుంచి పూర్తి కాలపు డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. వృత్తిరీత్యా చార్టెడ్ అకౌంటెంట్ కావడంతో భారతీ సిమెంట్స్ ఆర్థిక, ఆదాయ పన్ను వ్యవహారాలు చూసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక లిక్కర్ పాలసీ నుంచి ముడుపుల వసూళ్ల వరకూ ప్రతి అడుగులోనూ ఆయన పాత్ర ఉంది. మద్యం ముడుపులు మళ్లింపులో కీలక పాత్ర పోషించారు. రాజ్ కసిరెడ్డి తెచ్చి ఇచ్చిన కోట్లాది రూపాయలు ఊరు పేరు లేని కంపెనీల్లోకి గోవిందప్ప మళ్లించారు. మొత్తం బాగోతాన్ని పసిగట్టిన సిట్ అధికారులు ఆయనను విచారించి అంతిమ లబ్ధిదారు ఎవరో తేల్చబోతున్నారు.

వైఎస్.. విజయమ్మ.. జగన్‌తో..

గతంలో ఆర్డీవోగా పనిచేసిన కృష్ణమోహన్‌రెడ్డిది నల్లగొండ జిల్లా. వైఎస్ హయంలో పులివెందుల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్‌గా పనిచేస్తూ రాజశేఖరరెడ్డి కుటుంబానికి దగ్గరయ్యారు. వీఆర్ఎస్ తీసుకుని వైఎస్ తర్వాత జగన్ చెంతకు చేరారు. అక్రమాస్తుల కేసులో సీబీఐ జగన్‌ను అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు విజయమ్మ వద్ద ఓఎస్‌డీగా పనిచేసిన కృష్ణమోహన్‌రెడ్డి ఆ కుటుంబంలో ఒకరయ్యారు. మాజీ మంత్రి వైఎస్ వివేక మరణ వార్త జగన్‌కు చెప్పేందుకు కడప ఎంపీ అవినాశ్ రెడ్డి ఫోన్ చేసింది కృష్ణమోహన్ రెడ్డి నంబర్‌కే. కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు కడప సెంట్రల్ జైలు లోపల క్యాంపు ఆఫీసు ఏర్పాటు చేసుకుని అప్పట్లో కృష్ణమోహన్‌రెడ్డిని పిలిచారు. విచారణకు హాజరైన ఆయనను అప్పటి సీఎస్ జవహర్ రెడ్డి కారులో వెళ్లి తీసుక రావడం సంచలనమైంది. తాడేపల్లి, పులివెందుల, ఇడుపులపాయ, లోటస్ పాండ్, యలహంక ప్యాలెస్‌లలో జగన్ కుటుంబ సభ్యుడిలా ఉండే కృష్ణమోహన్ రెడ్డికి మద్యం ముడుపులు ఎక్కడికి చేరాయో తెలుసునని సిట్ బలంగా నమ్ముతోంది. దానిపై విచారించేందుకే ఆయనకు సిట్ అధికారులు నోటీసు ఇచ్చారు.

లోకం తీరు



'గ్రిడ్' కుప్పకూలకుండా చూడండి!

- పాక్‌తో తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం సూచన

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో పలు రాష్ట్రాల్లో రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఇది ట్రాన్స్‌మిషన్ గ్రిడ్‌పై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఇదే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేని రాష్ట్రాల్లో డిమాండ్ అమాంతం పెరిగితే.. స్థానికంగా లభ్యమయ్యే కరెంటు సరిపోదు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ గ్రిడ్ తీవ్ర ప్రభావానికి గురవుతుంది. గ్రిడ్ కుప్పకూలే ప్రమాదం కూడా ఉంటుంది. దానిని పునరుద్ధరించి సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు రోజుల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో అలాంటి పరిస్థితులను నివారించేందుకు రాష్ట్రాలు విద్యుత్ డిమాండ్ మరీ ఎక్కువగా, మరీ తక్కువగా ఉండకుండా సమన్వయం చేసుకోవాలని, గ్రిడ్ వ్యవస్థ కుప్పకూలకుండా చూసుకోవాలని కేంద్ర ఇంధన శాఖ సూచించింది. దీనివల్ల గ్రిడ్ కుప్పకూలకుండా ఉంటుందని స్పష్టం చేసింది. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు తీవ్రమైనప్పటికీ దక్షిణాది రాష్ట్రాలపై విద్యుత్ సరఫరా ఆంక్షలేవీ లేవు. రాత్రి వేళల్లో సరఫరా ఆపేయాలంటూ కేంద్రం నుంచి ఎలాంటి ఆదేశాలూ రాలేదు. అయినప్పటికీ.. గ్రిడ్ సామర్థ్యంపైన, కరెంటు హెచ్చుతగ్గులపైన అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాల విద్యుత్ లోడ్ డిస్పాచ్ సెంటర్ల(ఎస్ఈఎల్‌డీసీ)కు సూచించింది. దీంతో.. రాష్ట్ర ఎస్ఈఎల్‌డీసీ అప్రమత్తమైంది.

నేటి నుంచే మిస్ వరల్డ్ పోటీలు

- 109 దేశాల సుందరీమణుల రాక
- బస చేసిన హోటల్ నుంచి పోటీల దాకా పటిష్ఠ బందోబస్తు



హైదరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్-2025 పోటీలు శనివారం ప్రారంభం కానున్నాయి. భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సర్కారు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. చీమ చిటుక్కుమన్నా తెలిసేలా పోలీసులు నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు 109 దేశాలకు చెందిన సుందరీమణులు, ప్రతినిధులు రాష్ట్రానికి రావడంతో భద్రత విషయంలో ఏమాత్రం రాజీపడకుండా వ్యవహరిస్తున్నారు. దాదాపు 5వేల మందికి పైగా పోలీసులను ఈ పోటీల నిమిత్తం రంగంలోకి దించారు. వీరిలో అత్యధిక మంది సాయుధ పోలీసులే. పోటీల ప్రారంభ వేడుకలు జరిగే గచ్చిబౌలి స్టేడియంతో పాటు అతిథులు బస చేసి ఉన్న హోటళ్ల వద్ద షార్ప్ షూటర్లను, స్నైపర్లను మోహరించారు. పోటీదారులకు హైదరాబాద్ హైటెక్‌సిటీలోని ఓ స్టార్ హోటల్‌లో బస ఏర్పాటు చేశారు. ఆ హోటల్‌తోపాటు ఆ ప్రాంతం మొత్తం నిఘా వ్యవస్థను పటిష్ఠం చేశారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్, క్విక్ రియాక్షన్ టీమ్స్‌ను ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లతోపాటు వేదిక వద్ద మోహరిస్తున్నారు. మొత్తం మూడంచెల భద్రతావలయంలో పోటీలు జరుగుతాయని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు.. తెలంగాణ కళారూపాలన్నింటినీ సమ్మిళితం చేసి.. అందాల పోటీల వేదికగా తెలంగాణ ఖ్యాతిని, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పనున్నారు. ప్రపంచదేశాల నుంచి హైదరాబాద్ వచ్చిన సుందరీమణులను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద కూచిపూడి, భరత నాట్యం, పేరిణి, కథక్, డప్పులు, బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు.

డిప్యూటీ కలెక్టర్‌కు డిమోషన్

- తహసీల్దార్‌గా పంపించాలని రాష్ట్ర సర్కారుకు సుప్రీం ఆదేశం
- కోర్టు ధిక్కరణ కింద చర్యలు

న్యూఢిల్లీ, మే 9(ఆంధ్రజ్యోతి): ఏపీకి చెందిన డిప్యూటీ కలెక్టర్ తాతా మోహన్‌రావు పదవిని తహసీల్దార్‌కు తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. తహసీల్దార్ హోదాలో ఉన్నప్పుడు గుంటూరు జిల్లాలో మురికివాడల్లోని గుడిసెలను బలవంతంగా తొలగించడంపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. తహసీల్దార్‌గా డిమోట్ చేయడంతోపాటు రూ.లక్ష జరిమానా విధించింది. గుంటూరు తహసీల్దార్‌గా పనిచేసిన మోహన్‌రావుకు మురికివాడల్లోని గుడిసెలు తొలగించవద్దని 2013 డిసెంబరు 11న హైకోర్టు ఆదేశించింది. ఆయన ఈ ఆదేశాలను ఉల్లంఘించి 2014లో గుడిసెలు తొలగించారు. దీంతో ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న మోహన్‌రావుకు హైకోర్టు.. 'కోర్టు ధిక్కరణ' చర్యల కింద 2 నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. హైకోర్టు తీర్పును మోహన్‌రావు ఈ ఏడాది మార్చి 13న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. గత విచారణ సందర్భంగానే జైలుకెళ్లకుండా ఉండాలంటే, పిటిషనర్ డిమోషన్‌కు సిద్ధంగా ఉన్నారా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనికి మోహన్‌రావు నిరాకరించడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో మోహన్‌రావును ఒప్పించేందుకు సమయం కావాలని న్యాయవాది దేవాశిష్ సమయం కోరడంతో ధర్మాసనం అంగీకరించింది. ఈ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ఏజీ మాసిహ్ ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది దేవాశిష్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్, అతని కుటుంబం మొత్తం రోడ్డున పడతాయని తెలిపారు. పిటిషనర్‌కు 11వ, 12వ తరగతి చదువుతున్న పిల్లలు ఉన్నారని, వారి విద్య మధ్యలో ఆగిపోయే ప్రమాదముందని పేర్కొన్నారు. 'మురికివాడల్లో జీవిస్తున్నవారి నిర్మాణాలను కూల్చివేసి, వారి వస్తువులతో పాటు వారిని రోడ్డుపై పడేసినప్పుడు ఇవన్నీ గుర్తుకు రాలేదా?" అని ఈ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్ ఎలాంటి క్షమకు అర్హులు కానప్పటికీ, అతని కుటుంబాన్ని బాధపెట్టకూడదని భావిస్తున్నామని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. డిప్యూటీ కలెక్టర్ 2 నెలల జైలు శిక్ష అనుభవిస్తే, ఉద్యోగాన్ని కోల్పోవాల్సి ఉంటుందన్నారు. అందువల్ల శిక్షలో దయ చూపిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది.

జీవో 117కు ప్రత్యామ్నాయ జీవో

- నేడు విడుదల చేసే అవకాశం!
- తొమ్మిది రకాలుగా పాఠశాలలు
- అందుకనుగుణంగా టీచర్ల బదిలీలు
- త్వరలోనే బదిలీలకు షెడ్యూలు

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలపై వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117 వివాదాస్పదంగా మారడంతో, ప్రత్యామ్నాయంగా కూటమి ప్రభుత్వం కొత్త జీవోను శనివారం విడుదల చేయనున్నట్లు తెలిసింది. ఈ ఫైలు ప్రస్తుతం సీఎం కార్యాలయంలో ఉంది. అక్కడ గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే జీవో విడుదల చేస్తారు. అందులో పేర్కొనే పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా ఉపాధ్యాయుల బదిలీలు చేస్తారు. త్వరలోనే బదిలీల షెడ్యూలు కూడా విడుదల కానుంది. గత ప్రభుత్వం జీవో 117తో ఆరు రకాల పాఠశాలలను అమల్లోకి తీసుకొచ్చింది. కొత్త విధానం తీసుకొస్తామన్న కూటమి ప్రభుత్వం తొలుత ఐదు రకాల పాఠశాలల విధానాన్ని ప్రతిపాదించి, ఇప్పుడు దానిని తొమ్మిది రకాలుగా మార్చింది. క్షేత్రస్థాయిలో ఏ పాఠశాలకు ఎంత మంది టీచర్లు అవసరమవుతారనేది అంచనా వేశారు. దీని ఆధారంగా బదిలీలు చేస్తారు.

రాష్ట్రంలో పెరిగిన ఎండ తీవ్రత

అమరావతి/విశాఖపట్నం, మే 9(ఆంధ్రజ్యోతి): వాయవ్య భారతం నుంచి పొడిగాలులు వీస్తుండడంతో కోస్తా, రాయలసీమల్లో ఎండ తీవ్రత పెరిగింది. రాయలసీమ కంటే కోస్తాలో ఉక్కపోత ఎక్కువగా ఉంది. శుక్రవారం కోస్తాలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు, రాయలసీమలో రెండు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ప్రకాశం జిల్లా దరిమడుగులో 42, తిరుపతి జిల్లా గంగుడుపల్లెలో 41.3, నంద్యాల జిల్లా దొర్నిపాడులో 40.9, శ్రీకాకుళం జిల్లా కొల్లివలసలో 40.7, చిత్తూరు జిల్లా పిపల్లి, నెల్లూరు జిల్లా దగదర్తిలో 40.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతతో వాతావరణ అనిశ్చితి నెలకొనడంతో పలుచోట్ల ఈదురుగాలులు, పిడుగులతో వర్షం కురిసింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు పడతాయని, మిగిలిన ప్రాంతాల్లో ఎండ తీవ్రత కొనసాగి ఉక్కపోత ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

ముగిసిన గ్రూప్-1 మెయిన్స్.. 75% హాజరు

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. మెయిన్స్‌కు 4,496 మంది ఎంపిక కాగా... హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నవారిలో సుమారు 75 శాతం మంది పరీక్షలు రాసినట్టు ఏపీపీఎస్సీ వెల్లడించింది. 89 పోస్టుల భర్తీకి నిర్వహించిన మెయిన్స్ పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా 13 కేంద్రాల్లో ఈ నెల 3 నుంచి 9 వరకు జరిగాయి.

గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌కు అశ్రునివాళి

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



కానిస్టేబుల్ కల్యాణ్(ఫైల్)



గౌరవ సూచకంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

పీసీపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల దాడిలో మృతి చెందిన ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలం ముద్దపాడు గ్రామానికి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ నూగతోటి పవన్‌కల్యాణ్‌కు పోలీసులు, ప్రజలు అశ్రు నివాళులర్పించారు. ప్రభుత్వ లాంఛనాలతో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి పవన్‌కల్యాణ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. సంతాప సూచికంగా పోలీసులు మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి అంతిమ వీడ్కోలు పలికారు.

అనాథ పిల్లలకు.. పవన్ జీతం

తల్లిదండ్రులు లేని వాళ్లకు వేతనం విరాళం



ఓ చిన్నారితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

- పిఠాపురం నియోజకవర్గానికి చెందిన 42 మందికి రూ.5 వేల చొప్పున పంపిణీ
- ఇకపై ప్రతి నెలా ఇంటి వద్దే అందించేలా ఏర్పాట్లు
- ప్రభుత్వం, పదవి ఉన్నంత కాలం ఈ సాయం కొనసాగుతుందని పవన్ వెల్లడి

అమరావతి/పిఠాపురం, మే 9 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మరోసారి గొప్ప మనసు చాటుకున్నారు. తన వేతనం మొత్తాన్ని తల్లిదండ్రులు లేని అనాథ బిడ్డల భవిష్యత్తు, చదువుకు ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో తాను ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గానికి చెందిన 42 మంది అనాథ పిల్లలకు పవన్‌కల్యాణ్ తన వేతనం నుంచి ఒక్కొక్కరికి నెలకి రూ.5 వేల చొప్పున రూ.2.10 లక్షల ఆర్థిక సాయం అందించారు. మిగిలిన మొత్తాన్ని కూడా వారి బాగోగులు చూసేందుకే ఖర్చు చేయనున్నట్టు ప్రకటించారు. అందుబాటులో ఉన్న 32 మందికి పవన్ స్వయంగా ఈ ఆర్థిక సాయాన్ని అందజేశారు. మిగిలిన 10 మందికి జిల్లా యంత్రాంగం ద్వారా అందిస్తామని తెలిపారు. ఇకపై పిల్లల ఇంటి వద్దే ఈ మొత్తాన్ని ప్రతి నెలా అందజేసే విధంగా చర్యలు తీసుకుంటానని పవన్ పేర్కొన్నారు. ప్రభుత్వం, పదవీ ఉన్నంత కాలం తాను వేతన రూపంలో తీసుకునే మొత్తాన్ని తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని అనాథ పిల్లల కోసం ఖర్చు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు.

ప్రజలిచ్చిన అధికారం నుంచి వచ్చే జీతమే..

పిఠాపురం నియోజకవర్గంలో తల్లిదండ్రులు లేని పిల్లలను గుర్తించి వారితో క్యాంపు కార్యాలయంలో పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు. పిల్లలు, వారి సంరక్షకులతో మాట్లాడి క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత వేతనం తీసుకోకూడదని నిర్ణయించుకున్నాను. అయితే ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్న భావనతోనే జీతం తీసుకున్నాను. ఆ మొత్తాన్ని నన్ను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ పరిధిలో తల్లిదండ్రులకు దూరమైన పిల్లల భవిష్యత్తు, వారి చదువుల కోసం ఖర్చు చేయాలనుకున్నాను. ప్రభుత్వం, పదవి ఉన్నంతకాలం నా జీతం మొత్తం అనాథ బిడ్డల సంక్షేమానికి వినియోగిస్తాను' అని పవన్ పేర్కొన్నారు. పిఠాపురం ప్రజలు తనను ఎంతో నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధితో పాటు సమస్యలను పరిష్కరించడం తన బాధ్యత అన్నారు. పిఠాపురం ప్రజలు ఇచ్చిన అధికారం ద్వారా వచ్చిన జీతాన్ని అక్కడే వినియోగించాని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే నియోజకవర్గ పరిధిలోని తల్లిదండ్రులు లేని బిడ్డల కోసం తన జీతం ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.కృష్ణతేజ, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్, పాడా డైరెక్టర్ చైత్రవర్షిణి పాల్గొన్నారు.

హత్తుకున్న అభిమానం..!

- 96 ఏళ్ల అవ్వకు పవన్ పాదాభివందనం
- స్వయంగా వడ్డించి ఆమెతో కలిసి భోజనం
- చీర పెట్టి రూ.లక్ష బహూకరణ

అమరావతి, కొత్తపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో తన గెలుపు కోసం వేగులమ్మ అమ్మవారికి మొక్కుకుని, తన పింఛను సొమ్ముతో ఆ మొక్కు చెల్లించిన 96 ఏళ్ల వృద్ధురాలు పోతుల పేరంటాలుకి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాదాభివందనం చేశారు. ఆమెను గుండెలకు హత్తుకుని.. స్వయంగా భోజనం వడ్డించారు. చీర బహూకరించి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. డిప్యూటీ సీఎం తనపై చూపిన ప్రేమకు ఆ వృద్ధురాలు ఆనందంతో పొంగిపోయింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లి మండలం కొత్త ఇసుకపల్లికి చెందిన పోతుల పేరంటాలు.. గత ఎన్నికల్లో పవన్ కల్యాణ్ విజయం సాధించాలని కోరుకూ గ్రామ దేవత వేగులమ్మకు మొక్కుకుంది. దీనికోసం నెలనెలా తనకు వచ్చే పింఛను సొమ్ములో కొంత దాచి రూ.27 వేలతో అమ్మవారికి గరగ చేయించి మొక్కు చెల్లించుకుంది. దీనిపై 'పవన్ గెలుపుతో మొక్కు తీర్చుకున్న 96 ఏళ్ల అవ్వ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 6న ప్రచురితమైన కథనం పవన్‌ను ఆకర్షించింది. ఒంటరి జీవితం గడుపుతూ సొంత ఇల్లు కూడా లేని ఆ అవ్వ గురించి తెలుసుకుని.. ఆమెను మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి తీసుకురావాలని అనుచరులను ఆదేశించారు. శుక్రవారం మంగళగిరి వచ్చిన ఆమెను చూసి పవన్ భావోద్వేగానికి గురయ్యారు. తనతో కలిసి భోజనం చేయాలనే అవ్వ కోరికను నెరవేర్చారు. గ్రామంలో అమ్మవారి గుడిని పునరుద్ధరించాలని ఆమె పవన్‌కు విజ్ఞప్తి చేయగా వారంలో పని మొదలుపెడతానని హామీ ఇచ్చారు. కారు దాకా నడిచి వచ్చి సాదరంగా వీడ్కోలు పలికారు.



కొత్త ఇసుకపల్లికి చెందిన పోతుల పేరంటాలును ఆప్యాయంగా హత్తుకున్న పవన్

ఎమ్మెల్సీగా కావలి గ్రీష్మ ప్రమాణ స్వీకారం



అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర శాసనమండలి సభ్యురాలిగా ఎన్నికైన కావలి గ్రీష్మ ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీ భవనంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు శుక్రవారం తన చాంబర్‌లో ఆమెతో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం శాసనమండలి నియమ నిబంధనలకు సంబంధించిన కిట్‌ను గ్రీష్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, గ్రీష్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రాజు రాకడకోసం..!

నేపాల్‌ను మళ్లీ హిందూ రాజ్యం చేయాలని, రాజు తిరిగి సింహాసనం అధిష్ఠించాలని డిమాండ్ చేస్తూ అక్కడ నిరసనలు సాగుతున్నాయి. రాజు రాకడకోసం సాగుతున్న ఈ ఉద్యమం నిర్దిష్టంగా, సంఘటితంగా లేకపోవడంతో ఆశించిన ఫలితం సాధించలేకపోతోందని, ఇకపై మరింత బలంగా ఆ పోరాటాన్ని కొనసాగించాలని రాచరిక అనుకూల సంస్థలు, పక్షాలు గురువారం తీర్మానించుకున్నాయి. ఈ నెల 29నుంచి మలిదశ ఉద్యమాన్ని మరింత తీవ్రతరంచేసి, ఆందోళనలు, నిరసనలతో అంతిమలక్ష్యాన్ని సాధించాలని సమావేశం నిర్ణయించింది. ఇది జరిగిన మర్నాడు ఇప్పటివరకూ విడివిడిగా ఉద్యమిస్తున్న కొన్ని చిన్నాచితకా పార్టీలు, సంస్థలు కూడా ఒకే గొడుగుకింద ఒక్కటిగా పోరాడటానికి తమ సంసిద్ధత ప్రకటించాయట. మొత్తంగా ఓ నలభై యాభై గ్రూపులు ఒక్కటైనాయట. రాచరిక అనుకూల శక్తులతో మాజీ రాజు జ్ఞానేంద్ర వరుసపెట్టి భేటీ అవుతూ వారిని ఏకం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్న పేరిట ప్రజల మధ్య నిత్యం తిరుగుతున్నారు. ఈ సంక్షోభసమయంలో ప్రజలంతా ఒక్కటి కావాలని, దేశాన్ని రక్షించుకోవాలని ఏవో రహస్య సందేశాలు కూడా ఇస్తున్నారు. ఇప్పటివరకూ ఎడమొఖం పెడమొఖంగా ఉంటున్న శక్తులన్నీ ఇకపై సంఘటితంగా ఉద్యమించి రాజును తిరిగి గద్దెమీద కూచోబెట్టడం ఖాయమని జ్ఞానేంద్ర అభిమానుల నమ్మకం.

రాచరిక అనుకూల ఉద్యమం బలహీనపడిందని, ఇక తేరుకోదని ఐదు రోజుల క్రితమే అధికారపక్షం తన సదస్సులో తీర్మానించిన నేపథ్యంలో, రాజ భక్తులంతా మళ్లీ ఇలా తమ ఉనికిని చాటుకొనే ప్రయత్నం చేస్తున్నారని విశ్లేషకుల అభిప్రాయం. ఈ ఉద్యమం ఇంకా సామాన్యుల మనసులను తాకలేదని ఓ వాదన. రాచరికం రావాలంటున్నవారు పలు డిమాండ్లతో ఉద్యమిస్తున్నారు. హిందూ రాజ్యం, రాజ్యాంగబద్ధమైన రాచరికం, రెండంచెల ఫెడరల్ వ్యవస్థ ఇత్యాదివి వాటిలో కొన్ని. నేపాల్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తుత విధానం పరిష్కరించలేదని, నాయకులు ప్రజల ఆశలను వమ్ముచేశారని రాచరిక అనుకూల శక్తుల వాదన. ప్రజాస్వామ్యం ముసుగులో ప్రజాధనం దోపిడీకి పాల్పడ్డారని, అందువల్ల దేశాన్ని ఇప్పటివరకూ ఏలిన రాజకీయనాయకుల ఆస్తిపాస్తులవివరాలు బయటపెట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

లౌకిక, గణతంత్ర రాజ్యంగా నేపాల్ అవతరించిన రెండుదశాబ్దాల అనంతరం మళ్లీ రాజురావాలంటూ నిత్యం ఆందోళనలు జరుగుతూండటం విచిత్రం, విషాదం. మార్చినెలాఖరులో సాగిన ఉద్యమం తీవ్రత కనీవినీ ఎరుగనిది. వేలాదిమంది వీధుల్లోకి వచ్చి నినాదాలు చేశారు, భద్రతాదళాలు విరుచుకుపడటంతో అది హింసాత్మకంగా మారి కొందరు మరణించారు కూడా. ఈ ఉద్యమంలో కీలకపాత్ర వహిస్తున్న మాజీ మార్క్సిస్టు గెరిల్లా, ప్రస్తుత బడావ్యాపారి దుర్గా ప్రసాయి భారతదేశానికి పారిపోయినట్టుగా వార్తలు రావడం, ఇటీవలే ఆయన అరెస్టు కావడం తెలిసిందే.

అధికారికంగా పదహారువేలమంది ప్రాణాలు తీసిన అంతర్యుద్ధం ముగిసి, రాజ్యాంగ రచన, రాచరికం రద్దు, గణతంత్ర రాజ్యస్థాపన జరిగిన తరువాత నేపాల్ అతివేగంగా అభివృద్ధిపథంలోకి దూసుకుపోతుందని అందరూ ఆశించారు. కానీ, 2008నుంచి ఇప్పటివరకూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడమే దానికి కష్టమైపోతోంది. పదిహేడు సంవత్సరాల్లో పదమూడు ప్రభుత్వాలు మారిపోవడం ఒక ఎత్తయితే, సైద్ధాంతికంగా పూర్తి భిన్నమైన పక్షాలు సైతం అధికారంకోసం కక్కుర్తిపడటం ఆశ్చర్యం. రాజకీయ అస్థిరత, అవినీతి కారణంగా ప్రజల్లో ప్రజాస్వామ్య వ్యవస్థలమీద నమ్మకం సడలిపోతోంది. ప్రచండ, కె.పి.శర్మ ఓలి అధికారమే పరమావధిగా దగ్గరవుతూ, వెంటనే వెన్నుపోట్లు పొడుచుకుంటూ, తమ రాజకీయ శత్రువులతో సైతం చేతులు కలుపుతూ ప్రదర్శిస్తున్న అధికారదాహం ప్రజలకు విరక్తికలిగించింది. అధిక ధరలు, అవినీతి, నిరుద్యోగం, మౌలిక రంగాల్లో ఏ మార్పూ లేకపోవడం వంటివి ప్రజలు మళ్లీ రాచరికంవైపు చూసేందుకు అవకాశం ఇస్తున్నాయి. ప్రచండ, ఓలి వర్గాలను అప్పట్లో ఏకం చేసిన మాజీ మావోయిస్టు దుర్గా ప్రసాయి వంటి వ్యాపారవేత్తలు ప్రజల్లో ఉన్న ఈ అసంతృప్తిని వాడుకొని రాజును మళ్లీ గద్దెనెక్కించేందుకు ప్రయత్నిస్తున్నారు. నారాయణహితిలో మళ్లీ జ్ఞానేంద్రను రాజుగా చూడాలనుకుంటున్న ఈ ఉద్యమం దీర్ఘకాలం నిలిచి, అంతిమంగా గెలుస్తుందా లేదా అన్నది ఇప్పుడే చెప్పలేం. కానీ, ప్రజల్లో తమ పట్ల పెరుగుతున్న అసంతృప్తిని ప్రధాన రాజకీయపక్షాలు గుర్తించి, పరిష్కరించి, నడవడికను మార్చుకోని పక్షంలో, రాజు వచ్చి తమను రక్షించాలని నినదిస్తున్నవారి సంఖ్య అతి వేగంగా పెరిగే ప్రమాదమైతే లేకపోలేదు.

కులగణన మంత్రం ఫలిస్తుందా?

ప్రేమ, యుద్ధం, రాజకీయాలు. వీటిల్లో ఎప్పుడైనా ఏమైనా జరగవచ్చు. కులగణన కోరిన రాహుల్‌గాంధీని అర్బన్ నక్సలైట్ అంటూ విమర్శిస్తూ వచ్చిన నరేంద్ర మోదీ ఇప్పుడు తానే ఆ స్థానంలోకి పోయి కూర్చున్నారు. దేశమంతటా కులగణన జరుపుతామని ప్రకటించారు. ఇలాంటి బోల్ట్ ఫ్రమ్ ద బ్లూ పరిణామాలు బీజేపీలో చాలా ఉంటాయి.

స్వాతంత్ర్యం వచ్చాక గడిచిన 78 ఏళ్ళల్లో 14 మంది ప్రధానులు మారారుగానీ ఒక్కరూ కులగణన జరపడానికి సాహసించలేదు. బ్రిటిష్ ప్రభుత్వంలో జనాభా లెక్కల కమిషనర్‌గా ఉన్న జె.హెచ్. హట్టన్ 1931లో మన దేశంలో కులగణన నిర్వహించాడు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉండగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ 2011లో సామాజిక, ఆర్థిక, కులగణన (SECC) నిర్వహించింది. దాని మీద నిరసనలు చెలరేగడంతో ఆ నివేదికను బయటికి రాకుండా నిలిపివేశారు. మనం ఇప్పటికీ తొంభైయేళ్ళ క్రితపు గణాంకాల ఆధారంగానే దేశ జనాభాలో కులాల శాతాల గురించి మాట్లాడుతున్నాం. జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీల వరకు వివరాలు సేకరిస్తుంటారు. అది కూడ 2011 తరువాత ఆగిపోయింది.

వెనుకబడిన తరగతులు, ముస్లిం సామాజికవర్గాల సంఖ్య, శాతాల విషయంలోనే తరచూ అనేక ఊహాగానాలు, వివాదాలు చెలరేగుతుంటాయి. ముస్లిం జనాభా వేగంగా పెరిగిపోతూ సమీప భవిష్యత్తులో ఇండియా ఒక ఇస్లామిక్ దేశంగా మారిపోతుందని సంఘ్ పరివార్ తరచూ ప్రచారం చేస్తుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ 2005లో ముస్లిం సమాజంలోని వెనుకబడిన తరగతులకు బీసీ–ఈ జాబితాలో 4శాతం రిజర్వేషన్ కల్పించినపుడు పెద్ద దుమారం రేగింది. ముస్లిం బీసీల జనాభా అంత లేదని, జనాభా గణాంకాలను శాస్త్రీయంగా సేకరించకుండా రిజర్వేషన్ కల్పించారని సంఘ్ పరివార్ వర్గాలు హైకోర్టును ఆశ్రయించాయి. న్యాయస్థానం కూడా దీన్ని పరిగణనలోనికి తీసుకుంది. కానీ, జనాభా గణాంకాలను శాస్త్రీయంగా ఎలా సేకరించాలో మాత్రం ప్రభుత్వానికి సూచించలేదు.

ఓబీసీలకు రాజ్యాంగం తొలి ప్రతిలో రిజర్వేషన్ లేదు. తమిళనాడులో నిరసనలు చెలరేగాక, సుప్రీంకోర్టు జోక్యంతో రాజ్యాంగానికి తొలి సవరణగా ఆర్టికల్ 15(4) చేర్చి రాష్ట్రాల స్థాయిలో విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించారు. అయితే, కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఈ సౌకర్యం కల్పించలేదు.

ఓబీసీలు సామాజిక, విద్యా, ఆర్థిక రంగాల్లో ఎదుర్కొంటున్న వివక్ష, వెనుకబాటుతనం, పేదరికాలను తొలగించడానికి అవసరమైన సూచనలు ఇవ్వడానికి 1979 జనవరి 1న అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయి బీపీ మండల్ కమిషన్ వేశారు. దేశ జనాభాలో ఓబీసీలు 54శాతం ఉన్నారని మండల్ కమిషన్ తేల్చింది. వారికి కేంద్ర ప్రభుత్వంలో, ప్రభుత్వరంగ సంస్థల్లో 27 శాతం రిజర్వేషన్ కల్పించాలని సూచించింది. ఆ సిఫార్సుల్ని ఓ దశాబ్దం తరువాత 1990 ఆగస్టు 7న అప్పటి ప్రధాని వీపీ సింగ్ ఆమోదించారు. ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించడం సహించలేని ఆధిపత్య కులాలు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోయాయి. ఉత్తర భారతదేశంలో నిరసన జ్వాలలు చెలరేగాయి.

1984 లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాలు గెలుచుకుని పార్లమెంటులో ప్రవేశించిన బీజేపీ, 1989 ఎన్నికల్లో బాగా పుంజుకుని 85 స్థానాలకు చేరుకుంది. ఆ పార్టీ తన రాజకీయ భవిష్యత్తును ఆధిపత్య కులాల నిరసనల్లో గుర్తించింది. 'మండల్‌కు వ్యతిరేకంగా కమండలం' చేపట్టి రామ్ రథయాత్ర మొదలెట్టింది. ఇందులో బీజేపీకి నాలుగు లక్ష్యాలున్నాయి. మొదటిది: రాజకీయ రంగంలో ఆధిపత్య కులాల ప్రతినిధిగా ప్రకటించుకోవడం. రెండోది: ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించిన వీపీ సింగ్ ప్రభుత్వాన్ని కూల్చేయడం. మూడోది: ముస్లింల నుంచి హిందూ మతానికి ముప్పు పొంచి ఉందని ప్రచారం చేయడం. నాలుగోది: దేశంలోని ఓబీసీ తదితర బహుజనుల దృష్టిని రిజర్వేషన్ల నుంచి అయోధ్య రాముని వైపు మళ్ళించడం. రామ్ రథయాత్ర పెట్టుకున్న లక్ష్యాల్లో బీజేపీ కొన్నింటిని పూర్తిగా కొన్నింటిని పాక్షికంగా సాధించింది.

సంఘ్ పరివార్ రోడ్ మ్యాప్‌లో 1992 నాటి బాబ్రీ మసీదు కూల్చివేతతో ఒక ఘట్టం ముగిసింది. ఆ మహా సంస్థ తను చేపట్టిన 'పవిత్ర యుద్ధం'లో హిందూ ఎస్టీ, ఎస్సీ, బీసీలలో చెప్పుకోదగ్గ భాగాన్ని తన కాల్బలంగా మార్చుకోగలిగింది. ఈ పరిణామం 2002 నాటి గుజరాత్ అల్లర్లలో స్పష్టంగా కనిపించింది.

సంఘ్ పరివార్ కులాలను గుర్తించదు. హిందూ సమాజం మొత్తం ఒకే మతం అనేది దాని సిద్ధాంతం. ఈ సిద్ధాంతానికి ప్రభావితులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ నేతలు కొందరు బీజేపీకి తమ శక్తిమేర సేవలు అందించారు. వారిలో ప్రముఖ అంబేడ్కరైట్లు కూడ వున్నారు. బయటి ప్రపంచానికి అంతగా తెలియదుగానీ ఆదివాసుల్లో తండాకు ఒక మతం ఉంటుంది. మరింత లోతుకు వెళితే ఒక్కో సమూహానికి ఒక్కో మత విశ్వాసం ఉంటుంది. ఇప్పుడు జనాభా లెక్కల్లో ఆ వైవిధ్యాన్ని పూర్తిగా తొలగించేశారు. హిందూ, ఇస్లాం, క్రైస్తవం, సిక్కు, బౌద్ధ జైన మతాల్లో ఏదో ఒకదాన్ని ఆదివాసులు ఎంచుకునేలా జనాభా లెక్కల చట్టాన్ని సవరించారు.

భారత ముస్లిం సమాజంలో కూడా శాఖ, కుల వర్గీకరణ తెచ్చి 'సున్నీ అష్రాఫ్'లకు వ్యతిరేకంగా షియా, సున్నీ బీసీ, ఎంబీసీలను దగ్గరికి చేర్చుకోవడానికి ఒక దశలో బీజేపీ ప్రయత్నించింది. అది తమ 'పవిత్రయుద్ధం' ఫార్ములాకే ముప్పుగా మారుతుందని భయపడి ఆ కాడిని దించేసింది.

బ్రిటీష్ పాలకులు నేరస్మృతిని ఇంగ్లండు నుండి తెచ్చారు గానీ పౌరస్మృతిని ఇక్కడి స్థానికులనే ఎంచుకోమన్నారు. బెంగాల్ గవర్నర్ జనరల్‌గా ఉన్న వారెన్ హేస్టింగ్స్ 1772లో హిందూ ప్రతిధుల కోరిక మేరకు మనుధర్మాన్ని పౌరస్మృతిగా ప్రకటించాడు. భారత రాజ్యాంగ రచనా సంఘానికి అధ్యక్షునిగా వ్యవహరించిన బీఆర్ అంబేడ్కర్ ఇక మనుస్మృతికి కాలం చెల్లింది అని ప్రకటించడం సంఘీయులకు ఆగ్రహాన్ని తెప్పించింది. రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోనికి రాగా, ఆ వెంటనే వచ్చిన 'ఆర్గనైజర్' పత్రిక ఫిబ్రవరి 6 సంచిక "మనువు మన హృదయాలను పాలిస్తుంటాడు" అని ప్రకటించింది.

హిందూ ఎస్సీ, బీసీ, ఎస్టీలను మత ప్రాతిపదిక మీద తమకు దగ్గరగా తీసుకొని ఓటు బ్యాంకును పెంచుకోవాలనుకుంటున్న సంఘీయులు అంబేడ్కర్‌ను వ్యూహాత్మకంగా స్వంతం చేసుకుంటున్నారు. అంబేడ్కర్ రచనల్ని వాళ్ళు ఆరు భాగాలుగా విభజిస్తున్నారు. మొదటిది: మనుస్మృతి, కుల అణచివేత మీద అంబేడ్కర్ చేసిన ఘాటైన విమర్శను దాచి పెడతారు. లేదా, వర్ణం తప్ప కులం అనేది అస్సలు హిందూ సాంప్రదాయమే కాదనే వాక్యంతో అంబేడ్కర్ ఆరోపణలన్నింటినీ కొట్టిపడేస్తారు. రెండవది: ఇస్లాం, ముస్లింల మీద కొన్ని ప్రత్యేక సందర్భాల్లో అంబేడ్కర్ చేసిన విమర్శల్ని తమ పవిత్ర యుద్ధానికి అనుకూలంగా వాడుకుంటారు. మూడవది: గాంధీ అంబేడ్కర్ల మధ్య సాగిన వివాదాలకు ఎక్కువ ప్రచారం కల్పించి ఎస్సీ, ఎస్టీ, బీసీలు జాతీయ కాంగ్రెస్‌కు దగ్గర కాకుండా చూసేందుకు వాడతారు. నాలుగవది: కమ్యూనిస్టు పార్టీలను అంబేడ్కర్ తన ప్రధాన శత్రువులని భావించేవారని విస్తృతంగా ప్రచారం చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలు మార్క్సిజానికి ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఐదవది: కుల వివక్ష రద్దుకు అంబేడ్కర్ చూపిన పరిష్కారాల్ని మెచ్చుకుంటూ ఆయన్ని హిందూ మత సంస్కర్తగా కొనియాడుతారు. అంబేడ్కర్ పేరులోనే రాముడు (రాంజీ) ఉన్నాడని ఈ మధ్య ప్రత్యేకంగా పేర్కొంటున్నారు. ఆరవది: రాజ్యాంగం మన దేశానికి అంబేడ్కర్ ఇచ్చిన ప్రసాదమని పేర్కొనడమేగాక, తాము ఏది చేసినా రాజ్యాంగానికి విధేయులమై ఉంటున్నామని బుకాయిస్తారు.

ఎంతటి ప్రచార హోరుతో ప్రజల్ని సంఘ్ పరివార్ వశీకరిస్తున్నా సమస్త రంగాల్లో కులవివక్ష అనే కఠిన వాస్తవం బహుజనుల్ని ఎప్పుడో ఒకప్పుడు మెలుకువ వచ్చేలా చేస్తుంది. అప్పుడు వాళ్లు కులగణన జరిపించమని తప్పక అడుగుతారు. పైగా, రాహుల్‌గాంధీ రోజుకు ఒకసారి "జిస్కే జిత్నీ భాగేదారీ ఉస్కే ఉత్నీ హిస్సేదారి" (ఎవరి జనాభా ఎంతో సంపదలో వారికి అంత') అని నినదిస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల భయంతో బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అందరికన్నా ముందుగా కులగణన చేపట్టారు. వెనుకబడిన తరగతులు 27శాతం, అతి వెనుకబడిన తరగతులు 36శాతం, ఎస్సీలు 20శాతం అని బిహార్ ప్రభుత్వం తేల్చింది. ఇప్పుడు ముంపు నీరు బీజేపీ కాళ్ళ కిందికి వచ్చింది. ఆ పార్టీ నిన్నటివరకూ తాను 'అర్బన్ నక్సలిజం' అని విమర్శించిన స్థానాన్నే ఎంచుకోక తప్పలేదు.

రాజకీయ రంగంతోపాటు సామాజిక, ఆర్థిక రంగాల్లోనూ సమానత్వాన్ని సాధించకపోతే ప్రజలు తిరగబడతారని అంబేడ్కర్ సాక్షాత్తూ రాజ్యాంగ సభలోనే హెచ్చరించాడు. రాజకీయాల్లో ఎస్టీ రాష్ట్రపతిని చూసి అడవిలో ఆదివాసులు, బీసీ ప్రధానిని చూసి మైదానాల్లో బీసీలు సంతృప్తి పడిపోరు. వాళ్ళకు సాంఘిక, ఆర్థిక సమానత్వం కావాలి. వాళ్ళను అడవి నక్సలైట్లు, అర్బన్ నక్సలైట్లు అని ఎద్దేవా చేయవచ్చుగానీ అది పరిష్కారం కాదు. పిక్చర్ అభి బాఖీ హై!



రాజకీయ రంగంతోపాటు సామాజిక, ఆర్థిక రంగాల్లోనూ సమానత్వాన్ని సాధించకపోతే ప్రజలు తిరగబడతారని అంబేడ్కర్ సాక్షాత్తూ రాజ్యాంగ సభలోనే హెచ్చరించాడు. రాజకీయాల్లో ఎస్టీ రాష్ట్రపతిని చూసి అడవిలో ఆదివాసులు, బీసీ ప్రధానిని చూసి మైదానాల్లో బీసీలు సంతృప్తి పడిపోరు. వాళ్ళకు సాంఘిక, ఆర్థిక సమానత్వం కావాలి.

■ డానీ
సమాజ విశ్లేషకులు

ముస్లిం ప్రగతికి అడ్డుగోడ
వక్ఫ్ మాఫియా!

నేను రాసిన 'ముస్లిం సంక్షేమానికే వక్ఫ్ సవరణలు' అనే వ్యాసంలో (ఆంధ్ర జ్యోతి: 09.04.2025)– గత 75 ఏండ్లుగా వక్ఫ్ బోర్డు అధీనంలో లక్షలాది ఎకరాల ఆస్తి ఉన్నా అది పేద ముస్లింలు, మహిళల అభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడలేదు అన్న నిజాన్ని వెల్లడించాను. వక్ఫ్ సవరణ వలన వక్ఫ్ బోర్డుకు ఒక జవాబుదారీతనం వస్తుందని వివరించాను. దానికి స్పందనగా ముస్లిం సంఘాల కన్వీనర్ సలీమ్ పాషా 'వక్ఫ్‌పై వాట్సాప్ వర్సిటీ పరిజ్ఞానం' అంటూ వక్ఫ్ మాఫియాకు వంత పాడారు (ఆంధ్రజ్యోతి: 24.04.2025).

వక్ఫ్ బోర్డు దగ్గర ఉన్న భూమి 9.4 లక్షల ఎకరాలే. కానీ అది కాక కాంగ్రెస్ తెచ్చిన 2013 వక్ఫ్ సవరణలు అడ్డం పెట్టుకొని 36 లక్షల ఎకరాలు వివిధ రాష్ట్రాలలో మాదే అని లిటిగేషన్ పెట్టిన అంశం సాక్షాత్తు హోమ్ మినిస్టర్ అమిత్ షా పార్లమెంటులో చెప్పారు. ఆ సందర్భంలో ముస్లింలకు మంచి చేసే సవరణలకు వ్యతిరేకంగా ఓటు వేసిన 232 ఎంపీలు ఎందుకు ప్రశ్నించ లేదు? పార్లమెంటులో ఇది నిజం కాదు అని ఎందుకు చెప్పలేదు? అమిత్ షా రాష్ట్రాలు, కొన్ని ఊర్ల పేర్లతో సహా ప్రస్తావించారు కదా?


గతంలో లాలూ ప్రసాద్ యాదవ్ కూడా నిండు సభలో వక్ఫ్ మాఫియా గురించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2013 రాజ్యాంగ వ్యతిరేక అధికారాలు వక్ఫ్ బోర్డుకు కట్టబెట్టిన తరువాత వక్ఫ్ ఆస్తులు 2,07,394 (2013) నుండి 8,72,870 (2024) పెరిగాయి, అలానే 18.3 లక్షల ఎకరాలు (2013) నుండి 39 లక్షల ఎకరాలకు పెరిగాయి. అలానే 2013లో ఢిల్లీ వక్ఫ్ బోర్డుకు 9 ఆస్తులు, 0.03 ఎకరాలు ఉంటే; 2025 నాటికి అవి 1047 ఆస్తులు, 29 ఎకరాలకు పెరిగాయి. ఔరంగజేబు చేయలేని పని కాంగ్రెస్ చేసింది. ఇది సాక్షాత్తు సుప్రీంకోర్ట్ అఫిడవిట్‌లో కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన నగ్నసత్యం.

కాంగ్రెస్ తెచ్చిన 2013 సవరణలు (వక్ఫ్ 1995 ఆక్ట్) సెక్షన్ 40 ప్రకారం, వక్ఫ్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆర్డర్ ఫైనల్. వక్ఫ్ ఆక్ట్ సెక్షన్ 83(7) స్పష్టంగా వక్ఫ్ ట్రిబ్యునల్ ఆర్డర్ ఫైనల్ అని చెబుతుంది. దాన్ని ఏ ఇతర కోర్టు విశ్లేషించే అధికారం లేకుండా కాంగ్రెస్ పార్టీ ఈ చట్టాన్ని తెచ్చింది. ఇది నిజం కాకుంటే, 2025 సవరణలో వక్ఫ్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా తొంభై రోజులలో హైకోర్టును ఆశ్రయించవచ్చు అనే అంశం మీద మీకు అభ్యంతరం ఎందుకు? కోర్టులు పార్లమెంట్ చేసిన చట్టాలనే సమీక్షించగలిగిన అధికారాన్ని కలిగి ఉండగా, కేవలం వక్ఫ్ ట్రిబ్యునల్‌కు ఆ ప్రత్యేకత కాంగ్రెస్ ఎందుకు కల్పించింది? రాజకీయ మెప్పు కోసమే కదా?

1995 సెక్షన్ 14: పాత చట్టం ప్రకారం వక్ఫ్ బోర్డులో కేవలం సున్ని, షియాలు ఉండాలని సూచన ఉంది కానీ నిర్దిష్టమైన నిబంధన లేదు. ఇక అఘకాని, బోర, ఇస్మాయిలి, అహ్మదీయ.. ఇతర వర్గాలకు అవకాశం లేదు. అతి ముఖ్యం పసమందా (ఓబీసీ) ముస్లిమ్స్, అత్యధికంగా 80శాతం ఉండే వర్గాలకు అవకాశమే లేదు. కానీ 2025 చట్టం మహిళలతో పాటు, ఈ వర్గాలకు కూడా నిర్దిష్టమైన రిజర్వేషన్ కల్పిస్తుంది. ఇలా ప్రాతినిధ్యం కల్పించటం గురించి 'ముస్లింలను విభజిస్తున్నారు' అనే ఆరోపణ చేయటం ముస్లిం ఉన్నత వర్గాల ఆధిపత్య ధోరణికి నిదర్శనం. ఒక్కసారి కళ్ళకు కట్టిన మతపరమైన గంతలు విప్పి చూస్తే– కేవలం భారతదేశంలోనే అన్ని వర్గాల ముస్లింలూ శాంతితో ఉన్నారు. తక్కిన ముస్లిం దేశాలన్నింటిలోనూ వేర్వేరు వర్గాల మధ్య నిత్య ఘర్షణలే! కేవలం భారత్‌లో మాత్రమే, అది కూడా హిందూ మెజారిటీ ఉంది కనుక, అన్ని వర్గాలకు ప్రశాంతత, భద్రత ఉంది. అబ్దుల్ కలాంను రాష్ట్రపతి చేసింది, షానవాజ్ హుస్సేన్, ఎంజే అక్బర్, నజ్మా హెప్తుల్లా వీళ్ళని మంత్రులను చేసింది బీజేపీ. ఎన్నికలలో ముస్లిమ్స్ బీజేపీని ఒక విరోధి పార్టీగా చూసినా మోదీ సబ్ కా సాథ్ – సాబ్ కా వికాస్ అనే స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నారు.

ఇక వక్ఫ్ 1995 చట్టంలోని సెక్షన్స్ 107, 108, 108ఏ, 108బిలను తొలగించటం విషయానికి వద్దాం. ఈ సెక్షన్స్ ద్వారా 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు భారతదేశంలో ఏ సంస్థకూ లేని అపరిమిత అధికారాలు కట్టబెట్టింది. ఇంగ్లీష్‌లో ఒక సామెత ఉంది 'అధికారం అవినీతికి దారి తీస్తుంది, అపరిమితమైన అధికారం అత్యంత అవినీతికి దారి తీస్తుంది' అని. ఈ చట్టాలే వక్ఫ్ బోర్డు మహా అవినీతికి దారి తీశాయి. సెక్షన్ 107– భారతదేశంలోని ఏ చట్టం కూడా ఈ చట్టం ముందు తక్కువే. సెక్షన్ 108 ప్రకారం కేంద్రం వక్ఫ్ బోర్డులకు ఎలాంటి అధికారాలు అయినా ఇవ్వవచ్చు. 108ఏ ప్రకారం 'వక్ఫ్ బోర్డు పాలనా ప్రాపర్టీ' అని తమ రిజిస్టర్లో ఎక్కిస్తే చాలు (అది ప్రభుత్వ ప్రాపర్టీ, ప్రైవేట్ ప్రాపర్టీ, షెడ్యూల్ ఏరియా ప్రాపర్టీ ఏదైనా సరే), అది తేలేవరకు అమ్మలేరు లేదా కొనలేరు. 108బి భారతదేశంలో ఏ కోర్టు వక్ఫ్ బోర్డు చర్యలకు అడ్డు వెళ్లకుండా నిరోధిస్తుంది. ఈ సెక్షన్స్ అన్నీ రాజ్యాంగ విరుద్ధమే!

ముస్లిమ్స్ సోదర సోదరీమణులకు మనవి– ఈ వక్ఫ్ మాఫియా చేసే అబద్ధ ప్రచారాన్ని నమ్మకండి. 75 ఏండ్లుగా మీకు దక్కింది ఏమీ లేదు. ఈ చట్ట సవరణ వలన, ముఖ్యంగా ముస్లిం యువత ప్రగతిపథంలో నడుస్తుంది. ముందు దేశం, తర్వాతే మతం అనే భావన పెరుగుతుంది. దేవుడు ఒక్కడే, లోకంలో వివిధ పేర్లతో పిలుస్తారు అనే సత్యాన్ని గ్రహించి 'సర్వే జనా సుఖినో భవంతు' అనే స్ఫూర్తితో మనం ముందుకు నడవాలి.



వక్ఫ్ చట్టంలోని పలు సెక్షన్ల ద్వారా 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు భారతదేశంలో ఏ సంస్థకూ లేని అపరిమిత అధికారాలు కట్టబెట్టింది. ఇంగ్లీష్‌లో ఒక సామెత ఉంది 'అధికారం అవినీతికి దారితీస్తుంది, అపరిమితమైన అధికారం అత్యంత అవినీతికి దారితీస్తుంది' అని. ఈ చట్టాలే వక్ఫ్ బోర్డు మహా అవినీతికి దారితీశాయి.

• డాక్టర్ బూర నర్సయ్యగౌడ్
భోనగిరి మాజీ ఎంపీ

ఆరంభమైన సాంస్కృతిక పునరుజ్జీవం

కళలను మన సాంస్కృతిక వారసత్వంగా భావించి ప్రోత్సహించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కళా సాంస్కృతిక రంగానికి కొత్త ఊపిరులూది రాష్ట్రంలో కళా రంగంలో నూతన ఉత్తేజానికి, కళాకారులలో ద్విగుణీకృతమైన ఉత్సాహానికి నాంది పలికింది.

గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను, కళాకారులను ఉగాది రోజు సత్కరించి, ప్రదానం చేసే ఉగాది పురస్కారాలు, కళారత్న (హంస) పురస్కారాల ఊసే లేదు. ఈ సంవత్సరం ఉగాది రోజున ఆ నిర్లక్ష్యాన్ని సరిచేస్తూ దాదాపు 200 మందికి పైగా వివిధ రంగాల మహనీయులను కళారత్న(హంస)పురస్కారాలు, ఉగాది పురస్కారాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా సత్కరించింది. అలాగే ఏప్రిల్ 16 సంఘసంస్కర్త, తొలి ఆధునిక నాటక రూపకర్త కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి రంగస్థల పురస్కారాలను అందజేశారు. ఇటీవల నిర్వహించిన తెలుగు నాటక రంగ దినోత్సవంలో పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ నంది పురస్కారాలను, నంది నాటకోత్సవాలను ఈ సంవత్సరం పునరుద్ధరించబోతున్నామని ప్రకటించారు.

రాష్ట్ర విభజన తర్వాత తెలుగుదేశం ప్రభుత్వంలో సాంస్కృతిక, నాటక సంస్థలకు కార్యక్రమాల నిర్వహణకు సాంస్కృతిక శాఖ ద్వారా ఆర్థిక సహకారం అందించే పథకాన్ని చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టి, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్రంలో కొత్త ఊపు తెచ్చారు. అయితే దురదృష్టవశాత్తు గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాటు ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేయడం కళా, నాటక సంస్థలకు తీరని ఆవేదన మిగిల్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తిరిగి ఈ పథకాన్ని పునరుద్ధరింపచేయడం, సొంతంగా నిధులు సమకూర్చుకుని, ఎంతో వ్యయప్రయాసలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే సంస్థలకు గొప్ప ఊరటనిచ్చింది.

గతంలో ఒక వెలుగు వెలిగి కాలక్రమేణా అంతరించిపోతున్న జానపద కళారూపాలన్నిటినీ ఒక వేదిక పైకి చేర్చి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రోత్సహించి, వాటిని డిజిటల్ రూపంలో భవిష్యత్తు తరాల కోసం నిక్షిప్త పరచాలి. అలాగే, ఖజురహో జాతీయ నృత్య ఉత్సవాల తరహాలో శాస్త్రీయ నృత్య ఉత్సవాలు కూచిపూడిలోనో లేదా ఒక్కో సంవత్సరం ఒక ప్రముఖ పుణ్యక్షేత్రంలోనో, వివిధ నగరాలలోనో నిర్వహించడం ద్వారా శాస్త్రీయ నృత్యం పట్ల బాలలలో ఆసక్తి పెంచాలి. అంతేకాక, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలకు అదనపు నిధులు కేటాయించి అభివృద్ధి చేయడంతో పాటు, ప్రతి జిల్లా కేంద్రంలో ఒక లలితకళల కళాశాలను దీర్ఘకాలిక ప్రణాళికతో ఏర్పాటు చేయాలి. అలాగే, ప్రతి జిల్లా కేంద్రంలో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు అనువుగా ప్రదర్శనశాలలు, ఆయా ప్రాంతాలలో ఉన్న పరిశ్రమల సహకారంతో (కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా) నిర్మించాలి. ఇంకా, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ సంస్థల ఆధీనంలో ఉన్న ఆడిటోరియాలలో గుర్తింపు పొందిన కళా సంస్థలకు కార్యక్రమాల నిర్వహణకు, విద్యుత్ చార్జీలు చెల్లించి ఉచితంగా ఉపయోగించుకోవడానికి అవకాశం కల్పించాలి.

శ్రీకృష్ణదేవరాయలు కళా, సాంస్కృతిక, సాహితీ రంగాలకు పెద్దపీట వేసిన విషయం అందరికీ తెలిసిందే. అందుకే 500 సంవత్సరాలు దాటినా ఆయన గురించి ఇప్పటికీ మాట్లాడుకుంటున్నాం. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కళా సాంస్కృతిక రంగానికి చేయూతనిచ్చి, చరిత్రలో నిలిచిపోవాలని కళాకారులు భావిస్తున్నారు.

– డాక్టర్ గుర్రాల రవికృష్ణ
కళారత్న, కందుకూరి రాష్ట్రస్థాయి రంగస్థల పురస్కార గ్రహీత

పర్యాటకానికి కొత్త రెక్కలు

పర్యాటక రంగంలో ఐదేళ్లలో రూ.25వేల కోట్ల పెట్టుబడులు సాధించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్–2025లో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించిన విషయం తెలిసిందే. అందుకు తగ్గట్టుగా పెట్టుబడిదారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం, మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయం. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించిన 12వ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. పర్యాటక రంగంలోని పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని ఇస్తూ, పర్యాటకానికి మద్దతుగా ఉండే వ్యవస్థలను బలోపేతం చేసుకుంటూ, ఉప విభాగాలను అభివృద్ధి చేసుకుంటూ పర్యాటక రంగ సమగ్రాభివృద్ధికి బాటలు వేసేలా కూటమి ప్రభుత్వం నూతన పాలసీని రూపొందించింది. కూటమి ప్రభుత్వం కొత్త పర్యాటక విధానం ప్రకటించాక ఆతిథ్య రంగంలో ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయి. దీనిలో భాగంగానే ఇప్పటికే దాదాపు 18 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే విధంగా రూ.8,059 కోట్లతో 27 ప్రముఖ హోటళ్ల పనులు ప్రారంభించడం ఆహ్వానించదగ్గ పరిణామం. రాబోయే 23 ఏళ్లలో హోటళ్ల గదుల సంఖ్య 40–50 వేలకు పెరగాలని కూటమి ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది.

ఒకప్పుడు భారతీయుల దృష్టిలో పర్యాటకమంటే తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాలు మాత్రమే. ఇప్పుడు యువత చారిత్రక, ప్రాకృతిక ప్రదేశాల సందర్శనకు ప్రాధాన్యమిస్తోంది. మన రాష్ట్రం ఇటు దేవాలయాలు, పుణ్యక్షేత్రాలతో పాటు చారిత్రక, ప్రకృతి సౌందర్య స్థలాలకు నిలయం. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల దేవస్థానం, శ్రీకాళహస్తి, శ్రీశైలం, కాణిపాకం, విజయవాడ కనకదుర్గ దేవాలయం, సింహాచలం, అంతర్వేది, పుట్టపర్తి లాంటి పుణ్యక్షేత్రాలు, అరకు లోయ, బొర్రా గుహలు, పాపి కొండలు, హార్సిలీ హిల్స్, కొల్లేరు సరస్సు, పులికాట్ సరస్సు లాంటి ప్రాకృతిక ప్రదేశాలు, అమరావతి స్తూపం, ఉదయగిరి కోట, వెంకటగిరి కోట, చంద్రగిరి కోట, తిమ్మమ్మ మర్రిమాను, ధవళేశ్వరం బ్యారేజ్ లాంటి చారిత్రక ప్రదేశాలు అనేకం ఉన్నాయి. దేశంలోనే మూడో అతి పెద్ద సముద్ర తీరం కలిగి ఉండడం రాష్ట్రానికి అదనపు ఆకర్షణ. బ్లూ ఫాగ్ బీచ్‌గా ఎంపికైన రుషికొండ బీచ్‌తో పాటు, కాకినాడ, సూర్యలంక, మైపాడు, రామాపురం బీచ్‌లకూ బ్లూ ఫాగ్ గుర్తింపు సాధించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. వీటితో పాటు తీర ప్రాంతాల్లో 283 బీచ్‌లను అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వీటిలో 35 బీచ్‌లను రోజూ లక్షలమంది సందర్శిస్తుంటారు. ప్రత్యేకించి కార్తీక మాసంలో రద్దీ ఎక్కువ. విదేశీ పర్యాటకులు మాత్రం సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య ఎక్కువగా వస్తుంటారు. బ్లూ ఫాగ్ గుర్తింపు ఉన్న బీచ్‌లకే వారు ప్రాధాన్యం ఇస్తుంటారు. వాటిలో భద్రతతో పాటు, ఇతర వసతులూ ఉంటాయని వారి నమ్మకం. అందుకే కూటమి ప్రభుత్వం బ్లూ ఫాగ్‌పై దృష్టి సారించింది. ప్రస్తుతానికి ఏటా సుమారుగా 1.70 లక్షల మంది విదేశీ పర్యాటకులు రాష్ట్రానికి వస్తున్నారు. బీచ్‌లను మెరుగుపరిచి, గుర్తింపు సాధించి ఈ సంఖ్యను వచ్చే రెండు, మూడేళ్లలో 5 లక్షలకు పెంచాలన్నది ప్రభుత్వ ప్రణాళిక.

మారుతున్న పర్యాటకుల ఆలోచనా విధానాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సందర్శనీయ స్థలాలను ఆకర్షణీయంగా మారుస్తోంది. ఇక్కడి ఆధ్యాత్మికతను, సంస్కృతి, సాంప్రదాయాలను, ప్రకృతి సౌందర్యాలను అనుభూతి చెందడానికి లక్షలమంది యాత్రికులు ఇతర రాష్ట్రాల నుండి, విదేశాల నుండి మన రాష్ట్రానికి వస్తున్నారు. పర్యాటకులను మరింత ఆకర్షించేలా టెంపుల్, ఎకో, అడ్వెంచర్, వెల్‌నెస్, ఆగ్రి టూరిజంలను కలుపుతూ కూటమి ప్రభుత్వం టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రాజెక్టులను రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగా కృష్ణానదిపై నీటిలో తేలియాడే రెస్టారెంట్ (ఫ్లోటింగ్ రెస్టారెంట్), విజయవాడలో బెర్మ్ పార్క్, కోనసీమ బ్యాక్ వాటర్‌లో సింగిల్ బెడ్‌రూమ్ లగ్జరీ హౌస్ బోటు, విశాఖపట్టణం నుంచి చెన్నై, చెన్నై నుంచి భువనేశ్వర్, భువనేశ్వర్ నుంచి కోల్‌కతా తీరం మీదుగా ప్రత్యేకంగా క్రూయిజ్ నౌక, అరకులో ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్, పారా గ్లైడింగ్, బంగీ జంపింగ్, మోటార్ బైక్ టూరింగ్, చంద్రగిరి కోట వద్ద సౌండ్ లైట్ షో, పోలవరం నుంచి పట్టిసీమ మధ్య తీగల వంతెన, విజయవాడలోని భవానీ ద్వీపంలో థీమ్ పార్క్, వాటర్ పార్క్ లాంటివి ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా పర్యాటక రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో భారీ, మెగా ప్రాజెక్టుల ఏర్పాటే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పర్యాటక భూ కేటాయింపుల విధానం 2024–29 తీసుకొచ్చింది. రూ.50 కోట్ల పైన పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే సంస్థలకు 66 నుంచి 99 ఏళ్లకు భూములను లీజు/ఫ్రీ హోల్డ్ విధానంలో కేటాయించనున్నారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి అనుమతితో మంత్రివర్గం ఆమోదం తర్వాతే కేటాయింపులు చేసేలా కొత్త విధానం రూపొందించారు. రూ. 50 కోట్ల కంటే తక్కువ పెట్టుబడులు పెట్టే సంస్థ (ఎంఎస్ఎంఈ)లకు బిడ్డింగ్ ప్రాతిపదికన భూ కేటాయింపులు చేస్తారు. ఈ విధంగా పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం గత పది నెలల వ్యవధిలో కీలక నిర్ణయాలు తీసుకుంది.

పర్యాటకులకు కావాల్సింది భద్రత, పరిశుభ్రత. ఈ రెండూ లోపించినప్పుడు ఎంతటి అద్భుత సందర్శనీయ స్థలాలు ఉన్నా పర్యాటకులు రారు. అందుకే కూటమి ప్రభుత్వం ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించింది. వీటితో పాటు పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారం తయారుచేయడంపై జాగ్రత్తలు తీసుకొంటుంది. పర్యావరణం పర్యాటక రంగానికి జీవం. అభివృద్ధి కోసం వేస్తున్న అడుగులు జీవావరణాన్ని ధ్వంసం చేయకుండా కూటమి ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటుంది. 'భవిష్యత్తు అంతా పర్యాటకానిదేనని... ప్రపంచ పర్యాటకానికి ఏపీ గమ్యస్థానంలా మారుతుందని' విజయవాడలోని కృష్ణానది పున్నమి ఘాట్ నుంచి శ్రీశైలానికి వెళ్లే సీప్లేన్‌ను ప్రారంభించిన సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రాజధాని అమరావతి ప్రాంతాన్ని కూడా చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడం రాష్ట్రానికి మరింత కలిసొచ్చే అంశం. రాష్ట్రంలోని బౌద్ధారామాలు, స్మారకాలపై వియత్నాం లాంటి దేశాలు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో రెండు బౌద్ధ సర్క్యూట్ లను అభివృద్ధి చేసేలా కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది ఈ విధంగా 'అతిథి దేవోభవ' అనే ప్రాచీన సూక్తికి ఏపీ పర్యాటక రంగం నిలువుటద్దంలా నిలబడుతున్నది.

మారుతున్న పర్యాటకుల ఆలోచనా విధానాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సందర్శనీయ స్థలాలను ఆకర్షణీయంగా మారుస్తోంది. టెంపుల్, ఎకో, అడ్వెంచర్, వెల్‌నెస్, ఆగ్రి టూరిజంలను కలుపుతూ కూటమి ప్రభుత్వం టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేస్తోంది. 'అతిథి దేవోభవ' అనే ప్రాచీన సూక్తికి ఏపీ పర్యాటక రంగం నిలువుటద్దంలా నిలబడుతున్నది.



◆ కూసంపూడి శ్రీనివాస్
జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి



ఉష్ణోగ్రత (అంచనా)

10-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	26
తెనాలి	39	27
నరసరావుపేట	41	25
బాపట్ల	38	27
రెంటచింతల	41	26
చీరాల	38	27



కంకరగుంట ఆర్‌యూబీ ఆర్‌సీసీ బాక్సు నుంచి కలెక్టరేట్ వైపునకు వెళ్లే మార్గంలో కుదించిన రోడ్డు మార్గం

ట్రాఫిక్.. మరింత సంక్లిష్టం

- కంకరగుంట ఆర్‌యూబీ మార్గం కుదింపు
- రద్దీ సమయంలో ఇబ్బందికరంగా మారిన మార్పు

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): కంకరగుంట ఆర్‌యూబీ వద్ద నగరపాలక సంస్థ చేపట్టిన మార్పులు ట్రాఫిక్‌ని మరింత సంక్లిష్టం చేస్తోంది. కోబాల్ట్ పేట వైపు నుంచి ఆర్‌యూబీలోకి ప్రవేశించి కలెక్టరేట్ వైపునకు బయటకు వచ్చే మార్గంలో గతంలో ఉన్న డివైడర్‌ని కుదించేసింది. గతంలో ఆర్‌వోబీ పిల్లరకు కుడి, ఎడమ వైపు నుంచి వాహనాలు సులభతరంగా వెళ్లేవి. ఇప్పుడు కేవలం పిల్లర్‌కు ఎడమ వైపున మాత్రమే వాహనాలు ప్రవేశించేలా నూతనంగా డివైడర్‌ని నిర్మించారు. దీంతో ఆ మార్గం కుదించుకు పోయింది. ఒక వాహనం వెనక ఒకటి ప్రయాణించాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనివల్ల రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగే పరిస్థితి ఉత్పన్నమైంది. రేపు శంకర్ విలాస్ బ్రిడ్జిని కూల్చేసి ట్రాఫిక్ మొత్తాన్ని ఆర్‌యూబీ కిందకు మళ్లించినప్పుడు ఇక్కడ అనేక సమస్యలు తలెత్తక తప్పదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతున్నది. కనీసం అధ్యయనం లేకుండా నగరపాలకసంస్థ అశాస్త్రీయంగా చేస్తున్న మార్పులు అసలుకే మోసం వచ్చేలా ఉన్నాయి. కాగా కొత్తగా చేసిన ఈ మార్పుతో ఏటీ అగ్రహారం వైపు నుంచి కలెక్టరేట్ వైపు వెళ్లే వాహనదారులు, ఆర్‌సీసీ బాక్సులో నుంచి బయటకు వచ్చే వాహనాలు ఢీకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలానే యూటర్న్ తీసుకోవడానికి వాహనదారులు ప్రయత్నించవచ్చు. అప్పుడు ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుంది. ఇక్కడ సరైన ఇంజనీరింగ్‌తో కాకుండా గతంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి పనులు చేశారు. ఆ పనులను ఇప్పుడు మారుస్తుండటం వల్ల నగరపాలక సంస్థకు నష్టం జరిగింది. ఆ పనులు కూడా రేపటి రోజున అక్కరకు రాకుండా పోతే మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నది. ఈ నేపథ్యంలో రోడ్డు ఇంజనీరింగ్‌లో అనుభవం ఉన్న సంస్థ /డిపార్టుమెంట్‌తో స్టడీ చేయించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా మార్పులు చేస్తే ఉపయోగం ఉంటుందని నగరవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికత.. సందిగ్ధం

- 2024లో దరఖాస్తు చేసుకున్న వారికే సర్టిఫికెట్లు
- గత ప్రభుత్వ సర్క్యులర్‌ను సాకుగా చూపుతున్న అధికారులు
- రెవెన్యూ అధికారుల తీరుతో డీఎస్సీ అభ్యర్థులకు కష్టాలు

గుంటూరు సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన షేక్ ఫర్హానా యాస్మిన్ కుటుంబం 2015 వరకు హైదరాబాద్‌లో ఉంది. ఆ తర్వాత వారు తిరిగి గుంటూరు వచ్చారు. యాస్మిన్ గుంటూరులోనే చదువుకున్నారు. ఆమె ప్రస్తుతం డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. స్థానికత సర్టిఫికెట్ కోసం దర ఖాస్తు చేసుకోగా జగన్ ప్రభుత్వ సర్క్యులర్‌ను సాకుగా చూపుతూ నిరాకరిస్తున్నారు.

..ఇదే పరిస్థితి అనేకమంది డీఎస్సీ అభ్యర్థులకు ఎదురవుతుంది. రెవెన్యూ అధికారుల సమాధానాలతో వారు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి వచ్చిన వారికి రెవెన్యూ అధికారులు సినిమా చూపిస్తున్నారు. స్థానికత అంశాన్ని తేల్చకుండా ఇబ్బందులు పెడుతున్నారు. అవసరం ఉన్నప్పుడు మాత్రమే పొందే స్థానికత సర్టిఫికెట్ కోసం 2024లో దరఖాస్తు చేసుకుని ఉంటే ఇచ్చే వాళ్లమని ఇప్పుడు చెబుతున్నారు. స్థానికత అంశంపై గెజిట్ నోటిఫికేషన్, జీవో 133ని రెవెన్యూ అధికారులు తుంగలో తొక్కడం ప్రస్తుతం వివాదాస్పదమౌతుంది. ఈ జీవోను పలు మండలాల్లోని రెవెన్యూ అధికారులు పక్కన పెట్టేస్తున్నారు. 2024 జూన్ 1లోపు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే స్థానికతను నిర్ధారించే సర్టిఫికెట్ ఇస్తామని చెబుతున్నారు. గత ప్రభుత్వం అందుకు అనుగుణంగా సర్క్యులర్ జారీ చేసిందని అధికారులు వాదిస్తున్నారు. అయితే 2024 జూన్ 1 లోపు మాత్రమే స్థానికతను నిర్ధారించే సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని గత ప్రభుత్వం ఎక్కడా ప్రకటన చేయలేదని పలువురు చెప్తున్నారు. ఒకవేళ అలాంటి జీవో ఉంటే లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులతో ముడిపడి ఉన్న ఈ విషయంలో పెద్దగా ప్రచారం కూడా చెయ్యలేదు. ఫలితంగా ప్రస్తుతం వెలువడిన డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న చాలా మంది అభ్యర్థులు స్థానికత రెవెన్యూ అధికారుల సమాధానాలతో ఏమి చేయాలో పాలుపోక ఆందోళన చెందుతున్నారు. ఒక వేళ గత ప్రభుత్వం అప్పట్లో బహిరంగ ప్రక టన చేసి ఉంటే సర్టిఫికెట్లు పొందే వారమని పలువురు చెప్తున్నారు. ఇప్పుడు పిల్లల ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసిన తర్వాత సర్క్యు లర్ గురించి ఇప్పుడు అధికారులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి నారా లోకేశ్ ఈ విషయంలో జోక్యం చేసుకుని గత ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



జీవో 133 ఏమి చెబుతుందంటే..

2014లో రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వం కొన్ని కీలక అంశాలపై ప్రత్యేకంగా జీవో జారీ చేసింది. 2016 జూన్ 13న వెలువరించిన జీవో 133 కూడా అటువంటిదే. ఈ జీవో ప్రకారం రాష్ట్ర విభజన జరిగిన తేదీ నుంచి మూడేళ్ల కాలంలో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే వారిని మాత్రమే ఆయా జిల్లాల్లో స్థానికులుగా పరిగణలోకి తీసుకోవాలి. ఆ తర్వాత ఆ గడువును ప్రభుత్వం రెండు సార్లు మార్చింది. తెలంగాణ నుంచి ఆయా జిల్లాలకు వచ్చిన వారికి జీవో 133 ప్రకారం వారిని స్థానికులుగా గుర్తించి సర్టిఫికెట్లు జారీ చేయాలి.

బోధకులు లేక బాధలు

ఐదు బ్రాంచ్‌లు.. వెయ్యి మంది విద్యార్థులు ఉన్న నరసరావుపేట జేఎన్‌టీయూ (కే) కళాశాలలో బోధకులు లేరు. 80 మంది ప్రొఫెసర్లకు 71 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తొమ్మిది మంది ప్రొఫెసర్లకు ఇద్దరే ఉన్నారంటే ఏమేరకు ఇక్కడ విద్యా బోధన జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. బోధకులు లేక.. విద్యార్థులు ఇక్కడ చేరేందుకు ఆసక్తి చూపడంలేదు. 2018 డిసెంబరులో టీడీపీ ప్రభుత్వ హయాంలో కళాశాలకు 80 అధ్యాపక పోస్టులను మంజూరు చేసింది. ఈ మేరకు ఇప్పటికీ అధ్యాపకులను వర్సిటీ నియ మించలేదంటే కళాశాలపై ఏపాటి శ్రద్ధ ఉందో తెలుసుకోవచ్చు. ఏళ్లుగా అతిథి అధ్యాపకులతోనే సరిపెడుతున్నారు. నరసరావుపేట సమీపంలో జేఎన్‌టీయూను 2016లో ప్రారంభించిన కళాశాల నిర్వహణపై కాకినాడ జేఎన్‌టీయూ తీవ్ర నిర్లక్షాన్ని ప్రదర్శిస్తోందన్న విమర్శలున్నాయి. పోస్టుల భర్తీతో పాటు ఇతర అనేక సమస్యలతో కళాశాలలో విద్యార్థులు బాధలు పడుతున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని ప్రతిభ కలిగిన విద్యార్థులకు సాంకేతిక విద్యను చేరువ చేసేందుకు స్థాపించిన కళాశాలను నిర్వీర్యం చేసేలా వర్సిటీ పెద్దలు కుట్ర పన్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- 80 ప్రొఫెసర్ పోస్టులకు 71 ఖాళీ
- నరసరావుపేట జేఎన్‌టీయూలో అతిథులే దిక్కు
- 2018 నుంచి నియామకాలపై వర్సిటీ పెద్దల నిర్లక్ష్యం
- బోధన సాగక.. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు లేక విద్యార్థుల అవస్థలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జేఎన్‌టీయూ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ.. ఇక్కడ సీటు కోసం విద్యార్థులు పోటీ పడుతుంటారు. అత్యుత్తమ బోధన.. క్యాంపస్ ప్లేస్‌మెంట్లే ఇందుకు కారణం. కానీ నరసరావుపేటలోని జేఎన్‌టీయూలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఇక్కడ సీటు వస్తున్నా వద్దని విద్యార్థులు వేరే దగ్గరకు వెళ్లిపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయినా లోటుపాట్లను సవరించి ప్రతిష్ఠను మెరుగుపరచాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నరసరావుపేటలోని కళాశాలలో వసతుల మాట ఎలా ఉన్నా విద్యా బోధనకు గ్రహణం పట్టింది. పర్మినెంట్ అధ్యాపకులు తొమ్మిది మంది మాత్రమే ఉండగా వారిలో ఒకరు ప్రిన్సిపాల్. మొత్తం 71 మంది అధ్యాపకుల కొరత ఉంది. 22 మంది కాంట్రాక్టు, 18 మంది అతిథి అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల్లో పనిచేసే వారిని నామమాత్రంగా నియమించారు. అధ్యాపకుల నియామకంలో వర్సిటీ వ్యవహరిస్తున్న తీరు దారుణమని విద్యార్థులు వాపోతున్నారు. కళాశాలపై వర్సిటీ పెద్దలు కుట్ర పన్నారన్న ఆరోపణలకు ఇక్కడ నెలకొన్న పరిస్థితులు అద్దం పడుతున్నాయి. అటు పాలకులు.. ఇటు జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ అధికారులు కళాశాల నిర్వహణను గాలికొదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణాలకు నిధులు.. విద్యార్థులకు అవసరమైన వసతులు.. అధ్యాపకుల కొరతను వర్సిటీ పట్టించుకోకుండా విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతోందని పలువురు మండిపడుతున్నారు. బోధన సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. ఉద్దేశపూర్వకంగా అధ్యాపకులను నియమించడంలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కళాశాలను నిర్వీర్యం చేసేలా అధికారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. అతిథి అధ్యాపకులతో కాలం గడుపుతుండటంతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. గత కొన్నేళ్లగా ప్రాంగణ నియామకాల్లో విద్యార్థుల ఎంపికే ఇందుకు ఆధారం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రొఫెసర్లను నియమించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఆలోచన వర్సిటీ పెద్దల్లో లోపించింది.

ఖాళీల వివరాలు ఇలా..

క్యాడర్	ఉండాల్సిన వారు	ఉన్న వారు	ఖాళీ
ప్రొఫెసర్	9	2	7
అసోసియేట్లు	18	1	17
అసిస్టెంట్లు	53	6	47

ప్రాంగణ ఎంపికలు ఇలా..

సంవత్సరం	ఎంపికైన విద్యార్థులు
2021	180
2022	150
2023	110
2024	153
2025	72


- నరసరావుపేట జెన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల



యార్డుకు.. 1.08 కోట్ల టిక్కీలు

- మొత్తం 43.59 లక్షల క్వింటాళ్ల విక్రయం
- ఈ ఏడాదికి ముగిసిన మిర్చి క్రయ విక్రయాల సీజన్

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాదికి మిర్చి క్రయవిక్రయాల సీజన్ ముగిసింది. గత ఏడాది డిసెంబరు 1న ప్రారంభమైన సీజన్ శుక్రవారం సాయంత్రంతో ముగియగా ఈ ఐదు నెలల వ్యవధిలో యార్డులో మొత్తంగా కోటి 8 లక్షలకు పైగా మిర్చి టిక్కీలు రాగా వాటిలో 43.59 లక్షల క్వింటాళ్ల మిర్చి ఉన్నట్లు లెక్కించారు. మార్కెట్ ఫీజు రూపంలో ఎంత ఆదాయం సమకూరిందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. గుంటూరు, పల్నాడు, కర్నూలు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో రైతులు మిర్చిని విక్రయానికి తీసుకొస్తారు. కొత్తగా అనేక మార్కెట్ కమిటీలు వచ్చినా రైతులు మాత్రం గుంటూరు ఏఎంసీకే ప్రాధాన్యం ఇస్తారు. ముందస్తుగా రుణాలు ఇవ్వడంతో పాటు యార్డుకు సరుకు తీసుకురాగానే రెండు రోజుల్లో అమ్మేసి మొత్తం పైకం మూడు,నాలుగు రోజుల్లోనే వ్యాపారులు ఇస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ఇక్కడకు వస్తారు. ఈ కారణంగా ధర తగ్గినా రైతులు మాత్రం ఇక్కడికి రాక మానుకోరు. డిసెంబరు జనవరి నెలల్లో 11 లక్షల నుంచి 15 లక్షల టిక్కీల వరకు రాగా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో సగటున నెలకు 25 లక్షల మిర్చి టిక్కీలకు పైగా వచ్చాయి. ధర తగ్గడం మూలంగా మిర్చి యార్డుకు మార్కెట్ ఫీజు రూపంలో దాదాపుగా రూ. 15 కోట్లకు పైగా ఆదాయాన్ని కోల్పోయింది.



రైతులకు గడ్డుకాలం

గత రెండేళ్లు మిర్చి క్రయవిక్రయాలు బాగా జరగడంతో రైతులకు క్వింటాల్‌కు రూ.20 వేల వరకు ధర లభించింది. అయితే ఈ సంవత్సరం ధర పతనమైంది. ఎగుమతులు లేకపోవడం, తేజ రకం నుంచి ఆయిల్‌ని వేరు చేసే కంపెనీల నుంచి ఆశించినంతగా కొనుగోళ్లు జరగక పోవడంతోనే ధర పతనమైనట్లు మార్కెటింగ్ వర్గాలు విశ్లేస్తున్నాయి. తేజ వెరైటీ మిర్చి తోలు పలచబడిందని కంపెనీలు కొనుగోళ్లను తగ్గించాయి. తెగుళ్ల వల్ల తోలు మందం తగ్గిందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. గుంటూరు మిర్చియార్డు నుంచి విక్రయమయ్యే మిర్చి వెరైటీలలో 60 శాతం తేజ రకమే. ఈ కారణంగా ధర నేలచూపులు చూసింది. క్వింటాల్‌కు రూ.10 వేల లోపే ధర లభించింది. మేలిమి కాయలకు మాత్రమే రూ.13 వేల వరకు ధర పెట్టి ఎగుమతిదారులు కొనుగోలు చేశారు.

70 లక్షల టిక్కీల నిల్వ

గుంటూరు నగర పరిసరాల్లోని 80కి పైగా ఉన్న ఫంక్షనల్ కోల్డ్‌స్టోరేజ్‌ల్లో ప్రస్తుతం 70 లక్షల టిక్కీలు రైతులు, వ్యాపారులు నిల్వ చేసినట్లు శీతలగిడ్డంగుల యాజమాన్యాల సంఘం నేత సురేంద్రబాబు తెలిపారు.

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ నాగలక్ష్మి


గుంటూరు(తూర్పు), మే 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ కల్పన చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మెగా జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను శుక్రవారం కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆమె ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లో జిల్లాలో 30 జాబ్‌మేళాలు నిర్వహించి, 1536 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. ఉన్నతస్థాయికి ఎదిగేవారికి జాబ్‌మేళాలు దోహదపడతాయని చెప్పారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ మంత్రి లోకేశ్ ఆశయాల మేరకు 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఒకసారి ఇంటర్వ్యూకు హాజరైతే వారికి ఉద్యోగం ఇప్పించే వరకు బాధ్యత తీసుకుంటామన్నారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఖాళీగా ఉండకుండా ఉద్యోగాల్లో చేరి రాణించాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ అధికారి సంజీవరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దుర్గాబాయి, ప్రత్తిపాడు తహసీల్దారు దరియావలి, మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పెరుమాళ్లు తదితరులు పాల్గొన్నారు.



జాబ్ మేళాలో మాట్లాడుతున్న నాగలక్ష్మి

రైతు బంద్

- రుణం అందక రైతుల గగ్గోలు
- ప్రకటనల్లోనే రైతుబంధు పునరుద్ధరణ
- మూడు జిల్లాల్లో గతేడాది రూ.15 కోట్లు కేటాయింపు
- ప్రచారానికే పరిమితం.. రైతులకు ప్రయోజనం నామమాత్రం



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సరిగ్గా పంట చేతికొచ్చే సమయానికి ధర తగ్గడం.. అయినకాడికి అమ్ముకుని అప్పుల ఊబిలో కూరుకుపోవడం రైతులకు పరిపాటిగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా 2014-2019 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. ఈ పథకంలో రైతులు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ గోడౌన్లలో నిల్వ చేసుకుంటే నామమాత్రపు అద్దె వసూలుతో పాటు నిల్వ చేసుకున్న పంట విలువలో 70 శాతం రుణం రూపేణా అందించేది. దీని వల్ల రైతులు ఉత్పత్తులను సరైన ధరకు అమ్ముకోవడానికి కొంతమేర వెసులుబాటు దొరికేది. కానీ గత ప్రభుత్వంలో ఈ పథకం ఆనవాళ్లు లేకుండా చేసింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో రైతుబంధు పథకం పునరుద్ధరణపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఇందుకు అనుగుణంగా గతేడాది అక్టోబరులో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఈ పథకం కింద రూ.15 కోట్లు కేటాయించింది. కానీ అది ప్రకటనలకే పరిమితమైంది తప్ప ఆ ఫలాలేవీ తమకు అందలేదని రైతులు వాపోతున్నారు. గుంటూరు జిల్లాకు రూ.4 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.5 కోట్లు, పల్నాడు జిల్లాకు రూ.6 కోట్ల విడుదలకు అనుమతులిచ్చింది. మూడు జిల్లాల పరిధిలో రూ.15 కోట్ల వరకు నిధుల కేటాయింపు జరిపితే అంతా కలిపి కోటి రూపాయలు కూడా రైతులకు మేలు జరగలేదు. బాపట్ల జిల్లాలో 9 మంది రైతులకు రూ.15లక్షల రుణ సదుపాయం కల్పించి మమ అనిపించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు అన్న చందంగా ప్రభుత్వం నిధులు కేటాయించినా ఆ ఫలాలు రైతులకు అందలేదు.

2014-19 మధ్య ముమ్మరం

రైతుబంధు పథకం 2014--19 మధ్య ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెద్ద ఎత్తున అమలైంది. పంట ఉత్పత్తులను గోదాముల్లో నిల్వ చేసుకుని ఏడాదికి దాదాపు రూ.45 కోట్ల వరకు రుణాలను రైతులు తీసుకున్నారు. నిల్వకు నామమాత్రపు అద్దె, నిల్వ చేసిన దిగుబడిలో 70 శాతం మొత్తం తక్కువ వడ్డీకి తొమ్మిది నెలల గడువు రుణంతో రైతులకు మేలు జరిగింది. ప్రస్తుత ప్రభుత్వం రైతుబంధు పథకం పూర్తి స్థాయిలో అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం ధర బహిరంగ మార్కెట్‌లో ఆశాజనకంగా లేదు. కొన్ని పరిమితులకు లోబడే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించింది. గడచిన ఖరీఫ్, ప్రస్తుతం ధాన్యం ధర మద్దతు రేటుకన్నా బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.300 వరకు తీసికట్టుగానే నమోదైంది. అయినా రైతుబంధు పథకంలో ధాన్యాన్ని నిల్వ చేసుకునే పరిస్థితులు లేక రైతులు తెగనమ్ముకుని నష్టాలు పాలయ్యారు. లక్షల టన్నుల ధాన్యం తక్కువ ధరకు దళారీల పాలైంది. రైతుబంధు పథకం ద్వారా రుణం ఇచ్చి ఉంటే అప్పులు తీర్చుకొని ఉండేవాళ్లమని రైతులు తెలిపారు.

గోదాముల విషయంలోనూ నిర్లక్ష్యం..

గత ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను కాలరాసి ఏకంగా మార్కెటింగ్ గోడౌన్లను ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చింది. దీంతో రైతులకు అటు రైతుబంధు ఫలాలు ఎండమావిగా మారడంతో పాటు ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. ఇప్పుడు కూడా గోదాముల విషయంలో దాదాపుగా అదే నిర్లక్ష్యం కొనసాగుతూ ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న మార్కెట్ యార్డుల్లో 178 వరకు గోదాములు ఉన్నాయి. వీటిలో దాదాపు 2.20 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం నిల్వ చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ గడచిన ఖరీఫ్ సీజన్‌లో మార్కెటింగ్ గోదాముల్లో నిల్వ చేసుకున్న ధాన్యం అంతా కలిపి కూడా 50,000 టన్నులకు మించలేదు. గోదాములలో నిల్వ సామర్థ్యం అంతంతమాత్రంగా ఉండడం కూడా రైతుబంధు పథకం అమలుకు ప్రతిబంధకంగా మారినట్లు తెలుస్తోంది.



బాపట్ల మార్కెట్ యార్డులోని గోడౌన్

యుద్ధానికి యువత సాయమందించాలి

లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్



మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్

పెదకాకాని, మే 9(ఆంధ్రజ్యోతి): యుద్ధానికి అవసరమైన పక్షంలో ప్రభుత్వ కోరిక మేరకు యువత సాయం అందించాలని, తమదైన రంగాల్లో రాణించి దేశభక్తి చాటాలని 10(ఎ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్ సుదర్శన్ శుక్రవారం పేర్కొన్నారు. వానికెడి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ బాలికల శిక్షణ శిబిరంలో విశ్రాంత మేజర్ జనరల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఎస్.దాకాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు డ్రిల్, మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్‌పై శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకునే అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు లెఫ్టినెంట్ కల్నల్ సుదర్శన్ చెప్పారు. డాక్టర్ దాకా మాట్లాడుతూ బాలికలు పాఠశాల దశలోనే ఎన్‌సీసీలో చేరడం ద్వారా భవిష్యత్ మెరుగ్గా ఉంటుందన్నారు.

13న పెన్షన్ అదాలత్

గుంటూరు (విద్య), మే 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పట్టణంలోని కృష్ణానగర్‌లో ఉన్న ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు అదాలత్ జరుగుతుందని పేర్కొన్నారు. ఫిర్యాదులను కార్యాలయం లేదా (94946 57469)వాట్సాప్, మెయిల్ ద్వారా పంపవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం 0864-2344106, 0864-2232921 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

చిరస్మరణీయంగా ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన

విజేతలకు ద్విచక్ర వాహనాలు, నగదు బహుమతులు



ప్రథమ బహుమతి శేఖరరెడ్డికి రాయల్‌ఎన్‌ఫీల్డ్ బహూకరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, నాగసాయి వైబిష్ట

పొన్నూరుటౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): ధూళిపాళ్ల మెమోరియల్ జాతీయ స్థాయి వృషభరాజాల బల ప్రదర్శన పోటీలు అట్టహాసంగా ముగిశాయి. ఎనిమిది రోజుల పాటు పెద్ద ఎత్తున జరిగిన ఈ పోటీలను ప్రతి ఒక్కరూ సమన్వయంతో విజయవంతం చేయడంపై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ధన్యవాదాలు తెలిపారు. సీనియర్స్ విభాగంలో నంద్యాల జిల్లా, పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన ఒడిక్కి శేఖరరెడ్డి, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఎస్ఎస్ఆర్ బుల్స్ సంయుక్తంగా ప్రథమ స్థానంలో నిలిచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను సొంతం చేసుకున్నాయి. అలాగే ఇతర విజేతలకు పది ద్విచక్ర వాహనాలతో కలిపి మొత్తం రూ.30 లక్షల విలువైన బహుమతులను ప్రదానం చేశారు. 8 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో 131 జతల ఒంగోలు ఎడ్లు పాల్గొన్నాయి. ఒంగోలు జాతి ఎడ్ల పరిరక్షణకు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ పోటీలను నిర్వహించారు. ఇందుకు 360 అడుగుల కోర్టును ఏర్పాటు చేశారు. ప్రేక్షకులు, ఎడ్లకు ఎండ తీవ్రత లేకుండా సాయంత్రం వేళల్లో బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ప్రాంగణం చుట్టూ ఐదువేల మంది పట్టేలా గ్యాలరీలను సిద్ధం చేశారు. పాల్గొన్న ప్రతి ఎడ్ల జత యజమానికి ప్రోత్సాహక బహుమతులు, మామిడి మొక్కలను నిర్వాహకులకు అందజేశారు. రాష్ట్ర మంత్రులు పోటీలకు హాజరై, బహుమతులు ప్రదానం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

టీడీపీ శ్రేణులకు.. విద్యుత్ ఉద్యోగి షాక్..!

- నాడు దుర్భాషలాడి.. నేడు సీఎంను కలిసి..
- విద్యుత్ శాఖ ఉద్యోగికి టీడీపీలో పెద్దపీట
- వైసీపీ ప్రభుత్వంలో పార్టీ కార్యకర్తలా వ్యవహారం
- పార్టీ అధిష్ఠానం.. జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదులు



సీఎంతో విద్యుత్ ఉద్యోగి బంగారయ్య

నరసరావుపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): అతను విద్యుత్ శాఖలో ఉద్యోగి. వైసీపీ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను నానా దుర్భాషలాడాడు. నాడు వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్‌గా పేరొందాడు. చంద్రబాబు, లోకేశ్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. నరసరావుపేట నియోజకవర్గం గోపిరెడ్డి అడ్డా 60 వేల మెజార్టీతో పల్నాడు జిల్లాలో ఆయన చరిత్ర సృష్టించబోతున్నారు అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఘనత ఆ ఉద్యోగిది. పార్టీ అధినేతలను సోషల్ మీడియా వేదికగా తిట్టిన వ్యక్తి.. నేడు సీఎం చంద్రబాబును కలవడంతో పార్టీ శ్రేణులు కంగుతిన్నాయి. ఉద్యోగి తన కుటుంబ సభ్యుని పేరుతో ఏర్పాటు చేసిన హెవీ వాహనాల డ్రైవింగ్ స్కూల్‌ను కూడా ఎమ్మెల్యే ప్రారంభించడం పార్టీలో చర్చనీయాంశమైంది. చంద్రబాబు, లోకేష్‌ను తిట్టిన విద్యుత్ శాఖ అకౌంట్ సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న రాఘవరపు బంగారయ్య.. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలసి బుధవారం చంద్రబాబును కలవడం గమనార్హం. ఈ ఫోటోలు.. నాడు చంద్రబాబు.. లోకేశ్‌కు వ్యతిరేకంగా పెట్టిన పోస్టులను టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. పార్టీ అధినేతలను దుర్భాషలాడిన ఉద్యోగిని చంద్రబాబు దగ్గరకు తీసుకువెళడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఈ మేరకు సదరు ఉద్యోగి.. చంద్రబాబు, లోకేశ్‌కు వ్యతిరేకంగా, డాక్టర్ గోపిరెడ్డికి అనుకూలంగా పెట్టిన పోస్టులను, వైసీపీ నేతలతో ఉన్న చిత్రాలను పార్టీ అధిష్ఠానానికి పంపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కూడా పిర్యాదు చేశారు. చంద్రబాబును తిట్టినా సరే సదరు ఉద్యోగి కోటు వేసి చంద్రబాబును కలిపేంత గొప్ప మనసున్న మారాజు అరవిందబాబు అంటూ సోషల్ మీడియాలో క్యాడర్ పోస్టులు పెట్టడం పార్టీలో చర్చనీయంశమైంది. దీని ద్వారా పార్టీ క్యాడర్‌కు ఎటువంటి సందేశం ఇస్తున్నారంటూ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. సదరు ఉద్యోగి విధులకు సరిగా హాజరు కాకపోయినా చర్యలు లేవని, వెంటనే చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.

హత్యాయత్నం కేసులో నలుగురికి రిమాండ్

నిందితుల్లో వైసీపీ ఎంపీటీసీ కల్పన

మంగళగిరి సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన నలుగురు నిందితులకు మంగళగిరి న్యాయస్థానం రెండు వారాల రిమాండ్ విధించింది. తాడికొండ సీఐ కె.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. కంతేరు గ్రామంలో గత నెల 25న చెలరేగిన వివాదం వర్గపోరుకు దారితీసింది. ఓ వర్గం మరో సామాజిక వర్గంపై దాడికి పాల్పడినట్లు తాడికొండ పోలీసులకు ఫిర్యాదు అందింది. మొత్తం పది మందిపై కేసు నమోదు కాగా, వారిలో నలుగురు నిందితులను శుక్రవారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో కర్రి నిఖిల్ (ఏ-5), కర్రి మహాలక్ష్మి (ఏ-7), వైసీపీ ఎంపీటీసీ వలపర్ల కల్పన (ఏ-8), కర్రి విజయభాస్కర్ (ఏ-10) ఉన్నారు. నిందితులను మంగళగిరి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రెండు వారాల రిమాండ్ విధించారు. అరెస్టయిన వారి తరపున మాజీమంత్రి అంబటి రాంబాబు, వైసీపీ నేతలు డైమండ్ బాబు, వేమారెడ్డి, డేవిడ్‌రాజు తదితరులు న్యాయవాదులతో కలిసి కోర్టు వద్దకు వచ్చారు.

విద్యుత్ ప్రాజెక్టు భద్రతపై ఎస్‌పీఎఫ్ ప్రత్యేక దృష్టి



టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు(ఫైల్ ఫోటో)

రెంటచింతల, మే 9 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మించిన నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు భద్రత గురించి ఎస్‌పీఎఫ్(స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) ఉన్నతాధికారులు శుక్రవారం సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఇప్పటి వరకు భద్రత పరంగా ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారనే దానిపై సమీక్షించారు. పాకిస్తాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఎస్‌పీఎఫ్ డీఎస్పీ టీకే చారి స్థానిక ఎస్‌ఐ మూర్తితో మాట్లాడారు. ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించాలని, నిఘా కట్టుదిట్టంగా ఉంచాలని ఆదేశించారు. క్షణం క్షణం ఉన్నతాధికారులతో టచ్‌లో ఉండాలని కోరారు. సత్రశాలలోని ప్రాజెక్టు వద్ద 17 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది డ్యాంకు ఇరువైపులా, గేట్ల దగ్గర భద్రతా విధులు నిర్వహిస్తున్నారు.

రిమాండ్ ఖైదీ పరారీ

గురజాలటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): రిమాండ్‌లో ఉన్న ఖైదీ పరారైన ఘటన శుక్రవారం జరిగింది. దాచేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్య కేసులో నిందితుడిగా.. గురజాల సబ్ జైలులో షేక్ జిలానీ రిమాండ్‌లో ఉన్నాడు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది మధ్యాహ్నం జైలు నుంచి జిలానీని గురజాల కోర్టుకు వాయిదా నిమిత్తం తీసుకెళ్లారు. ఇదే అదునుగా నిందితుడు పోలీసు సిబ్బంది కళ్లుగప్పి కోర్టు వద్ద నుంచి పరారయ్యాడు. దీనిపై సబ్‌జైల్ సూపరింటెండెంట్ అచ్చినాయుడును వివరణ కోరగా.. జరిగిన ఘటనపై గురజాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. గురజాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాలీ ఢీకొని..ద్విచక్ర వాహనదారుడి మృతి

నూజెండ్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన మండ లంలోని కొత్త ఉప్పలపాడు సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం.. మండ లంలోని కొత్తపాలెం గ్రామా నికి చెందిన కుంటా వెంకటరెడ్డి(62) వ్యక్తిగత పనుల నిమిత్తం వినుకొండకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఉప్పలపాడు నుంచి ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం కొమ్మవరానికి కూలీలతో వెళ్తున్న ఆటో ఎదురుగా అతనిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరెడ్డి రోడ్డుపై పడడంతో.. తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ బీవీ కృష్ణారావు పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

వ్యవసాయ పర్యావరణ కూటమిలో రైతు సాధికార సంస్థకు సభ్యత్వం

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పర్యావరణ కూటమిలో ఏపీ రైతు సాధికార సంస్థ సభ్యత్వం తీసుకోనుంది. రైతు సాధికారత, సుస్థిర, సహజ వ్యవసాయం, వాతావరణ స్థితి స్థాపకత, పర్యావరణం కోసం ఏపీ సామాజిక సహజ వ్యవసాయం పేరుతో రైతు సాధికార సంస్థ మార్గదర్శక ప్రయత్నాలకు గుర్తింపుగా కూటమిలో సభ్యత్వం తీసుకోనుంది. ఈ మేరకు వ్యవసాయ పర్యావరణ కూటమి నుండి రైతుసాధికార సంస్థకు ఆహ్వానం అందింది. సభ్యత్వానికి ఆర్థిక బాధ్యత లేనందున రైతు సాధికార సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

వైసీపీ నేత దాడిలో గాయపడి..చికిత్స పొందుతూ మృతి



బెజవాడ రమేష్ (ఫైల్‌ఫోటో)

మాచర్ల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు గొడ్డలితో దాడి చేయడంతో టీడీపీ కార్యకర్త కోమాలోకి వెళ్లి.. నాలుగు నెలలపాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మాచర్ల మండలం పశువేముల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బెజవాడ రమేష్ (28)కు, అతని మామ వైసీపీకి చెందిన పంచ్ల హరిశ్చంద్రకు కుటుంబ కలహాలున్నాయి. ఈ నేపథ్యంలో గతేడాది డిసెంబరు 16న హరిశ్చంద్ర గొడ్డలితో దాడి చేశాడు. దీంతో రమేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతను కోమాలోకి వెళ్లడంతో విజయవాడలోని ఓ ఆసుపత్రిలో నాలుగు నెలలుగా చికిత్స అందిస్తున్నారు. అప్పటి నుంచి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ శుక్రవారం తుది శ్వాస విడిచాడు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే రమేష్ కోమాలో ఉండడంతో కుటుంబ సభ్యులు మనస్తాపానికి గురై గత నెలలో హరిశ్చంద్ర (60)ను హత మార్చారు.

కంటైనర్, బైక్ ఢీ: విద్యార్థులకు గాయాలు

● పెట్రోలు లీకై దగ్ధమైన బైక్



గాయపడిన విద్యార్థిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న 108 సిబ్బంది

యడ్లపాడు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న కంటైనర్, బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు గాయపడగా, బైక్ దగ్ధమైంది. వంకాయలపాడు సమీపంలోని జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని జగ్గాపురం, యడ్లపాడు గ్రామాలకు చెందిన వెంకటేష్, హరీష్, చిలకలూరిపేట మండలం సోమరపాడు గ్రామానికి చెందిన శివబాబు ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని మిట్టపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. మధ్యాహ్నం కళాశాల నుంచి ద్విచక్ర వాహనంపై ముగ్గురూ ఇంటికి బయలుదేరారు. వంకాయలపాడు-ఎన్ఎస్ఎల్ టెక్స్ టైల్స్ మధ్య ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. బైక్‌తో సహా ముగ్గురూ రోడ్డుపై పడి, తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్రవాహనం ట్యాంకు నుంచి పెట్రోలు లీకై మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానికులు 108కు సమాచారం అందించగా.. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 513.40 అడుగులు ఉంది. ఇది 137.51 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,350, మొత్తం ఔట్‌ఫ్లో 1,350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

లిఫ్టులో ఇరుక్కుపోయిన ఎంపీ, చీఫ్ విప్



బయటకొస్తున్న చీఫ్ విప్ జీవీ

వినుకొండటౌన్, మే 9, (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లి కార్జున రావు ఎక్కిన లిఫ్ట్ ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో కొన్ని నిమిషాలపాటు నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటన పట్టణంలోని లాయర్ స్ట్రీట్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. లాయన్ స్ట్రీట్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్‌పై నూతనంగా ఏర్పాటు చేసి ఉషోదయ సోలార్ అండ్ అగ్రీ కార్యాలయం ప్రారంభోత్సవానికి కార్యక్రమానికి ఎంపీ, చీఫ్ విప్, జీడీసీసీ చైర్మన్ హాజరయ్యారు. బిల్డింగ్ యజమానితో కలిసి రెండో అంతస్తుకు చేరుకునేందుకు వీరు లిఫ్ట్ ఎక్కారు. కెపాసిటి ముగ్గురికి మించి అందులో ప్రయాణించకూడదు. కానీ, నలుగురు ఎక్కడంతో రెండు అంతస్తుల మధ్య లిఫ్ట్ ఆగిపోయింది. దీంతో కార్యకర్తలు, నాయకులు గాబరాపడ్డారు. ఇంతలో లిఫ్ట్ మెకానిక్‌ని తీసుకువచ్చి మరమ్మతులు చేపట్టడంతో.. అంతా ఊపిరి పీల్చుకున్నారు.

96,112 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 85,708 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 96,112 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 17,960 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	14000
334	9500	13400	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	---	-----	సింజెంటా బ్యాడిగి 5531	---	---
341	10000	13300			
4884	10000	11200	దేవనూరుడీలక్స్	10000	12500
సూపర్10	10000	12600	ఆర్మూరు	9800	11200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

కోర్టు కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 9 (ఆంధ్రజ్యోతి): విభాగాల వారీగా వివిధ రకాల కోర్టు కేసుల పరిష్కారంపై ఈనెల 20వ తేదీ నాటికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులను ఆదేశించారు. కమిషనర్ తమ చాంబర్‌లో కోర్టు కేసుల పురోగతి, పెండింగ్ అంశాలపై విభాగాధిపతులు, సూపరింటెండెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత విభాగాల వారీగా ఉన్న కేసులు, తీర్పు వచ్చిన కేసులు, పెండింగ్ ఉన్నవి వివరాలు తీసుకొని, మాట్లాడుతూ వివిధ అంశాలపై ఆయా సంస్థలు, వ్యక్తులు ఫైల్ చేసిన కోర్ట్ కేసుల్లో ఎక్కువ శాతం పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించినవే అధికంగా ఉన్నాయన్నారు. ఈ నెల 20 వరకు ప్రత్యేక డ్రైవ్ పెట్టుకొని కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు, ప్యారావైజ్ రిమార్క్స్ వంటివి పూర్తి చేయాలని, సోమవారం నుంచి ప్రతి రోజు కేసుల పురోగతిపై సమీక్ష చేస్తామని తెలిపారు. అలాగే కొన్ని కేసులకు సంబంధించి కోర్టులు ఇచ్చిన తీర్పుల అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సూపరింటెండెంట్లు, లీగల్ సెల్ సిబ్బంది సమన్వయంతో ప్రతి రోజు కోర్టు కేసుల పురోగతిపై తమకు నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సీఎంహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, మేనేజర్ బాలాజీ బాషా, విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి : ఏపీటీఎఫ్

గుంటూరు(విద్య), మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను పరిరక్షణ చేసి బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నేటి విద్యాశాఖామంత్రి లోకేశ్ జీఓ 117 రద్దు చేస్తామని హామీ ఇచ్చి జీఓ విడుదల చేసినప్పటికీ అధికార యంత్రాంగం దానిని పూర్తిగా అమలు చేయట్లేదన్నారు. అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ బదిలీలలో ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న భౌతిక శాస్త్ర, తెలుగు స్కూల్ అసిస్టెంట్ల కంపల్సరీ బదిలీ చేస్తూ వారి స్థానంలో మరొక స్కూల్ అసిస్టెంట్లను తీసుకురావాలనుకోవడం అధికారుల నియంతృత్వానికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ అన్ని రకాల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని అన్నారు. ధర్నా అనంతరం ర్యాలీగా వెళ్లి కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి సమస్యలతో కూడిన మెమోరాండం సమర్పించారు. ఈ ధర్నాలో ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎస్ మూర్తి, ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, జనార్దనరావు, లక్ష్మీనారాయణ, జి.దాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న పాండురంగవరప్రసాద్

బదిలీ నిబంధనలు సవరించాలని 12న యూటీఎఫ్ ధర్నా

గుంటూరు(విద్య), మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్ని బలోపేతం చేసే విధంగా, ఉన్నత పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయుల కేటాయింపు జరిగేలా బదిలీ నిబంధనలు ఉండాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్ రావు, ఎం.కళాధర్ ప్రభుత్వాన్ని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం బదిలీ నిబంధనలను సవరించాలని కోరుతూ 12న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు నోటీసు డీఈవో బాజాబాబుకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, కళాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల పునఃనిర్మాణం చట్టంలోని నిబంధనలు పాఠశాలల్ని నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయని అన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు టీచర్లు ఇవ్వాలని, ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు ఉండాలని, ఉపాధ్యాయుడు విద్యార్థుల నిష్పత్తి 1:20 మాత్రమే ఉండాలని, హైస్కూల్లో 45 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలల్లో తెలుగు మీడియం కొనసాగించాలని కోరారు. ఆయా డిమాండ్లతో కూడిన ధర్నా నోటీసుని అందించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎం.హనుమంతరావు, జిల్లా కార్యదర్శులు గోవింద, రంగారావు, కోటిరెడ్డి పాల్గొన్నారు.


డీఈవోకు నోటీసు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

తెలుగు కళా, సాహిత్య రంగంలో మాణిక్యం

● మూడు నంది పురస్కారాలు అందుకున్న గుంటూరు యువకుడు

గుంటూరు(విద్య), మే 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యం, నాటక రంగం, విజ్ఞాన శాస్త్ర రంగాల్లో అనుపమాన కృషి చేస్తున్న గుంటూరుకు చెందిన తూములు మణికోట రాజశేఖర్ ఈనెల 5న హైదరాబాదులోని త్యాగరాయ గానసభ వేదికగా జరిగిన రవీంద్రనాథ్ టాగూర్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో 'స్వర్ణ నంది పురస్కారం' అందుకున్నారు. తెలుగు సన్నిధి సాహితీ సేవా ట్రస్ట్ (తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన సంస్థ) ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కార్యక్రమంలో తూములు మణికోట రాజశేఖర్ తెలుగు సాహిత్యంలో విశేష కృషికి, తెలుగు కళారంగ అభివృద్ధికి చేసిన సేవకు, దుర్యోధన ఏక పాత్రాభినయంలో ఉత్తమ ప్రదర్శనకు ఈ అవార్డులు అందుకున్నారు. రాజశేఖర్ ప్రస్తుతం బెంగళూరులో ఇంజనీర్‌గా, శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తిస్తున్నారు.


నంది పురస్కారం అందుకుంటున్న రాజశేఖర్

జీవో 523 రద్దు చేయాలి

గుంటూరు సిటీ, మే 9 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల ప్రయోజనాలను పణంగా పెడుతూ తీసుకువచ్చిన జీఓ 523ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ జీవో వలన వార్డు సచివాలయ ఉద్యోగులకు, తమపరి వచ్చినట్లు కాలేదని రెండు ఇంక్రిమెంట్లు పెరుగుదల మాత్రమే ఉందని తెలిపారు. గత ప్రభుత్వం అర్థరహితంగా ఇచ్చిన జీవో 523 ను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు.

బీఆర్ స్టేడియం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు(తూర్పు), మే 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ స్టేడియం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. బీఆర్ స్టేడియం ప్రహరీ గోడ శంకుస్థాపన కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకింగ్ ట్రాక్‌ను, స్టేడియం పరిస్థితులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ మాట్లాడుతూ బీఆర్ స్టేడియం దాదాపు 18 ఎకరాల్లో విస్తరించి ఉందని, దీని అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే ఖేల్ ఇండియా, సీఎస్ఆర్ నిధులతో, శాప్ ద్వారా ఒక సమీకృతంగా డీపీఆర్ తయారు చేయడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. స్టేడియం స్థలాన్ని పరిరక్షించుకునేందుకు ప్రహరీతో పాటు, దాదాపు రూ.కోటి 60 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారాలతో అంతర్జాతీయ స్థాయి స్టేడియంగా మారుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, డీఎస్‌డీవో నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ స్టేడియం ప్రహరీకి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్, షేక్ సజీల తదితరులు

సీఐడీ కార్యాలయం వద్ద వైసీపీ నేతలకు రాచమర్యాదలు

● సోషల్ మీడియాలో కామెంట్ల జోరు


కుర్చీలలో ఆశీనులైన అంబటి రాంబాబు, శివకుమార్

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : నాడు సీఐడీ కార్యాలయానికి కనుచూపుమేరలో టీడీపీ నేతలు, కార్యకర్తలకు అవకాశమే ఉండేది కాదు. ఎంతటి వారైనా మెడికల్ కళాశాల పక్కనున్న మెయిన్ రోడ్డుపై కారు దిగి నడుచుకుంటూ అర కిలోమీటర్ దూరంలో ఉన్న సీఐడీ కార్యాలయానికి వెళ్లాల్సిందే. మెయిన్ రోడ్ పై భారీగా పోలీసు బలగాలు మోహరించి బారికేడ్లతో పహారా కాసేవారు. నాడు చంద్రబాబు, లోకేశ్, రఘురామ కృష్ణంరాజు మొదలు టీడీపీలో ముఖ్యమైన నాయకులు మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలను విచారణ పేరుతో ఇదే కార్యాలయానికి తరలించారు. చివరకు మీడియా వారికి కూడా కార్యాలయంలోకి ప్రవేశం లేదు. ఇదే సీఐడీ కార్యాలయం కేంద్రంగా నాడు వైసీపీ ప్రభుత్వం పోలీసులు అడ్డుపెట్టుకొని అరాచకాలు సృష్టిస్తే... నేడు కూటమి ప్రభుత్వం సీఐడీ కార్యాలయానికి వెళ్లడానికి ఎటువంటి ఆంక్షలు లేకుండా చేసింది. సిఐడి కార్యాలయంలో విచారణకు శుక్రవారం సజ్జల రామకృష్ణారెడ్డి, దేవినేని అవినాష్ వచ్చిన సందర్భంగా వారి వెంట మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తిన శివకుమార్‌లతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు తరలివ చ్చారు వారందరూ సీఐడీ ప్రధాన కార్యాలయం గేటు వరకు వచ్చేలా పోలీసులు అవకాశం కల్పించారు. అంతేగాక సీఐడీ కార్యాలయం వెలుపల ఉన్న కుర్చీలలో వైసీపీ నేతలు అంబటి రాంబాబు, అన్నాబత్తిన శివకుమార్ ఆశీనులయ్యారు. దీనిపై నెటిజన్లు ముఖ్యంగా కూటమి పార్టీల నాయకు లు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు కూడా పెద్ద ఎత్తున కామెంట్లు చేశారు నాటికి, నేటికి ఎంత తేడా అంటూ కొందరు కామెంట్ చేస్తే మరికొందరు ఇది మంచి ప్రభుత్వం అంటూ కూటమి ప్రభుత్వాన్ని ఎద్దేవా చేస్తూ పోస్టులు పెట్టారు.

రైలులో గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు

● మరొకరు పరారు ● 16 కిలోలు స్వాధీనం

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : రైలులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఒడిస్సాకు చెందిన అజిత్ కుమార్ జైన్ అనే యువకుడిని గుంటూరు రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీఆర్‌పీ డీఎస్పీ అక్కేశ్వరరావు నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన అజిత్ కుమార్ జైన్, భోగా నాయక్‌లు గంజాయిని కొనుగోలు చేసి అధిక లాభాల కోసం గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో అమ్ముకొనుటకు రైలు ద్వారా ప్రయాణిస్తున్నారు. దీనిపై రైల్వే పోలీసులకు అందిన సమాచారం మేరకు గుంటూరు రైల్వే సబ్ డివిజన్ డీఎస్పీ అక్కేశ్వరరావు ఆదేశాల మేరకు గుంటూరు రైల్వే సీఐ అంజి బాబు, సిబ్బంది కలసి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం అజిత్ కుమార్ జైన్‌ని అదుపులోనికి తీసుకొని అతను వద్ద నుంచి 16 కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనపరుచుకున్నారు. అజిత్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. రెండవ ముద్దాయి అయిన భోగా నాయక్ పరారీలో ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ గురించి గుంటూరు జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ అంజిబాబు స్పెషల్ టీములు ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తూనికలు, కొలతల్లో మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు(తూర్పు), మే 9 (ఆంధ్రజ్యోతి) : తూనికలు కొలతల్లో మోసాలపై అప్రమత్తంగా ఉండాలని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ షాలెం రాజు అన్నారు. మెట్రాలజీ డే కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం గుజ్జనగుండ్ల, డి మార్ట్‌లో అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వస్తువును కొనుగోలు చేసే సమయంలో ఉత్పత్తిదారుడు పేరు, బ్యాచ్ నెంబరు, తయారు చేసిన తేదీ, వస్తువు రేటు, పన్నులు ఇతర వివరాలను తెలుసుకోవాలన్నారు. జాతీయ వినియోగదారుల సమాఖ్య సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు మాట్లాడుతూ ప్యాకింగ్ ఆహార పదార్థాలపై వివరాలను ముద్రించకపోతే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు, కార్మిక సంఘాల సమ్మెను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. బ్రాడీపేట, పీఎల్ రావు భవన్లో శుక్రవారం రైతు, కార్మిక సంఘాల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను హరించే విధంగా నాలుగు లేబర్ కోడ్‌ల తీసుకొచ్చి ఉన్న చట్టాలుకు తూట్లు పొడుస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కంచుమాటి అజయ్, పచ్చల శివాజీ, పాశం రామారావు, ఈమని అప్పారావు, మన్నవ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలి

గుంటూరు(తూర్పు), మే 9 (ఆంధ్రజ్యోతి): రాజధానిలో కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించి, మాలలకు ఆర్థిక తోడ్పాటును అందించాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు కొర్రపాటి సురేష్ అన్నారు. ఈ మేరకు ఎస్సీ మాల కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కొర్రపాటి సురేష్ మాట్లాడుతూ అమరావతితో పాటు రాష్ట్రంలో ప్రధాన నగరాల్లో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని కోరారు. కార్పొరేషన్ రుణాల సబ్సిడీ 40 నుంచి 50 శాతానికి తగ్గకుండా పటిష్టంగా అమలు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హిందువుల ధైర్యం.. మహారాణాప్రతాప్ సింగ్ : వల్లూరి

గుంటూరు(తూర్పు), మే 9(ఆంధ్రజ్యోతి): హిందువుల గుండెల్లో ఉత్సాహాన్ని కలిగించే వీరుడు మహారాణాప్రతాప్ సింగ్ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై శుక్రవారం ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ మహారాణాప్రతాప్ సింగ్ 486వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం డాక్టర్ రాజపుత్ర మధూరి విజేతసింగ్, బాణాల వెంకట సాయిమణికంఠ, రాజపుత్ర కార్తిక మధూరిసింగ్‌లను ఆయన ఘనంగా సత్కరించారు. తొలుత కార్యక్రమాన్ని ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు ప్రారంభించగా, సభకు రామరాజు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్షత్రి ధర్మనారాయణసింగ్, ఏపీ చత్రపతి శివాజీ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి జూజం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌లో విజయం సాధించాలని పూజలు

గుంటూరు మెడికల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరుగుతున్న ఆపరేషన్ సిందూర్ యుద్ధ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని మన దేశానికి విజయం సిద్ధించాలని కోరుతూ బీజేపీ గుంటూరు ఈస్ట్ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం దేవాలయం, మసీదు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సురక్షితంగా ఉండాలని, ఉగ్రదాడిలో అసువులు కోల్పోయిన దేశప్రజలు, సైనికుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఈ పూజలు, ప్రార్థనలు జరిపారు. తొలుత ఉదయం కొత్తపేటలోని శివాలయంలో డాక్టర్ ఉమాశంకర్ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం గ్రాండ్ ట్రంక్ రోడ్‌లోని మస్తానయ్య దర్గాలో, పాతబస్టాండ్ సెంటర్ గన్‌హల్ రోడ్‌లోని చర్చిలో ప్రార్థనలు చేయించారు. కార్యక్రమాల్లో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ శనక్కాయల అరుణ, సురేష్‌కుమార్ జైన్, షేక్ రఫీ, మలిశెట్టి పవన్‌కుమార్, రామకృష్ణ, పోకల పురుషోత్తం, శ్రీనివాస్, దేసు సత్యనారాయణ, దేవిశెట్టి బాబురావు, మైలవరపు ప్రవీణ్, జనసేన నాయకులు శనక్కాయల శివరామ హైమావతి తదితరులు పాల్గొన్నారు.


శివాలయంలో పూజలు చేయిస్తున్న శనక్కాయల ఉమాశంకర్

పోలీసులు తనిఖీలు ముమ్మరం చేయాలి

● బీజేపీ కిసాన్ మోర్చా నేత విఠల్ విజ్ఞప్తి

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో యుద్ధం జరుగుతున్న దృష్ట్యా పోలీసులు గుంటూరులో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ పాండురంగ విఠల్ కోరారు. బీజేపీ రూరల్ మండలం అత్యవసర సమావేశం నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. పాండురంగ విఠల్ మాట్లాడుతూ బంగ్లాదేశ్, రోహింగ్యాలు అక్రమంగా సంచరిస్తున్నట్లు అనుమానాలు తలెత్తుతున్న దృష్ట్యా వెంటనే దీనిపై విచారణ జరపాలని కోరారు. స్లీపర్ సెల్స్‌ని నిర్వీర్యం చేయాలన్నారు. నగరంలో ప్రాంతాల వారీగా పోలీసులు కార్డెన్ సెర్చ్ పెట్టి ప్రతి ఇంటికి వెళ్లి తనిఖీలు చేయాలన్నారు. లేకుంటే ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో రూరల్ మండల బీజేపీ అధ్యక్షుడు కంచర్ల రాజేష్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ పెండింగ్ ప్రోత్సాహకాలు విడుదల

● ఉమ్మడి జిల్లాకు రూ.7.20 కోట్లు

గుంటూరు సిటీ, మే 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌కు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గతంలో పేరుకుపోయిన బకాయిలను విడుదల చేసేందుకు సుముఖత వ్యక్తం చేసింది. అందులో భాగంగా 2024 అక్టోబరు నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలు శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ.7.20 కోట్లు విడుదలైనట్లు అధికారులు వెల్లడించారు. గుంటూరు జిల్లాకు రూ.1,68,26,250, బాపట్ల జిల్లాకు రూ.2,77,68,750, పల్నాడు జిల్లాకు రూ.2,75,02,500 నిధులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

గుంటూరులో నిరసన ప్రదర్శన..

ఆరు సంవత్సరాల సర్వీస్ పూర్తయిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌ను క్రమబద్ధీకరించాలని కోరుతూ గుంటూరులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు తమనంపల్లి ప్రవళిక మాట్లాడుతూ ప్రభుత్వం మానవతా దృక్పథంతో తమ సమస్య లను అర్థం చేసుకొని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జనరల్ సెక్రటరీ పల్లపాటి లింగరాజు, వైస్ ప్రెసిడెంట్ జి.వనజ, షరీఫ్, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ స్ట్రగుల కమిటీ అధ్యక్షులు స్వచ్ఛంద ప్రసాద్,ఏపీ ఎమ్ సి ఏ కో ఆర్డినేటర్ దీక్షత,జిల్లా నాయకులు జ్యోష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫ్లోరెన్స్ నర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సూర్య కుమార్ పాల్గొని మద్దతు తెలిపారు.

శ్రీ కన్యకా పరమేశ్వరికి లక్ష మల్లెల అర్చన

గుంటూరు, మే 9(ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జయంతి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళా భక్తులతో సామూహిక కుంకుమార్చనలు, అనంతరం లక్ష మల్లెల అర్చనలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ (బాబు), టీడీపీ నాయకులు కొనకళ్ళ సత్యం, తల్లం శేఖర్, అంకారావు, శ్రీను తదితరులున్నారు.

తెలుగు పద కవితా పితామహుడు అన్నమయ్య

గుంటూరు(తూర్పు), మే 9(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష సాహిత్యానికి, సంగీతానికి, కవితా వికాసానికి తాళ్లపాక అన్నమాచార్యుల వారి కృషి మరువలేనిదని జిల్లా అటవీ శాఖ అధికారి శైలజ అన్నారు. శుక్రవారం, భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించిన అన్నమయ్య కీర్తనలు, రాష్ట్ర స్థాయి పోటీల బహుమతి ప్రదానోత్సవానికి హాజరైన ఆమె మాట్లాడుతూ తెలుగు తొలి వాగ్గేయకారునిగా 32 వేలకు పైగా కీర్తనలను స్వరపరిచి తెలుగు భాష వైభవానికి అన్నమయ్య విశేష కృషి చేశారని అన్నారు. భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం వంటి అంశాలలో ప్రతిభ కలిగి ఉన్న బాలబాలికలను, యువతను సమాజానికి పరిచయం చేయాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. టీటీడీ, అన్నమయ్య ప్రాజెక్టు గాయకులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనల కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో మహిళా సంగీత సన్మండలి అధ్యక్షురాలు శేషరాణి, ఇంటాక్ సభ్యులు సీతారమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా రెండో శనివారం పురస్కరించుకొని నగరంలో పలు ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

పశ్చిమ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి


సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, మే 9(ఆంధ్రజ్యోతి) : గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తు న్నానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గంలోని శ్రీనివాసరావుపేటలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. అనం తరం డివిజన్లో పర్యటించి ప్రజలను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వన్ టైమ్ సెటిల్మెంట్ పేరుతో తమతో డబ్బులు కట్టించుకొని మోసం చేసిందని పలువురు మహిళలు ఎమ్మెల్యే వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. రామనామ క్షేత్రం ఎదురు గతంలో వాకింగ్ ట్రాక్, పార్క్ ఉండే వని, కొంతమంది దానిని ఆక్రమించేసి, కార్ల పార్కింగ్ లాగా ఉపయోగించుకుంటున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ రూ.24 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్, పైప్‌లైను పనులు చేపట్టామని చెప్పారు. వడ్డెగూడెంలో అనేక అభివృధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, కార్పొరేషన్‌కు పంపామని తెలిపారు. శివారు ప్రాంతాల్లో ఉన్న కాలనీలకు కూడా తాగునీరు అందేటట్లు చూస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల రమణ, ఉప్పతల సాంబ శివ రావు, సానం రమేష్, అప్పిశెట్టి రంగ, ఆళ్ల హరి, బుజ్జి, ఇంతియాజ్, నాగేంద్ర, శంకర్ రావు, సాయి పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై సీఎంకు ఎమ్మెల్యే విన్నపం

అమరావతి వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని శుక్రవారం ఎమ్మెల్యే గళ్లా మాధవి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించి వినతిపత్రాలు అందజేశారు.

ఉగ్రవాద చర్యలను ముస్లిం సమాజం సహించదు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో ముస్లిం సమాజం సహించబోదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిని ప్రపంచం యావత్తు తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ఉగ్రవాదులపై భారత్ తీసుకుంటున్న నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ఆయన అన్నారు. ఖురాన్‌లో తెలిపిన విధంగా మానవత్వమే హితమని స్పష్టం చేశారు. పెహల్గాంలో పేరు అడిగి మరీ కాల్పులు జరపడం కుల మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ఉగ్రవాదులు చేసిన పిరికిపంద చర్య అని వ్యాఖ్యానించారు. ఇలాంటి నీచమైన దుశ్చర్యలను ముస్లింలు ఎన్నటికీ సహించబోరని ఎమ్మెల్యే ఉద్ఘాటించారు. దేశ రక్షణలో జవాన్ మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడంపై ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జవాన్ కుటుంబానికి ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దళితులను కిడ్నాప్ చేసి హత్యలు చేస్తే అరెస్టు చేయరా?

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి


కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, మే 9(ఆంధ్రజ్యోతి): దళితులను కిడ్నాప్ చేసి హత్యలు చేస్తే అరెస్టు చేయకుండా వదిలేస్తారా అంటూ టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విరుచుకుపడ్డారు. అరండల్‌పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి చూపించిన 1.0 సినిమాకే ప్రజలు భయపడి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా తరిమి కొట్టినా బుద్ధి రాలేదని విమర్శించారు. అధికారం కోల్పోయిన తరువాత జగన్ రెడ్డికి పూర్తిగా మతి భ్రమించిందని, లండన్ మందులు కూడా సరిగా పని చేయడం లేదని మండిపడ్డారు. వైసీపీ నాయకులను, కార్యకర్తలను పార్టీ మారకుండా కాపాడుకోవటం కోసం జగన్ పదే పదే అధికారులను బెదిరిస్తూ మైండ్ గేమ్‌కి పాల్పడుతున్నాడని అన్నారు. వచ్చే ఎన్నికలు నాటికి వైసీపీ అంతరించిపోయిన ప్రాంతీయ పార్టీల జాబితాలో చేరనుందని జోస్యం చెప్పారు. టీడీపీ కార్యాలయాలపై దాడులు, దళితులను కిడ్నాపులు చేస్తే అరెస్టు చేయకుండా చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. రాజశేఖరరెడ్డి, జగన్ రెడ్డి హయాంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జైళ్లకు వెళ్లడం పరిపాటేనని అన్నారు. వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ ఛైర్మన్, ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ వీసీలను అనేక రకాలుగా హింస పెట్టి వేధించిన దుర్మార్గుడు పీఎస్సార్ ఆంజనేయులు అని కనపర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.

భోజన కుతూహలం

పల్లేరుతో భేషైన ఆరోగ్యం..!

పల్లేరు మనకు చాలా ప్రాంతాల్లో కనిపిస్తూ ఉంటుంది. చాలా మంది దీన్ని పిచ్చి మొక్క అనుకుంటారు. కానీ పల్లేరు కాయలు, ఆకుల వల్ల అమితమైన ప్రయోజనాలున్నాయని ఆయుర్వేద గ్రంధాలు చెబుతున్నాయి.



పల్లేరును సంస్కృతంలో 'గోక్షురం' అని పిలుస్తారు. 'గోక్షురం' అంటే శరీరానికి చల్లదనాన్ని, బలాన్ని, పుష్టిని అందించేదని అర్థం. పల్లేరుకాయలు చిన్నవి, పెద్దవి అని రెండు రకాలుగా ఉంటాయి. పెద్ద పల్లేరుకాయల్ని 'గజపల్లేరు' అంటారు. ఈ కాయను రెండుగా చీలిస్తే- లోపల భాగమంతా జిగురుగా ఉంటుంది. ఈ జిగురు మన శరీరానికి ఎంతో ఉపకరిస్తుంది. కేవలం జిగురు మాత్రమే కాదు, పల్లేరు ఆకులు, కాయలు, వేర్లు... ఇవన్నీ త్రిదోష సమతుల్యతను కలిగిస్తాయి. చిన్న పల్లేరు కాయలకు కూడా ఈ తరహా గుణాలే ఉంటాయి. పల్లేరు కాయలు, ఆకుల వల్ల కలిగే ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం.

- పల్లేరు ఆకులను ఎండబెట్టి వాటితో ఉదయాన్నే టీ చేసుకొని తాగితే చర్మానికి కాంతి వస్తుంది.
- పల్లేరు ఆకులను సలాడ్‌లో వేసుకొని తింటే మూత్రంలో మంట తగ్గుతుంది. మూత్రనాళంలోని రాళ్లు కరిగిపోతాయి.
- పల్లేరు కాయలను ఎండబెట్టి కషాయంగా చేసి తాగితే హార్మోన్ల అసమతౌల్యం కలిగే రకరకాల సమస్యలు తగ్గుతాయి. యువతులను వేధించే 'పోలిసిస్టిక్ ఓవేరియన్ డిసీజ్' (పీసీఓడీ)కు కూడా ఇది మంచి పరిష్కారం.
- పల్లేరు కాయలు స్ఫటికం మాదిరిగా ముళ్లు ముళ్లుగా ఉంటాయి. ఈ కాయలలోని గుజ్జును ఏదో ఒక రూపంలో తీసుకుంటే మూత్రపిండాల్లో పేరుకున్న రాళ్లు కరుగుతాయి.
- పల్లేరు ఆకులు, కాయలు, వేర్లను ఎండబెట్టి... పొడి చేసి దాన్ని కూరల్లో వాడుకుంటే రకరకాల ప్రయోజనాలు ఉంటాయి.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

మనలో చాలామంది తాటి ముంజలను ఇష్టంగా తింటూ ఉంటారు. వీటితో రకరకాల వంటలు కూడా చేసుకోవచ్చు. తాటి ముంజలను సరికొత్తగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...

తాటి ముంజలతో మురిపించే రుచులు

తాటి ముంజలతో లెమనేడ్

కావాల్సిన పదార్థాలు

తాటి ముంజలు- నాలుగు, నిమ్మరసం- రెండు చెంచాలు, పంచదార- మూడు చెంచాలు, ఐస్ క్యూబ్స్- 4, ఉప్పు- చిటికెడు, నల్ల ఉప్పు- చిటికెడు, నీళ్లలో నానబెట్టిన సబ్జాగింజలు- రెండు చెంచాలు, పుదీనా ఆకులు రెండు

జాగ్రత్తలు

- లేత తాటి ముంజలు తీసుకుంటే ఈ పానీయం మరింత రుచిగా ఉంటుంది.
- ఇందులో నానబెట్టిన చియా గింజలు కూడా వేసుకోవచ్చు.

తయారీ విధానం

- తాటి ముంజలను చిన్న ముక్కలుగా తరగాలి.
- మిక్సీలో తాటి ముంజల ముక్కల్లో సగం, నిమ్మరసం, పంచదార, రెండు ఐస్ క్యూబ్‌లు, ఉప్పు, నల్ల ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి.
- ఒక సర్వింగ్ గ్లాస్‌లో సబ్జా గింజలు, మిగిలిన తాటి ముంజల ముక్కలు, రెండు ఐస్ క్యూబ్‌లు, మిక్సీ గిన్నెలోని మిశ్రమం వేయాలి. ఒక గ్లాసు చల్లని నీళ్లు పోయాలి. పైన పుదీనా ఆకులు వేసి సర్వ్ చేయాలి.

వీటిలో నీరు అధికంగా ఉంటుంది కాబట్టి శరీరానికి తగినంత తేమ అందుతుంది. నిర్జలీకరణ సమస్యలు రావు. తాటి ముంజలలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.



తాటి ముంజల పాయసం

కావాల్సిన పదార్థాలు

పాలు- ఒక లీటరు, పంచదార- ముప్పావు కప్పు, లేత తాటి ముంజలు- ఆరు, యాలకుల పొడి- అర చెంచా, బాదం పలుకులు- రెండు చెంచాలు, జీడి పప్పు పలుకులు- రెండు చెంచాలు, గులాబీ నీరు- ఒక చెంచా

తయారీ విధానం

- తాటి ముంజలకు తొక్క తీసి వీలైనంత సన్నగా తరగాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి పెద్ద మంట మీద పావుగంటసేపు మరిగించాలి. పాలను గరిటెతో తిప్పుతూ ఉండాలి. పాలు చిక్కగా అయ్యాక పంచదార పోసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత పాలను స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. ఫ్రిజ్‌లో రెండు గంటలు ఉంచాలి. తరవాత ఈ చల్లటి పాలలో తాటి ముంజల తరుగు, గులాబీ నీళ్లు, బాదం పలుకులు, జీడిపప్పు పలుకులు, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. తరవాత చిన్న పింగాణీ గిన్నెల్లో పోసి సర్వ్ చేయడమే. ఈ పాయసం రుచి అద్భుతంగా ఉంటుంది.




జాగ్రత్తలు

- పాయసం చిక్కగా ఉండాలనుకుంటే... చిన్న గిన్నెలో ఒక చెంచా కస్టర్డ్ పౌడర్ వేసి, కొన్ని నీళ్లు పోయాలి. జారుగా కలిపి ఆ మిశ్రమాన్ని మరుగుతున్న పాలలో కలిపితే సరిపోతుంది.
- గులాబీ నీరు అందుబాటులో లేకపోతే నాలుగు రేకుల కుంకుమ పువ్వు వేసుకోవచ్చు.
- పంచదార వద్దనుకుంటే... మరిగిన పాలను స్టవ్ మీద నుంచి దించాక అందులో బెల్లం పొడి కలుపుకోవచ్చు.

తాటి ముంజలలో ఎ, బి, సి విటమిన్లతోపాటు ఐరన్, జింక్, ఫాస్పరస్, పొటాషియం లాంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రక్తపోటు, మలబద్దకం లాంటి సమస్యలను నివారిస్తాయి. శరీరంలో కణితులు, రొమ్ము క్యాన్సర్ రాకుండా నిరోధిస్తాయి. ముఖం మీద మొటిమలు, మచ్చలు, ముడతలు రాకుండా చేస్తాయి.

తాటి ముంజల కూర



కావాల్సిన పదార్థాలు

తాటి ముంజలు- నాలుగు, సన్నగా తరిగిన టమాటా ముక్కలు- అర కప్పు, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, పచ్చి మిర్చి- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, ఉప్పు- తగినంత, కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, ధనియాల పొడి- అర చెంచా, జీలకర్ర- పావు చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, కొత్తిమీర తరుగు- పావు కప్పు, నూనె- మూడు చెంచాలు

జాగ్రత్తలు

- తాటి ముంజల్ని మరీ లేతగా, మరీ ముదురుగా కాకుండా మధ్యస్థంగా ఉండేవి తీసుకోవాలి.
- నూనె వేడెక్కిన వెంటనే కొన్ని జీడిపప్పు పలుకులు వేస్తే కూర కమ్మగా ఉంటుంది.
- టమాటా ముక్కలను వీలైనంత సన్నగా తరగాలి. లేదంటే టమాటా పేస్టు వాడుకోవచ్చు.

తయారీ విధానం

- తాటి ముంజలకు తొక్క తీసి ఒక్కోదాన్ని నాలుగు ముక్కలుగా కోయాలి.
- స్టవ్ మీద కడాయి పెట్టి, నూనె వేసి వేడి చేయాలి. తరవాత జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు, చిటికెడు ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత తాటి ముంజల ముక్కలు, పసుపు, కారం, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిమిషాల తరవాత టమాటా ముక్కలు, ధనియాలపొడి, జీలకర్ర పొడి, కొత్తిమీర తరుగు వేసి కలపాలి. మూతపెట్టి అయిదు నిమిషాలు మగ్గించాలి. తరవాత కడాయిని స్టవ్ మీద నుంచి దించి కూరను వేరే గిన్నెలోకి తీయాలి. ఈ తాటి ముంజల కూర... అన్నం, చపాతీ, పుల్కాల్లోకి రుచిగా ఉంటుంది.

ఎండాకాలంలో తాటి ముంజలు తినడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. వడదెబ్బ తగలదు. శరీరంలో పేరుకున్న విషపదార్థాలు తొలగిపోతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

మూతల రంగుల్లో మర్మం ఇదే..!



మనం సాధారణంగా బయటికి వెళ్లినప్పుడు లేదా ప్రయాణాల్లో దాహమనిపిస్తే వెంటనే వాటర్ బాటిల్ కొనుక్కుని నీళ్లు తాగేస్తూ ఉంటాం. ఈ బాటిళ్లకు పలు రంగుల మూతలు ఉండడాన్ని చాలామంది గమనించే ఉంటారు. ఈ రంగు మూతలు ఆ బాటిళ్లలోని నీటి గురించి తెలియజేస్తాయంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

నీలం: మనకు తరచుగా లభ్యమయ్యే వాటర్ బాటిళ్లకు నీలం రంగు మూతలు ఉంటాయి. అంటే ఆ బాటిళ్లలోని నీటిని నదులు, చెరువులు లాంటి సహజ వనరుల నుంచి సేకరించి శుద్ధి చేశారని అర్థం. ఈ నీటిలో లవణాలు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అందుకే ఈ నీటిని 'మినరల్ వాటర్' అంటారు.

ఆకుపచ్చ: ఇవి కాస్త అరుదుగా కనిపిస్తూ ఉంటాయి. పెద్ద సూపర్ మార్కెట్లలో, షాపింగ్ మాల్స్‌లో, ఫైవ్ స్టార్ హోటళ్లలో ఇవి లభ్యమవుతాయి. ఆకుపచ్చ మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నది 'ఫ్లేవర్డ్ వాటర్' అని అర్థం. కొన్ని రకాల నేచురల్ ఫ్లేవర్స్‌ను స్వల్ప మోతాదులో కలపడం వల్ల ఈ నీరు ప్రత్యేకమైన రుచితో ఉంటుంది.



నలుపు: నలుపు రంగు మూత ఉన్న వాటర్ బాటిల్స్ కూడా అరుదుగానే కనిపిస్తాయి. వీటి ధర ఎక్కువగా ఉంటుంది. వీటిని సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలు కొంటూ ఉంటారు. నల్లని మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నవి... 'ఆల్కలైన్ కలిపిన నీళ్లు' అని అర్థం. ఈ నీళ్లు తాగితే కడుపులో ఆమ్లత్వం, ఇతర జీర్ణాశయ సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో క్షార పదార్థాలు, మినరల్స్ కూడా కలుపుతారు.

తెలుపు: తెల్లని మూత ఉన్న వాటర్ బాటిల్స్ సాధారణంగా అన్ని చోట్లా దొరుకుతూనే ఉంటాయి. వీధి చివరన ఉండే చిన్న కొట్లు, కిరాణా షాపులు, కూల్‌డ్రింక్ షాపులు, బస్టాండ్లలో ఇవి విరివిగా లభ్యమవుతూ ఉంటాయి. తెలుపు మూత ఉంటే ఆ బాటిల్‌లో ఉన్నవి 'బాగా శుద్ధి చేసిన నీళ్లు' అని అర్థం. వీటిలో ఎటువంటి మినరల్స్ ఉండవు. కేవలం దాహం తీర్చుకోవడానికి పనికొస్తాయి.

పసుపు, ఎరుపు, గులాబీ రంగులు: పసుపు రంగు మూత ఉంటే ఆ నీళ్లు విటమిన్లు, ఎలక్ట్రొలైట్లు కలిపినవనీ; ఎరుపు రంగు మూత ఉంటే అవి కార్బొనేటెడ్ నీళ్లు అనీ తెలుసుకోవచ్చు. గులాబీ రంగు మూత ఉంటే అది నీటిని గురించి తెలియజేసేది కాదు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు రొమ్ము క్యాన్సర్ గురించి అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినది.

మేకప్

మదర్స్ డే మేకప్

మదర్స్ డే నాడు మనోహరంగా కనిపించాలంటే 30 ఏళ్లు పైబడిన తర్వాత ముఖంలో ప్రతిఫలించే గీతలు, మచ్చలను మేకప్‌తో దాచేయాలి. తోటి తల్లులందరిలో మెరుపులీనుతూ కనిపించడం కోసం... ఇవిగో ఈ ప్రాథమిక మేకప్ చిట్కాలు పాటించండి.

హైడ్రేషన్ కోసం: వేసుకునే మేకప్ ముఖం మీద సమంగా పరుచుకోవడం కోసం ముందుగా చర్మాన్ని సిద్ధం చేయాలి. అందుకోసం ఫేసియల్ సీరమ్‌ను ముఖం మీద అద్దుకోవాలి. ఈ సీరం జిడ్డుగా ఉండకుండా చర్మానికి తేమతో పాటు, సన్‌స్క్రీన్ రక్షణ కూడా అందించేలా ఉండాలి. ఈ సీరమ్ చర్మంలో చక్కగా ఇంకిపోయిన తర్వాతే మేకప్ మొదలుపెట్టాలి.

ద్రవరూప ఫౌండేషన్: ముఖం మీద ఉండే సన్నని గీతల్లో ఇరుక్కుపోయి ఎబ్బెట్టుగా కనిపించకుండా ఉండాలంటే తేలికపాటి ద్రవరూప ఫౌండేషన్ ఎంచుకోవాలి. ఈ రకమైన ఫౌండేషన్ చర్మం మీద పలుచగా పొరలా ఏర్పడి ఆ తర్వాత వేసుకోబోయే కాంపాక్ట్, బ్లష్‌లకు అనువుగా ఉంటుంది. అయితే ఫౌండేషన్‌ను నేరుగా అప్లై చేసుకోకుండా, మొదట ముఖమంతా అక్కడక్కడా చుక్కలుగా అద్దుకుని, ఆ తర్వాత స్పాంజ్‌తో ముఖమంతా పరుచుకునేలా చేయాలి

తడిపిన స్పాంజ్‌తో: ఫౌండేషన్, కన్‌సీలర్‌ల కోసం తడిపి పిండిన మేకప్ స్పాంజ్ వాడుకోవాలి. ఈ పద్ధతితో మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. మరింత సహజసిద్ధంగా కనిపిస్తుంది. అయితే స్పాంజి తేమగా ఉండాలే తప్ప నీరు కారుతూ ఉండకూడదు. అందుకోసం స్పాంజిని గోరువెచ్చని నీటి ధార కింద ఉంచి, గట్టిగా పిండేయాలి.

ద్రవరూప బ్లష్: బ్లష్‌తో అందం రెట్టింపవుతుంది. అయితే అందుకోసం సరైన రంగులను ఎంచుకోవాలి. ముదురు రంగు బ్లష్‌లు, మరీ మెత్తని పౌడర్ రూపంలో ఉండే బ్లష్‌లు ఎబ్బెట్టుగా కనిపిస్తూ, చర్మపు గీతల్లో ఇరుక్కుపోతాయి. కాబట్టి పౌడర్ బ్లష్‌లకు బదులుగా ద్రవరూప బ్లష్‌లు ఎంచుకోవాలి. వీటిని కూడా తడిపి పిండిన స్పాంజితోనే అద్దుకోవాలి.



తులసి ప్రయోజనాలెన్నో!

తులసి మొక్కను మనం పవిత్రంగా భావిస్తాం. దానిని అనునిత్యం పూజిస్తాం. అలాంటి తులసిలో విటమిన్-ఎ, యాంటీ ఆక్సిడెంట్లు తాంటివి పుష్కలంగా ఉంటాయి. అందుకే తులసి ఆకులను తినడం, తులసి కషాయం, తులసి టీ తాగడం... ఇలా ఏదో ఒక రూపంలో తులసిని తీసుకోవడం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అవేమిటో తెలుసుకుందాం.



- ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున తులసి ఆకులను తినడం వల్ల చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి.
- తులసి కషాయం తాగడం వల్ల ఒత్తిడి తగ్గడంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.
- తులసి ఆకులు తినడం వల్ల గుండె ఆరోగ్యంతో పాటు జీర్ణక్రియ మెరుగుపడుతుంది.

సెలబ్ ఫిట్

నవయవ్వన సోయగం

తారాజువ్వలా వెండితెర మీదకు దూసుకువచ్చింది. సల్మాన్ లాంటి స్టార్ల సరసన అందంగా ఒదిగిపోయింది. నవయవ్వన కాంతితో యువతరం హృదయ స్పందనై వెలిగింది. పరిశ్రమలోకి వచ్చి పదిహేనేళ్లు దాటినా... నేటికీ అదే మైమరిపించే రూపు... చూపు తిప్పుకోనివ్వని నాజూకు... జాక్వెలిన్ ఫెర్నాండెజ్.



స్వదేశం శ్రీలంక. పుట్టింది బహ్రైన్‌లో. డిగ్రీ... ఆస్ట్రేలియాలోని సిడ్నీ విశ్వవిద్యాలయంలో. ఆమె తండ్రి ఎల్రాయ్ ఫెర్నాండెజ్‌ది శ్రీలంక. తల్లి కిమ్‌ది మలేషియా, కెనడా మూలాలున్న కుటుంబం. శ్రీలంకలో సింహళీస్, తమిళుల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణంతో జాక్వెలిన్ తండ్రి దేశం వదిలి బహ్రైన్‌కు వెళ్లి స్థిరపడ్డారు. అక్కడ ఎయిర్‌హోస్టెస్‌గా పని చేస్తున్న కిమ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పెరిగిన జాక్వెలిన్‌కు అక్క, ఇద్దరు అన్నలు. సిడ్నీ వర్సిటీ నుంచి మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పట్టా పొందిన ఆమె... కొంత కాలం టీవీ రిపోర్టర్‌గా పని చేసింది. గ్లామర్ ప్రపంచంలోకి రావాలన్న ఆసక్తితో మోడలింగ్ మొదలుపెట్టింది. 2006లో 'మిస్ యూనివర్స్ శ్రీలంక' కిరీటాన్ని దక్కించుకుని, తన దేశం నుంచి 'మిస్ యూనివర్స్'కు పోటీపడింది.

అలా వచ్చి...

మూడేళ్ల తరువాత ఓ మోడలింగ్ ప్రాజెక్ట్ కోసం భారత్‌కు వచ్చిన జాక్వెలిన్... అదే సమయంలో నిర్వహించిన 'అలాదిన్' చిత్రం ఆడిషన్స్‌కు వెళ్లింది. దర్శకుడు సుజోయ్ ఘోష్‌ను ఆమె రూపం ఆకట్టుకుంది. ఇక అప్పటి నుంచి జాక్వెలిన్‌కు భారత్ మరో ఇల్లు అయింది. అలా 2009లో నటిగా తొలి అడుగు వేసిన జాక్వెలిన్... మహేష్‌భట్ 'మర్డర్2'తో మొదటి హిట్ అందుకుంది. సల్మాన్‌ఖాన్ సరసన తెలుగు చిత్రం 'కిక్' రీమేక్‌లో నటించింది. ఆమె కెరీర్‌లోనే భారీ కలెక్షన్లు రాబట్టిన సినిమా అది. తెలుగు, కన్నడల్లో పలు ప్రత్యేక గీతాల్లో మెరిసిన జాక్వెలిన్... ఈ పదిహేనేళ్లలో 35కు పైగా చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం ఆమె చేతులో రెండు ప్రాజెక్టులు ఉన్నాయి. నటి కావాలన్నది చిన్ననాటి కోరిక. హాలీవుడ్ తారగా వెలిగిపోవాలని కలలు కనేదట. జయాపజయాలతో సంబంధం లేకుండా దూసుకుపోతున్న ఆమె జీవితాన్ని 2021లో మనీ లాండరింగ్ కేసు కుదిపేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సుఖేష్ చంద్రశేఖర్ నుంచి ఖరీదైన బహుమతులు అందుకుందన్నది జాక్వెలిన్‌పై ఆరోపణ. ఇది ఆమె కెరీర్‌నే కాదు, జీవితాన్ని కూడా ఎంతో ప్రభావితం చేసింది. కానీ ఆత్మస్థైర్యం కోల్పోకుండా తిరిగి నిలబడేందుకు ప్రయత్నిస్తోంది. ఇలాంటి ఒత్తిడుల నుంచి తనను రక్షిస్తున్నది, ఆరోగ్యంగా ఉంచుతున్నది ఫిట్‌నెస్ అంటుంది జాక్వెలిన్.

ఆదివారమూ విరామం లేదు...

ఇతర తారలకు భిన్నంగా... జాక్వెలిన్ రోజూ కంటే ఆదివారం వ్యాయామాల కోసం మరింత ఎక్కువ సమయం కేటాయిస్తుందిట. "యోగా, వెయిట్ ట్రైనింగ్, డ్యాన్స్‌లు కలగలిపి ఆదివారం నా వర్కవుట్ రెండు నుంచి మూడు గంటలపాటు తీవ్రంగా సాగుతుంది. కొంతమంది అంటుంటారు... 'నాక్కూడా నీలాంటి దృఢమైన ఆకృతి కావాల'ని. ఇది ఒక్క రోజులో వచ్చింది కాదు. కొన్నేళ్లుగా ఇదే రూపాన్ని కాపాడుకొంటూ వస్తున్నా. క్రమం తప్పని ఆహార నియమాలు పాటిస్తున్నా. నా రూపు అథ్లెట్లను తలపించాలని కోరుకొంటాను. ఎప్పుడూ దృఢంగా, ఉల్లాసంగా, చురుగ్గా ఉండటానికి ప్రయత్నిస్తాను. అవసరమైనప్పుడు కావల్సినంత విశ్రాంతి తీసుకొంటాను" అంటున్న ఈ ముద్దుగుమ్మ తరచూ తన ఫిట్‌నెస్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి, అభిమానులకు ప్రేరణ కలిగిస్తుంటుంది. ఇన్‌స్టాలో ఏడు కోట్ల మందికి పైగా ఫాలో అవుతున్నారంటే ఆమె క్రేజ్ ఏస్థాయిలో ఉందో వేరే చెప్పనక్కర్లేదు.


- జాక్వెలిన్ వ్యాయామాల్లో ప్రధానంగా యోగ ఉంటుంది.
- ఉదయం లేవగానే జాగింగ్, రన్నింగ్‌తో కూడిన కార్డియో తరువాత యోగా, పిలేట్స్, స్ట్రెంత్ ట్రైనింగ్
- రోజూ ఒకటే రకం వర్కవుట్స్‌తో ఆసక్తి తగ్గుతుంది. అందుకని తనను తాను ఉత్సాహపరుచుకోవడానికి ఎప్పటికప్పుడు కొత్త కొత్త లక్ష్యాలు నిర్దేశించుకొంటుంది.
- వ్యాయామాలను ఉత్సాహభరితంగా మార్చేందుకు పోల్‌డ్యాన్స్, ఏరియల్ సిల్క్ ఎక్సర్‌సైజ్‌లు చేస్తుంది. పోల్ డ్యాన్స్ తనలో ఆత్మవిశ్వాసాన్ని ఎలా నింపిందో, శరీరాన్ని మరింత దృఢంగా ఎలా మార్చిందో వివరిస్తూ ఆ మధ్య ఇన్‌స్టాలో ఒకపోస్టు పెట్టింది జాక్వెలిన్.

- తెల్లవారుజామును ఐదు గంటలకే జాక్వెలిన్ దినచర్య మొదలవుతుంది.
- ఉదయం లేవగానే తేనె, నిమ్మ రసం కలిపిన గ్లాసుడు గోరువెచ్చని నీరు
- బ్రేక్‌ఫాస్ట్‌లో ఉడకబెట్టిన గుడ్లు, తాజా పండ్లు, గ్రీన్ టీ.
- మధ్యాహ్న భోజనంలో పప్పుతో బ్రౌన్ రైస్, వెజిటబుల్, ఫ్రూట్ సలాడ్‌లు. వీటితోపాటు పిండి, పీచు పదార్థాలు, పోషక విలువలు పుష్కలంగా ఉండే క్వినోవా ఆమె మెనూలో తప్పనిసరి.
- అలాగే సలాడ్‌లు, వంటల్లో రెడ్, యల్లో క్యాప్సికమ్, చిలకడదుంపలు చేరతాయి.
- ఇంటర్మిటెన్ ఫాస్టింగ్‌కు ప్రాధాన్యం ఇస్తుంది. తీపి పదార్థాలకు దూరంగా ఉంటుంది.
- రాత్రిపూట తేలికపాటి భోజనం. సాధ్యమైనంతవరకు రాత్రి ఏడు గంటలకల్లా డిన్నర్ ముగిస్తుంది.



కాకర చేదు తగ్గాలంటే!

కాకరకాయలో ఎన్నో పోషకగుణాలు ఉన్నాయి. కానీ చేదుగా ఉంటుందని చాలామంది దానితో చేసే వంటలను ఇష్టపడరు. అయితే చిన్న చిన్న చిట్కాలు పాటించి కాకరకాయ చేదును తగ్గించవచ్చు. అవేంటో తెలుసుకుందాం!



- కాకరకాయపైన ఉండే గరుకు భాగాన్ని తొలగించేయాలి. దీని వల్ల సగం చేదు తగ్గుతుంది.
- కాకరకాయ ముక్కలకు ఉప్పు రాసి 20-30 నిమిషాల ఉంచి తరువాత ఆ ముక్కలను నీళ్లతో మూడు నాలుగు సార్లు శుభ్రంగా కడగాలి. దీని వల్ల చేదు కూడా తగ్గుతుంది.
- వేడి నీటిలో ఉప్పు వేసి అందులో కాకరముక్కలను నానబెట్టినా చేదును తగ్గించవచ్చు.
- కాకరకాయలో విత్తనాలు తీసివేయడం వల్ల కూడా చేదు తగ్గుతుంది.
- కాకర ముక్కలకు పెరుగు రాసి గంటసేపు పక్కన పెడితే చేదు చాలావరకూ తగ్గిపోతుంది.

మేమంతా మీ వెంటే...

త్రివిధ దళాలకు క్రీడాలోకం సెల్యూట్

న్యూఢిల్లీ: దేశం కోసం పోరాడుతున్న త్రివిధ దళాలకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. పోరాట యోధులకు యావత్ క్రీడాలోకం సెల్యూట్ కొడుతోంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, నీరజ్ చోప్రా, పీవీ సింధు తదితరులు సైనికులను ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

- దేశ రక్షణ కోసం సైన్యం తీసుకొనే ఏనిర్ణయాన్నైనా స్వాగతిస్తా. దేశ గౌరవాన్ని నిలబెట్టడడం కోసం మన యోధులు ముందుండి పోరాడుతున్నారు. ఈ సమయంలో ప్రతి భారతీయుడు బాధ్యతాయుతంగా మెలగాలి. తప్పుడు వార్తలను వ్యాప్తి చేయొద్దు. జైహింద్. **- రోహిత్ శర్మ**
- క్లిష్ట సమయాల్లో దేశాన్ని కాపాడుతున్న భద్రతా దళాలకు నా సెల్యూట్. వారి త్యాగాలకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. **- విరాట్ కోహ్లీ**
- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం కోసం పోరాడుతున్న ఆర్మీని చూసి గర్విస్తున్నాం. మనవంతుగా వారి సూచనలు పాటిస్తూ.. అందరం సురక్షితంగా ఉందాం. **- నీరజ్ చోప్రా**
- మీ ధైర్యం, క్రమశిక్షణ, త్యాగనిరతే మన దేశ ఆత్మ. మీ నిస్వార్థసేవను ఎప్పుడూ గుర్తు చేసుకొంటాం. దేశం మొత్తం మీవెనుకే. జైహింద్. **- పీవీ సింధు**
- యుద్ధాన్ని పాక్ కోరుకొంది. ఉగ్ర వనరులను కాపాడుకోవడానికి పాక్ ఉద్రిక్తతలు పెంచింది. వారి వాచాలత్వానికి మన బలగాలు ఎప్పటికీ మరచిపోలేని విధంగా గుణపాఠం చెప్పాయి. **- వీరేంద్ర సెహ్వాగ్**

టైటిల్ చేరువలో ఉన్నతి

తైపీ ఓపెన్ సెమీస్‌కు ఆయుష్


ఉన్నతి

తైపీ: భారత యువ షట్లర్లు ఆయుష్ శెట్టి, ఉన్నతి హుడా తైపీ ఓపెన్ సూపర్ 300 టోర్నమెంట్‌లో సింగిల్స్‌లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల క్వార్టర్‌ఫైనల్లో 20 ఏళ్ల ఆయుష్ 16-21, 21-19తో ఏడోసీడ్ బ్రయాన్ యాంగ్ (కెనడా)పై, మహిళల క్వార్టర్స్‌లో 17 ఏళ్ల ఉన్నతి 21-8, 19-21, 21-19తో స్థానిక షట్లర్ హంగ్ యి తింగ్‌పై గెలిచారు. ఫైనల్లో బెర్త్ కోసం టాప్‌సీడ్ టొమొక మియాజాకి (జపాన్)తో ఉన్నతి, టాప్‌సీడ్ చో తిన్ చెన్ (తైపీ)తో ఆయుష్ తలపడతారు

వినోదానికి విరామం

వారం పాటు ఐపీఎల్ వాయిదా

దేశ భద్రతే ముఖ్యమన్న బీసీసీఐ



న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. తాజా ఐపీఎల్ 18వ సీజన్‌ను వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. ఇరు దేశ సరిహద్దుల దగ్గర భీకర దాడులు సాగుతుండడంతో ఆటగాళ్ళ భద్రత ముఖ్యమని బోర్డు భావిస్తోంది. గురువారం ధర్మశాల వేదికలో పంజాబ్-ఢిల్లీ జట్ల మధ్య మ్యాచ్‌ను అర్ధంతరంగా నిలిపివేసిన విషయం తెలిసిందే. పొరుగు నగరాలపై పాక్ డ్రోన్ దాడులకు తెగబడడంతో ముందు జాగ్రత్తగా బ్లాక్‌అవుట్ ప్రకటించగా, స్టేడియంలోని ఫ్లడ్‌లైట్లు ఆగిపోయాయి. ఆ తర్వాత ఆటగాళ్లతో పాటు ప్రేక్షకులు కూడా మైదానం వీడాల్సి వచ్చింది. అదేరోజు బీసీసీఐ ఉన్నతాధికారులు సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. తిరిగి శుక్రవారం ఉదయం చైర్మన్ అరుణ్ ధూమల్ నేతృత్వంలో జరిగిన ఐపీఎల్ పాలకమండలి అత్యవసర భేటీలో లీగ్ వాయిదా నిర్ణయాన్ని తీసుకోవడం జరిగింది. 'ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని ఫ్రాంచైజీలు ఆటగాళ్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశాయి. అందుకే ఈ విషయమై ఐపీఎల్ పాలకమండలిలో సుదీర్ఘంగా చర్చించాం. అలాగే ప్రసారకర్తలు, స్పాన్సరర్లు, అభిమానుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. వెంటనే వారం రోజుల పాటు ఐపీఎల్‌ను వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఇది కష్టసమయం. అందుకే దేశ ప్రయోజనాలకు బీసీసీఐ పూర్తి మద్దతు ప్రకటిస్తోంది. సాయుధ బలగాల ధైర్యం, నిస్వార్థ సేవకు మా సెల్యూట్' అని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నాడు. కొత్త షెడ్యూల్, వేదికలను సంబంధిత అధికారులు, ఫ్రాంచైజీలతో సంప్రదించాక, అప్పటి పరిస్థితులను అంచనా వేశాక ప్రకటిస్తామని చెప్పాడు. వాస్తవానికి ఈనెల 25న కోల్‌కతాలో జరిగే ఫైనల్‌తో ఐపీఎల్ ముగియాల్సి ఉండేది.

వారం తర్వాత జరిగేనా?

వాస్తవానికి ఐపీఎల్‌ను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు కథనాలు వచ్చాయి. కానీ కాసేపటికే వారంరోజుల వరకే అంటూ బోర్డు అధికారికంగా ప్రకటించింది. అయితే ఆ తర్వాతైనా మ్యాచ్‌లు జరుగుతాయా? అంటే సందేహమే. ఎందుకంటే విదేశీ ఆటగాళ్లు తిరిగి భారత్‌లో అడుగుపెట్టేందుకు వెనుకడుగు వేయవచ్చు. ఈ ఐపీఎల్‌లో ఇప్పటిదాకా లీగ్ దశలో 58 మ్యాచ్‌లు జరిగాయి. ఇంకా 16 మ్యాచ్ (12 లీగ్+4 నాకౌట్)లు మిగిలున్నాయి. వీటిని ఎలా షెడ్యూల్ చేస్తారనే సందేహం కూడా వ్యక్తమవుతోంది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పూర్తిగా సద్దుమణిగేదాకా మ్యాచ్‌లు జరగకపోవచ్చు. షెడ్యూల్ ప్రకారం మే 25న లీగ్ ఫైనల్ ముగిసిన వెంటనే టీమిండియా.. జూన్‌లో జరిగే 5 టెస్టుల కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లాలి. ఆ సిరీస్‌ను మార్చే వీలుండదు కాబట్టి ఆ తర్వాతే.. అంటే ఆగస్టులోనే మిగిలిన లీగ్ మ్యాచ్‌లను నిర్వహించవచ్చు. కానీ ఆ నెలలో ది హండ్రెడ్, కరీబియన్ ప్రీమియర్ లీగ్, ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా సిరీస్‌లున్నాయి. దీంతో విదేశీ ఆటగాళ్లకు ఇబ్బంది. ఇక సెప్టెంబరులో భారత్‌లో ఆసియా కప్ జరగాల్సి ఉన్నా.. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ టోర్నీ జరగకపోవచ్చు. కాబట్టి సెప్టెంబరులో ఐపీఎల్ మిగతా మ్యాచ్‌లను నిర్వహించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అప్పుడు కేవలం ఇంగ్లండ్-దక్షిణాఫ్రికా మధ్య పరిమిత ఓవర్ల సిరీస్ ఉంటుంది. ఐపీఎల్ కోసం ఆటగాళ్ల విడుదలపై బీసీసీఐ చర్చలు జరపవచ్చు.

ప్రత్యేక 'వందే భారత్' రైలులో ఢిల్లీకి..



ధర్మశాల విమానాశ్రయం మూసివేతతో అక్కడి నుంచి పంజాబ్, ఢిల్లీ జట్ల ఆటగాళ్ల తరలింపు మొదట సమస్యగా మారింది. చివరకు ప్రత్యేక రైలులో వీరందరినీ న్యూఢిల్లీకి పంపాలని నిర్ణయించారు. దీంతో శుక్రవారం ఉదయం ధర్మశాల నుంచి 40-50 వరకు చిన్నపాటి వాహనాల్లో ఆటగాళ్లు, కోచింగ్ స్టాఫ్, బ్రాడ్‌కాస్ట్ సిబ్బందిని కట్టుదిట్టమైన భద్రత మధ్య హోషియార్పూర్‌కు తరలించారు. అక్కడినుంచి జలంధర్ చేరాక.. ప్రత్యేక 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' రైలులో ప్రయాణించి అందరూ ఢిల్లీ చేరుకున్నారు.

భారత్‌ను వీడనున్న విదేశీ క్రికెటర్లు

భారత్-పాక్ మధ్య యుద్ధం సాగుతుండడంతో ఐపీఎల్, పీఎస్ఎల్‌లోని తమ ఆటగాళ్ల భద్రతపై దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా ఆటగాళ్ల సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈమేరకు ఇరు దేశాల క్రికెట్ బోర్డులకు లేఖలు రాశాయి. ఇక ఐపీఎల్ వాయిదా పడడంతో ఫారిన్ ప్లేయర్లు తమ స్వదేశాలకు వెళ్లనున్నారు. ఇందుకు బీసీసీఐ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుత పరిణామాలతో వారు కాస్త ఆందోళనగా ఉన్నట్టు ఓ ఫ్రాంచైజీ అధికారి తెలిపాడు. మరోవైపు స్వదేశీ ఆటగాళ్లు కూడా తమ స్వస్థలాలకు వెళ్లారు.

సెమీస్‌లో దీపిక, సుశాంత్

ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-2

షాంఘై: ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-2 పోటీల్లో భారత సీనియర్ దీపికా కుమారి, పార్థ్ సుశాంత్ సాలుంఖె రికర్వ్ ఈవెంట్ వ్యక్తిగత విభాగాల్లో సెమీఫైనల్స్‌కు చేరారు. మహిళల క్వార్టర్స్‌లో దీపిక 6-4తో విక్టోరియా సెబాస్టియన్ (ఫ్రాన్స్)పై, పురుషుల్లో పార్థ్ సుశాంత్ 6-2తో కిమ్ డే జోంగ్ (కొరియా)పై నెగ్గారు. ఇక, కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ సెమీస్‌లో భారత ద్వయం మధుర/అభిషేక్ వర్మ 156-158తో బ్రిటన్ జోడీ చేతిలో ఓడింది. దీంతో భారత జంట కాంస్య పతక కోసం మలేసియా జోడీతో తలపడనుంది.

టికెట్ డబ్బులు వాపస్

ఐపీఎల్ అర్ధంతరంగా వాయిదా పడిన నేపథ్యంలో.. ఇప్పటికే కొన్ని మ్యాచ్‌లకు టిక్కెట్లు కొనుగోలు చేసిన అభిమానులకు ఫ్రాంచైజీలు డబ్బులను తిరిగి చెల్లిస్తున్నాయి. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారం బెంగళూరులో లఖ్‌నవూ, బెంగళూరు.. శనివారం హైదరాబాద్‌లో సన్‌రైజర్స్, కోల్‌కతా జట్ల మధ్య మ్యాచ్‌లు జరగాల్సింది. కానీ, ఐపీఎల్ వాయిదాతో ఇప్పటికే టిక్కెట్లు బుక్ చేసుకున్న వాళ్లకు రీఫండ్ చేయనున్నట్టు సన్‌రైజర్స్ యాజమాన్యం ప్రకటించింది.

పాక్‌కు యూఏఈ షాక్!

మ్యాచ్‌ల ఆతిథ్యానికి నో?
పీఎస్ఎల్‌ను వాయిదా వేసిన పీసీబీ

దుబాయ్: భారత్‌తో యుద్ధం ప్రభావం పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)పైనా పడింది. స్వదేశీ, విదేశీ క్రికెటర్లు పోటీపడుతున్న ఈ లీగ్‌ను ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్టు పాక్ క్రికెట్ బోర్డు శుక్రవారం రాత్రి ప్రకటించింది. దేశ ప్రధాని షాబాజ్ షరీఫ్ ఆదేశాల మేరకు పీఎస్ఎల్‌ను వాయిదా వేయాలని నిర్ణయించుకున్నామని పీసీబీ తెలిపింది. అయితే, అంతకుముందు ఉదయం.. లీగ్‌లో మిగిలిన మ్యాచ్‌లను యూఏఈలో నిర్వహించనున్నట్టు పీసీబీ వెల్లడించింది. కానీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా విదేశీ క్రికెటర్లు లీగ్‌లో కొనసాగేందుకు విముఖత చూపడం, స్వదేశాలకు తరలించాలని కోరడంతో వాయిదా నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మరోవైపు, పీఎస్ఎల్ మ్యాచ్‌ల ఆతిథ్యానికి యూఏఈ క్రికెట్ బోర్డు (ఈసీబీ) కూడా విముఖత వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. యూఏఈలో ఇండో-పాక్ క్రికెట్ అభిమానులు భారీ సంఖ్యలో ఉంటారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పీఎస్ఎల్‌ను నిర్వహిస్తే ఫ్యాన్స్ మధ్య ఘర్షణలు, శాంతి భద్రతల సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని ఈసీబీ భావిస్తోందట. పైగా బీసీసీఐతో ఈసీబీకి బలమైన సంబంధాలు ఉండడంతో.. పీఎస్ఎల్‌కు నో చెప్పాలని అనుకొంటుందని సమాచారం.

'నీరజ్ చోప్రా క్లాసిక్' ఈవెంట్ వాయిదా



న్యూఢిల్లీ: దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో స్టార్ జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ మాజీ చాంపియన్ నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్ నిరవధికంగా వాయిదా పడింది. స్వయంగా నీరజ్ నిర్వహిస్తున్న ఈ జావెలిన్ త్రో మెగా ఈవెంట్ షెడ్యూల్ ప్రకారం ఈనెల 24న బెంగళూరు జరగాల్సి ఉంది. అయితే, ప్రస్తుత పరిణామాల దృష్ట్యా టోర్నీని కొన్నిరోజుల పాటు వాయిదా వేస్తున్నట్టు నీరజ్ సోషల్ మీడియాలో వెల్లడించాడు. ఈవెంట్‌ను ఎప్పుడు నిర్వహిస్తామన్నది త్వరలోనే వెల్లడిస్తామన్నాడు.

గోవాకు కాదు.. ముంబైకే ఆడతా

జైస్వాల్ యూటర్న్



ముంబై: యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ మనసు మార్చుకున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో ఇక గోవాకు ఆడబోతున్నట్టు గత నెలలో అతడు సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఇంతలోనే ఏమైందో కానీ తిరిగి పాత జట్టు ముంబై తరఫున బరిలోకి దిగాలనుకుంటున్నట్టు శుక్రవారం ప్రకటించాడు. అంతేకాకుండా నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) కోసం రాసిన లేఖను కూడా వెనక్కి తీసుకున్నాడు. 'వచ్చే దేశవాళీ సీజన్‌లో గోవాకు ఆడాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నా. అందుకే ఇక నుంచి నన్ను ముంబై క్రికెటర్‌గానే పరిగణించాలని ఎంసీఏను కోరుతున్నా. ఇప్పటివరకైతే బీసీసీఐకి, గోవా క్రికెట్ సంఘానికి గానీ ఎన్‌ఓసీని సమర్పించలేదు' అని జైస్వాల్ పేర్కొన్నాడు. గత సీజన్‌లో ముంబై కెప్టెన్ రహానెతో విభేదాల నేపథ్యంలో జైస్వాల్ జట్టు మారాలని భావించినట్టు కథనాలు వచ్చాయి.

బాంబులు పడతాయేమోనని..



న్యూఢిల్లీ: ఇండో-పాక్ సరిహద్దు ఉద్రిక్తతలతో ధర్మశాలలో గురువారం పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ను అర్ధంతరంగా మధ్యలోనే నిలిపివేశారు. దీంతో స్టేడియం భద్రతా సిబ్బంది సూచనతో ఆటగాళ్లు, ప్రేక్షకులు సహా అంతా స్టేడియం నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఓ జట్టు చీర్‌గాళ్ తీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'ఇక్కడంతా భయంగా ఉంది. మ్యాచ్ మధ్యలోనే అందరినీ పంపించివేశారు. చాలామంది.. బాంబులు పడతాయేమోనని అరుచుకుంటూ వెళ్లిపోయారు. అయినా, నేను ఏడవడం లేదు. కానీ, షాక్‌లో ఉన్నా. అయితే, భద్రతపరంగా ఐపీఎల్ ప్రతినిధులు సరైన చర్యలే తీసుకున్నారు' అని ఆ వీడియోలో చీర్‌గాళ్ వ్యాఖ్యలు చేసింది.

బిజినెస్

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ. 1,587 కోట్లు

క్యూ4లో 21 శాతం వృద్ధి
ఒక్కో షేరుకు రూ.8 డివిడెండ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 21 శాతం వృద్ధి చెంది రూ.1,587 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.1,307 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం కూడా 20 శాతం వృద్ధితో రూ.7,083 కోట్ల నుంచి రూ.8,506 కోట్లకు చేరుకుంది. మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.32,553.50 కోట్ల ఆదాయంపై రూ.5,655 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

మార్చి త్రైమాసికంలో కంపెనీ వ్యాపారాలు రెండంకెల వృద్ధిని నమోదు చేయటంతో అమ్మకాలు, లాభాలు గరిష్ఠ స్థాయిలో ఉన్నాయని డాక్టర్ రెడ్డీస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) ఎంవీ నరసింహం చెప్పారు. కొత్త ఉత్పత్తుల విడుదల, అమెరికా మార్కెట్లో కీలక ఉత్పత్తుల నుంచి రెవెన్యూలు పెరగటం సహా కొనుగోలు చేసిన నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) వ్యాపారాన్ని ఇంటిగ్రేట్ చేయటం కూడా ఎంతగానో కలిసి వచ్చిందని ఆయన తెలిపారు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.8 తుది డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

అవసరమైతే కంపెనీలను కొంటాం: ఫార్మా దిగుమతులపై అమెరికా సుంకాల నేపథ్యంలో అక్కడి మార్కెట్లో తయారీని చేపట్టేందుకు కంపెనీలను కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు డాక్టర్ రెడ్డీస్ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ తెలిపారు. కంపెనీకి అమెరికా ఎంతో కీలకమైన మార్కెట్ అని, అక్కడి కస్టమర్లతో ఈ విషయంపై కలిసి పని చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టారిఫ్‌ల భారం తగ్గించుకునేందుకు భారత్ నుంచి అమెరికాకు ప్లాంట్లను తరలించే యోచనేదీ లేదని ఎరెజ్ స్పష్టం చేశారు.

అమెరికా ఆదాయంలో 9 శాతం వృద్ధి

మార్చి త్రైమాసికంలో అమెరికా రెవెన్యూ 9 శాతం వృద్ధి చెంది రూ.3,560 కోట్లుగా ఉన్నట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి అమెరికా ఆదాయం 12 శాతం వృద్ధితో రూ.14,520 కోట్లకు చేరుకున్నట్లు కంపెనీ పేర్కొంది. అమెరికా మార్కెట్లోకి కొత్త ఔషధాలను విడుదల చేయటంతో ఆదాయాలు గణనీయంగా పెరిగాయని తెలిపింది. క్యూ4లో 7 ఔషధాలను విడుదల చేయగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 18 ఔషధాలను విడుదల చేసినట్లు నరసింహం తెలిపారు. కాగా క్యూ4లో యూరప్ మార్కెట్ ఆదాయం 145 శాతం పెరగగా, భారత్, వర్ధమాన దేశాల ఆదాయం 16 శాతం చొప్పున పెరిగాయని పేర్కొంది.

ఎస్ఎంబీసీకి యెస్ బ్యాంక్‌లో 20% వాటా

ఎస్‌బీఐ సహా 8 బ్యాంకుల నుంచి రూ.13,483 కోట్లకు కొనుగోలు

దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇదే అతిపెద్ద విదేశీ పెట్టుబడి

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ యెస్ బ్యాంక్‌లో 20 శాతం వాటాను జపాన్‌కు చెందిన సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ) రూ.13,483 కోట్లకు కొనుగోలు చేసింది. దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఇప్పటివరకిదే అతిపెద్ద విదేశీ పెట్టుబడి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ సహా 8 బ్యాంకులు కలిసి యెస్ బ్యాంక్‌లోని తమ వాటాలను ఎస్ఎంబీసీకి విక్రయించాయి. అందులో ఎస్‌బీఐ 13.19 శాతం వాటాను రూ.8,889 కోట్లకు విక్రయించగా.. యాక్సిస్ బ్యాంక్, బంధన్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లు కలిసి మొత్తం 6.81 శాతం వాటాను రూ.4,594 కోట్లకు విక్రయించాయి. ఈ డీల్ పూర్తయిన తర్వాత యెస్ బ్యాంక్‌లో ఎస్ఎంబీసీ అతిపెద్ద వాటాదారుగా అవతరించనుంది. ఆర్‌బీఐ, సీసీఐ వంటి నియంత్రణ మండళ్లతో పాటు చట్టపరమైన అనుమతులకు లోబడి ఈ ఒప్పందం పూర్తి కానుంది. ఇందుకు ఏడాది పట్టవచ్చని ఎస్‌బీఐ పేర్కొంది. ఎస్ఎంబీసీ వాటా కొనుగోలు వార్తల నేపథ్యంలో యెస్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 9.77 శాతం ఎగబాకి రూ.20 వద్ద ముగిసింది.

2020లో యెస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐ పెట్టుబడులు

ఆర్థికంగా దివాలా తీసిన యెస్ బ్యాంక్‌ను తిరిగి నిలబెట్టేందుకు 2020 మార్చిలో ఆర్‌బీఐ పునర్నిర్మాణ ప్రణాళికను ప్రకటించింది. అందులో భాగంగా ఎస్‌బీఐ సహా 8 బ్యాంకులు కలిసి యెస్ బ్యాంక్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా వాటాలు దక్కించుకున్నాయి. ఈ మార్చి 31 నాటికి యెస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐ 23.97 శాతం వాటా కలిగి ఉండగా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.75 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 2.39 శాతం, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.21 శాతం, యాక్సిస్ బ్యాంక్ 1.01 శాతం, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ 0.92 శాతం, ఫెడరల్ బ్యాంక్ 0.76 శాతం, బంధన్ బ్యాంక్ 0.70 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఎస్ఎంబీసీకి 13.19 శాతం వాటా విక్రయ అనంతరం యెస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐ 10.78 శాతం వాటా కలిగి ఉండనుంది.



మళ్లీ వృద్ధి పథంలోకి..

ఎస్‌బీఐ సహా ఇతర బ్యాంకులు పెట్టుబడులతో ఆదుకోవడంతో యెస్ బ్యాంక్ వేగంగా కోలుకుని మళ్లీ వృద్ధి పథంలోకి అడుగు పెట్టింది. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ స్టాండ్‌ఎలోన్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 63 శాతం వృద్ధితో రూ.738 కోట్లకు చేరుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ రూ.2,406 కోట్ల లాభం ప్రకటించింది. 2023-24తో పోలిస్తే లాభం దాదాపు రెట్టింపైంది.

జపాన్‌లో రెండో అతిపెద్ద బ్యాంక్ ఎస్ఎంబీసీ

సుమిటోమో మిత్సుయి ఫైనాన్షియల్ గ్రూప్ (ఎస్ఎంఎఫ్‌జీ) పూర్తి అనుబంధ విభాగమే ఎస్ఎంబీసీ. గత ఏడాది చివరి నాటికి 2 లక్షల కోట్ల డాలర్ల (రూ.170 లక్షల కోట్ల పైమాటే) ఆస్తులు కలిగిన ఎస్ఎంఎఫ్‌జీ.. జపాన్‌లో రెండో అతిపెద్ద బ్యాంకింగ్ గ్రూప్‌గా కొనసాగుతోంది. కాగా, దేశంలోని అగ్రగామి విదేశీ బ్యాంక్‌ల్లో ఎస్ఎంబీసీ ఒకటి. అంతేకాదు, ఎస్ఎంఎఫ్‌జీ పూర్తి అనుబంధ విభాగమైన ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ దేశంలోని అతిపెద్ద ఎన్‌బీఎఫ్‌సీల్లో ఒకటి కూడా.

ఇక వాట్సాప్ బాట్ ద్వారా ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపులు

న్యూఢిల్లీ: భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) "వాట్సాప్ బాట్" ద్వారా ప్రీమియం చెల్లింపునకు మరో ఆన్‌లైన్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఎల్ఐసీ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న యూజర్లు 8976862090 నంబర్‌కు వాట్సాప్ చేయడం ద్వారా తమ పాలసీల్లో చెల్లింపు బకాయిలను గుర్తించి వాట్సాప్ బాట్ ద్వారా యూపీఐ/నెట్‌బ్యాంకింగ్/కార్డులను ఉపయోగించి చెల్లింపులు చేయవచ్చని ఎల్ఐసీ తెలిపింది. ఏయే పాలసీలకు ప్రీమియం చెల్లింపు బకాయి ఉందో గుర్తించడం, చెల్లించడం, రసీదు పొందడం అన్నీ వాట్సాప్ బాట్ ద్వారానే నిర్వహించుకోవచ్చని పేర్కొంది. ఈ సదుపాయం వల్ల కస్టమర్లు ఎక్కడ నుంచైనా ప్రీమియం చెల్లింపులు చేయవచ్చని ఎల్ఐసీ ఎండీ సిద్ధార్థ మొహంతి తెలిపారు.

మెర్సిడెస్ బెంజ్ కార్ల ధర పెంపు

న్యూఢిల్లీ: ఈ ఏడాది రెండు విడతలుగా తమ కార్ల ధర రూ.90000 నుంచి రూ.12.2 లక్షల మధ్యలో పెంచనున్నట్టు మెర్సిడెస్ బెంజ్ తెలిపింది. ఫారెక్స్ ఆటుపోట్ల ప్రభావాన్ని పాక్షికంగా తగ్గించుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలియచేసింది. జూన్, సెప్టెంబరు నెలల్లో ధరల సవరణ ఉంటుందని పేర్కొంది. సీ-క్లాస్ కార్ల ధర కనిష్ఠంగా రూ.90 వేలు, మేబాక్ ఎస్ 680 ధర గరిష్ఠంగా రూ.12.2 లక్షలు పెరుగుతాయని తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




10వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	500
వరంగల్	497	గోదావరి	500
చిత్తూరు	573	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	124
వరంగల్	125	గుంటూరు	127
కరీంనగర్	125	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	112
కర్నూలు	125	నెల్లూరు	117
విశాఖపట్నం	121	అనంతపురం	117
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,350 ▼	90,150 ▼	1,10,000 ▼
విజయవాడ	99,600 ▼	95,500 ▼	98,000 ▼
విశాఖపట్నం	99,680 ▼	90,150 ▼	1,11,000 ▲
రాజమండ్రి	98,350 ▼	90,150 ▲	99,000 ▼
ప్రొద్దుటూరు	97,500 ▼	89,650 ▼	98,300 ▲
ముంబై	96,416 ▼	88,317 ▼	95,726 ▲

అమ్మకాలు కంటిన్యూ..

- సెన్సెక్స్ 880 పాయింట్లు డౌన్
- 2 రోజుల్లో రూ.7 లక్షల కోట్లు ఉఫ్

ముంబై: భారత్-పాకిస్థాన్ మధ్య పోరు తీవ్రతరమవడంతో అప్రమత్తమైన ఈక్విటీ మదుపరులు వరుసగా రెండో రోజూ అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో మన స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం ఒక శాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ 880.34 పాయింట్లు కోల్పోయి 79,454.47 స్థాయికి జారుకుంది. నిఫ్టీ 265.80 పాయింట్లు క్షీణించి 24,008 వద్ద స్థిరపడింది. గడిచిన రెండు సెషన్లలో సెన్సెక్స్ 1,292.31 పాయింట్లు (1.60 శాతం) నష్టపోగా.. ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.09 లక్షల కోట్లు తగ్గి రూ.416.40 లక్షల కోట్లకు (4.86 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 26 నష్టపోయాయి.

రక్షణ రంగ షేర్లు జూమ్: పాక్‌తో పోరు నేపథ్యంలో దేశీయ రక్షణ రంగానికి చెందిన ముఖ్యంగా డ్రోన్ కంపెనీల షేర్లు భారీగా లాభపడ్డాయి. బీఎస్ఈలో పారస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీ స్టాక్ 7.18 శాతం పుంజుకోగా.. భారత్ డైనమిక్స్ 5.34 శాతం, భారత్ ఎలక్ట్రానిక్స్ 2.92 శాతం, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ 1.84 శాతం, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ 1.38 శాతం పెరిగాయి. డ్రోన్ తయారీదారుల్లో ఐడియాఫోర్జ్ టెక్నాలజీ షేరు ఏకంగా 20 శాతం ఎగబాకింది. డ్రోనాచార్య ఏరియల్ ఇన్నోవేషన్ 4.99 శాతం లాభపడింది.

బీఓఐ లాభంలో 82 % వృద్ధి

ముంబై: బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ).. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.2,626 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే లాభం ఏకంగా 82 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం 2 శాతం వృద్ధి చెంది రూ.6,063 కోట్లకు చేరుకోగా ఇతర ఆదాయం 96 శాతం పెరిగి రూ.3,428 కోట్లుగా నమోదైంది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 12-13 శాతం రుణ వృద్ధి, 11-12 శాతం డిపాజిట్లలో వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈఓ రజనీష్ కర్నాటక్ తెలిపారు.

ఐఐటీ తిరుపతితో కియా ఒప్పందం

న్యూఢిల్లీ: కియా ఇండియా, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) తిరుపతితో శుక్రవారం కీలక భాగస్వామ్యం కుదుర్చుకుంది. పరిశోధన ఆధారిత ఆవిష్కరణల ప్రోత్సాహంతో పాటు ఆటోమొబైల్, పారిశ్రామిక ఇంజనీరింగ్ రంగాల్లో భవిష్యత్ అవసరాలకు తగిన ప్రతిభావంతులైన ఇంజనీర్లను తయారు చేయడమే లక్ష్యంగా ఐఐటీ తిరుపతితో కియా ఇండియా చేతులు కలిపింది. ఇందులో భాగంగా ఐఐటీ తిరుపతిలో అకాడమిక్ మౌలిక సదుపాయాలు, ఉమ్మడి పరిశోధనా ప్రాజెక్టుల కోసం వచ్చే ఐదేళ్లలో కియా ఇండియా రూ.35 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, పర్యావరణహిత ఆటోమోటివ్ టెక్నాలజీలలో ఐఐటీ తిరుపతిని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దనున్నట్లు కియా తెలిపింది. భవిష్యత్ మొబిలిటీ, ఇంజనీరింగ్ రంగాల్లో భారత్‌ను ముందంజలో ఉంచడానికి, సాంకేతిక నిపుణులను ప్రోత్సహించడంలో ఈ భాగస్వామ్యం ముఖ్య భూమిక పోషించనుందని కియా ఇండియా ఎండీ, సీఈఓ గ్వాంగూ లీ పేర్కొన్నారు.

తెలుగు జవాను వీరమరణం



పాక్ సైనికులతో వీరోచితంగా పోరాడుతూ అమరుడైన అగ్నివీర్ మురళీనాయక్

- ఆపరేషన్ సిందూర్ కోసం జమ్ము సరిహద్దులకు
- అంతకుముందే తల్లిదండ్రులతో ఫోన్‌లో కబుర్లు
- అమ్మానాన్న జాగ్రత్త అంటూ స్నేహితుడికి ఫోన్
- తర్వాత గంటల వ్యవధిలోనే అమరుడైన మురళి

పుట్టపర్తి/హిందూపురం/అమరావతి/ఓర్వకల్లు/కర్నూలు, మే 9(ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్‌లో తెలుగు జవాన్ మురళీ నాయక్(23) వీరమరణం పొందారు. దేశ రక్షణకు సేవలందిస్తూ పాక్ జవాన్ల తూటాలకు బలయ్యారు. సరిహద్దుల్లో హోరాహోరీగా జరిగిన కాల్పుల్లో ఆయన మృతిచెందినట్లు శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులకు ఆర్మీ క్యాంప్ అధికారులు సమాచారం అందించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లి తండాకు చెందిన మురళీ నాయక్ 2022 నవంబరులో అగ్నివీర్‌లో ఉద్యోగం సాధించి, నాసిక్‌లో శిక్షణ తీసుకున్నారు. అస్సాంలో విధుల్లో ఉంటున్న ఆయన్ను ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్ముకశ్మీర్ సరిహద్దులకు పిలిపించారు. గురువారం అర్ధరాత్రి 12గంటల సమయంలో రాజౌరీ సెక్టార్‌లోని ఎల్‌వోసీ వద్ద పాక్ సైన్యం కాల్పులకు తెగబడింది. వారికి తగిన బుద్ధి చెప్పడానికి భారత్ కూడా ఎదురుకాల్పులు ప్రారంభించింది. యుద్ధ రంగంలో వీరోచితంగా పోరాడుతున్న మురళీ నాయక్‌కు పాక్ సైనికుల తూటాలు తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన చికిత్స కోసం విమానంలో ఢిల్లీకి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే వీరమరణం పొందినట్లు తెలిసింది. ఒక్కగానొక్క కుమారుడు ఇక లేడన్న విషయం తెలియగానే తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. మురళీనాయక్ భౌతిక కాయాన్ని శనివారం కళ్లితండాకు తీసుకురానున్నారు. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వ లాంచనాలతో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.



మురళి తల్లిని ఓదారుస్తున్న మంత్రి సవిత



శిక్షణ పూర్తయ్యాక తల్లిదండ్రులు శ్రీరామనాయక్, జ్యోతిబాయితో మురళీ నాయక్

పేద కుటుంబం నుంచి..

గడ్డం తండా పంచాయతీ పరిధిలోని కళ్లితండాకు చెందిన శ్రీరామ్‌నాయక్, జ్యోతిబాయి దంపతులకు మురళీ నాయక్ ఒక్కరే సంతానం. వీరికి తండాలో ఒకటిన్నర ఎకరం పొలం ఉంది. వ్యవసాయ పనులు ఉన్నప్పుడు తండాలో ఉంటారు. ఆ తర్వాత ఉపాధి కోసం తల్లిదండ్రులు ముంబై వెళ్తుంటారు. అక్కడ శ్రీరామ్‌నాయక్ చిరువ్యాపారం చేసేవారు. తల్లి ఇళ్లలో పనిచేస్తారు. మురళికి మూడేళ్ల వయసు ఉన్నప్పటి నుంచి వీరు ముంబైకి వలస వెళుతున్నారు. దీంతో మురళీనాయక్ సోమందేపల్లి మండలం నాగినాయిని చెరువు తండాలో అమ్మమ్మ శాంతిబాయి, తాతయ్య నానేనాయక్ వద్ద ఉంటూ చదువుకున్నారు. అగ్నివీర్‌లో చేరాక ఏడాది క్రితం స్వగ్రామం కళ్లితండాకు వచ్చి, వారం రోజులు ఉన్నారు. తండాలో జాతర ఉండటంతో మురళి తల్లిదండ్రులు రెండు నెలల క్రితం ముంబై నుంచి స్వస్థలానికి తిరిగి వచ్చారు. కుమారుడికి ఫోన్ చేసి, జాతరకు రావాలని పిలిచారు. కానీ సెలవులు దొరకడం లేదని, రాలేనని చెప్పారు.

దేశం కోసం..



తన ఒక్కగానొక్క కుమారుడు దేశం కోసం వీరమరణం పొందడం ఎంతో గర్వంగా ఉందని మురళీ నాయక్ తండ్రి శ్రీరామ నాయక్ అన్నారు. చిన్నప్పటి నుంచి ఆర్మీలో చేరాలని చెప్పేవాడని, ఆఖరికి దేశం కోసమే ప్రాణాలు అర్పించాడని అన్నారు. 'జైహింద్... జై భారత్' అని ఉద్వేగంగా అన్నారు.

ఒక్కరోజైనా ఆర్మీలో..

అగ్నివీర్ శిక్షణకు వెళ్లే సమయంలో మురళీ నాయక్‌ను తల్లిదండ్రులు వారించారు. ఈ ఉద్యోగం వద్దని, మరొకటి చూసుకోవాలని వారు ఎంత చెప్పినా మురళి ఒప్పుకోలేదు. 'ఒక్కరోజైనా ఆర్మీలో పనిచేయాలని ఉంది' అని తన సంకల్పాన్ని తల్లిదండ్రులకు వివరించి, ఒప్పించాడని అతని స్నేహితులు రాజశేఖర్, బాలు, రాజ్‌కుమార్ గుర్తు చేసుకున్నారు.

రాత్రి గడిస్తే పునర్జన్మే..

మురళీ నాయక్ గురువారం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్యలో తల్లిదండ్రులకు ఫోన్‌చేసి, క్షేమసమాచారాలు అడిగారు. తరువాత 9 గంటల సమయంలో స్నేహితుడు వినోద నాయక్‌కి ఫోన్ చేశారు. సరిహద్దుల్లో భీకర పోరు సాగుతోందని అక్కడి పరిస్థితిని వివరించారు. 'నా గురించి భయం లేదు. కానీ అమ్మానాన్నలపైనే బెంగ. నాకు ఏదైనా జరగరానిది జరిగితే వారిని బాగా చూసుకో' అని కోరారు. ఈ రాత్రి గట్టెక్కితే తనకు పునర్జన్మే అన్నాడని వినోద్ ఆవేదన వ్యక్తం చేశారు. కుమారుడి మరణవార్త విన్న తల్లి జ్యోతిబాయి సొమ్మసిల్లి పడిపోయారు. స్పృహలోకి వచ్చిన తరువాత గుండెలవిసేలా రోదించారు.

మంత్రి సవితను తండాకు పంపిన సీఎం

అనంతపురం జిల్లా పర్యటనకు శుక్రవారం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, పుట్టపర్తి విమానాశ్రయంలో దిగిన వెంటనే మురళీ నాయక్ వీరమరణం గురించి తెలుసుకున్నారు. వెంటనే తండాకు వెళ్లి వీర జవాను కుటుంబానికి ధైర్యం చెప్పాలని మంత్రి సవితను ఆదేశించారు. దీంతో ఆమె కళ్లి తండాకు వెళ్లి మురళి తల్లిదండ్రులను ఓదార్చారు. ఆ కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేశారు. తీవ్ర భావోద్వేగానికిలోనైన మంత్రి.. కంట తడిపెట్టారు. మురళీ నాయక్ విగ్రహాన్ని శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల సర్కిల్‌లో ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత ప్రకటించారు.

ఫోన్‌లో జగన్ పరామర్శ

మురళీ నాయక్ తల్లిదండ్రులను మాజీ సీఎం జగన్ ఓదార్చారు. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ తండాకు వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం జగన్‌కు ఫోన్‌చేసి వారితో మాట్లాడించారు. 'మీ కుటుంబానికి దేశం, వైసీపీ, నేను అండగా ఉంటాం. అధైర్యపడవద్దు. త్వరలో వచ్చి మిమ్మల్ని కలుస్తా..' అని వారితో జగన్ చెప్పారు.

పవన్ కల్యాణ్ నివాళులు

సరిహద్దుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ త్యాగాన్ని భారత జాతి ఎన్నడూ మరచిపోదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళులర్పించారు. యువ జవాన్ దేశ రక్షణకు అంకితమై, సమర భూమిలో అమరులయ్యారని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మురళి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని పవన్ భరోసా ఇచ్చారు.



మీ ఆవేదన తీర్చలేనిది..: సీఎం

'దేశం కోసం మీ బిడ్డ ప్రాణత్యాగం చేశారు. ఆ త్యాగం ఊరికే పోదు. మేమందరం మీ వెంట ఉంటాం. ధైర్యంగా ఉండండి' అని మురళీనాయక్ తల్లిదండ్రులను సీఎం చంద్రబాబు ఫోన్‌లో ఓదార్చారు. 'మీ ఆవేదన తీర్చలేనిది. అధైర్యపడవద్దు. దేశం మీ వెంట ఉంటుంది. మీ కుటుంబాన్ని అన్ని విధాలా అదుకుంటాం' అని వారికి భరోసా ఇచ్చారు. కాగా, అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలో నిర్వహించిన ప్రజావేదికలో మురళీ నాయక్ ఆత్మశాంతి కోసం సీఎం రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతపురం జిల్లా పర్యటన అనంతరం తిరుగు ప్రయాణంలో భాగంగా సాయంత్రం సీఎం చంద్రబాబు కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరజవాను మురళీ నాయక్ చిత్రపటం ఎదుట పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక విమానంలో సీఎం అమరావతికి బయలుదేరి వెళ్లారు.

రాష్ట్రానికి గర్వకారణం: మంత్రి లోకేశ్

'యుద్ధభూమిలో పాక్ సైనికులతో పోరాడుతూ మురళీనాయక్ వీర మరణం పొందారు. ఈ విషయం తీవ్ర ఆవేదనకు గురిచేసింది. మురళీ నాయక్ చూపిన ధైర్యసాహసాలు రాష్ట్రానికే గర్వకారణం. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తాం' అని మంత్రి పేర్కొన్నారు. కాగా, దేశ రక్షణలో మురళి చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమకు యావత్ దేశం గర్విస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు నివాళులు అర్పించారు. యువ జవాన్ పేరు చరిత్రపుటల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కాగా, దేశ రక్షణ కోసం మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా సచివాలయ ఉద్యోగుల ర్యాలీ

పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా శుక్రవారం అమరావతి సచివాలయంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. జయహో ఆపరేషన్ సిందూర్, జై జవాన్, జై భారత్ నినాదాలతో సచివాలయం నుంచి ప్రధాన గేటు వరకూ ర్యాలీ నిర్వహించారు. పాక్ కాల్పుల్లో అమరుడైన రాష్ట్రానికి చెందిన అగ్నివీర్ మురళీనాయక్ అమర్ రహే అంటూ ఉద్యోగులు నినదించారు. - అమరావతి, ఆంధ్రజ్యోతి

సైనికులకు నైతిక మద్దతిద్దాం: పవన్ కల్యాణ్



అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ మీద చేస్తున్న ధర్మయుద్ధానికి ప్రతిఒక్కరి నైతిక మద్దతు అవసరమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన పార్టీ తరపున వచ్చే మంగళవారం ఉదయం తమిళనాడులోని తిరుత్తణి, తిరుచెందూర్, పళని, తిరుపరంకుంద్రమ్, స్వామిమలై, పలముదిర్చోళైల్లో ప్రతి క్షేత్రానికి ఒక జనసేన శాసనసభ్యుడిని, జనసైనికులను పంపించి ప్రత్యేక పూజలు చేయించాలని పార్టీ నాయకులను ఆదేశించారు. కర్ణాటకలోని కుక్కే, ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రాలు, రాష్ట్రంలోని మోపిదేవి, బిక్కవోలులోని సుబ్రహ్మణ్య ఆలయాలు, ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర ఆలయం, పిఠాపురం పురూహూతిక దేవి ఆలయాల్లో పూజలు చేయించాలని సూచించారు. సైన్యానికి సూర్యశక్తి తోడుండేలా వచ్చే ఆదివారం శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేయించనున్నారు. క్రైస్తవ ధర్మాన్ని విశ్వసించేవారు చర్చిల్లో, ఇస్లాం ధర్మాన్ని ఆచరించే వారు మసీదుల్లో ప్రార్థనలు చేపట్టాలని పవన్ కోరారు.

ఏపీ భవన్‌లో కంట్రోల్ రూమ్

న్యూఢిల్లీ, మే 9(ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. పాక్‌తో సరిహద్దు గల రాష్ట్రాలలో నివాసం ఉంటున్న, అక్కడ చిక్కుకున్న ఏపీ ప్రజల సౌకర్యార్థం ఈ ఏర్పాటు చేసింది. 24 గంటలూ పనిచేసే ఈ కంట్రోల్ రూమ్ నుంచి కావాల్సిన సమాచారం, సహాయం కోసం 011-23387089, 9871999430, 9871999053 నంబర్లతో పాటు, అదనపు సమాచారం కోసం డిప్యూటీ కమిషనర్ ఎంవీఎస్ రామారావు (9871990081), లైజన్ ఆఫీసర్ సురేశ్‌బాబు (9818395787)ను సంప్రదించవచ్చని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ సూచించారు.

తెలుగు విద్యార్థుల కోసం ప్రత్యేక రైళ్లు నడపండి

- రైల్వే మంత్రికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వినతి

న్యూఢిల్లీ, మే 9(ఆంధ్రజ్యోతి): భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఉత్తరాది రాష్ట్రాలైన హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, జమ్ముకశ్మీర్‌ల్లో చదువుకుంటున్న తెలుగు విద్యార్థుల కోసం ప్రత్యేక రైళ్లు నడపాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు విజ్ఞప్తి చేశారు. జలంధర్, జమ్ము, కురుక్షేత్రల్లోని నిట్ క్యాంపస్‌లతో పాటు లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన అత్యధిక మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. వారంతా స్వస్థలాలకు తిరిగి వెళ్లేందుకు ఢిల్లీ, చండీగఢ్ నుంచి తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేక రైళ్లు నడపాలని కోరుతూ రైల్వే మంత్రికి శుక్రవారం రాసిన లేఖలో ఎంపీ కోరారు.

మహానాడుపై సందిగ్ధత!

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): పార్టీ అత్యున్నత వేడుక మహానాడు నిర్వహణపై టీడీపీ అధిష్ఠానం తర్జనభర్జన పడుతోంది. గత ఏడాది ఎన్నికల కారణంగా మహానాడును భారీగా నిర్వహించలేదు. ఐదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చినందున ఈ సారి ఘనంగా నిర్వహించుకోవాలని నిశ్చయించారు. మే 27, 28, 29 తేదీల్లో కడపలో దీనిని జరిపేందుకు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. అయితే ప్రస్తుతం దేశంలో యుద్ధ వాతావరణం అలముకున్న నేపథ్యంలో మహానాడును నిర్వహించాలా వద్దా అని పునరాలోచనలో పడింది. పాకిస్థాన్‌తో సంక్షోభ సమయంలో దీని నిర్వహణ సరికాదని పార్టీలో కొందరు నేతలు అభిప్రాయపడుతుండగా.. మరికొందరు వేడుకలను మూడ్రోజులు కాకుండా.. రెండు లేదా ఒక్క రోజుకే కుదించి నిర్వహించాలని సూచిస్తున్నారు. మహానాడుకు ఇంకా 15 రోజులుపైగా సమయం ఉన్నందున ఈలోగా యుద్ధవాతావరణం చల్లబడితే యథావిధిగా నిర్వహించాలని పార్టీ పెద్దలు భావిస్తున్నారు. 14న జరిగే టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశంలో మహానాడు నిర్వహణపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది.

గురుకులాలపై పెరిగిన నమ్మకం

- వైద్య సాయానికి 5 కోట్లతో నిధి: మంత్రి డోలా
- ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు పోటీ పెరిగిందని, వీటిపై ప్రజలకు మరింత నమ్మకం కలుగుతోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం తాడేపల్లి ఏపీ ఎస్సీ గురుకుల విద్యాలయ సంస్థ కార్యాలయంలో ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఏప్రిల్ 13న ఎంట్రన్స్ నిర్వహించినట్టు తెలిపారు. 5వ తరగతిలో 15,020 సీట్లు అందుబాటులో ఉండగా 39,281 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఇంటర్ మొదటి సంవత్సరానికి 13,680 సీట్లు అందుబాటులో ఉంటే 40,792 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇకపై ప్రతినెలా కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన పెంచేలా ఒక క్లాస్ నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుపాయం, విషమ పరిస్థితుల్లో ఆర్థిక సహాయం సమకూర్చడానికి రూ.5 కోట్లతో నిధి ఏర్పాటు చేశామన్నారు.

అన్ని గిరిజన గ్రామాల్లో అభివృద్ధి

- గర్భిణీలకు బర్త్ వెయిటింగ్ హాల్స్: సంధ్యారాణి

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. రాష్ట్రంలోని 9 ఐటీడీఏల పీఓలు, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో విజయవాడ గిరిజన సంక్షేమ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో ఐసీడీఎస్ కార్యక్రమాలను అనుసంధానం చేస్తామన్నారు. అరకు కాఫీని ఈ ఏడాది లక్ష ఎకరాల్లో సాగు చేస్తున్నామని చెప్పారు. గిరిజన గ్రామాల్లో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. గర్భిణీలకు ఉపయోగపడే విధంగా బర్త్ వెయిటింగ్ హాల్స్ ఏర్పాటు చేశామన్నారు.





అనంతపురం జిల్లా ఛాయాపురంలో జరిగిన ప్రజా వేదిక సభలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, హాజరైన ప్రజలు

జూలై 10కి జలాలు

ఇరిగేషన్‌కు సమాంతరంగా మైక్రో ఇరిగేషన్‌కు ఖర్చుపెడితే సామర్థ్యం పెరగడంతోపాటు నీటి వినియోగం తగ్గుతుంది. సంపద సృష్టించేందుకు ఇదొక మంచి పద్ధతి.

ఆ ఐదేళ్లలో సీఎం పర్యటనకు వస్తే.. చెట్లు నరికేసేవాళ్లు.. పరదాలు కట్టుకునేవాళ్లు.. సభలకు మనుషులను తోలేవాళ్లు. వాళ్లు మధ్యలో వెళ్లిపోకుండా నిర్బంధించేవారు. నేనలాంటి పనులు చేయడం లేదు. ప్రజలను ఇబ్బంది పెట్టడం లేదు. - సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

నిర్లక్ష్యంతోనే ఐదేళ్లపాటు దీని పనులు ఆగిపోయాయన్నారు. కూటమి అధికారంలోకి రాగానే శరవేగంగా పనులు పూర్తి చేస్తోందన్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఛాయాపురం సమీపంలో హంద్రీ-నీవా కాలువ విస్తరణ, లైనింగ్ పనులను ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన వెంట మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ అధికారులు పర్యటించారు. ఏ రోజుకా రోజు పనులు ఏ మేరకు సాగుతున్నాయో డ్రోన్ ద్వారా వివరాలు సేకరించి, ఎప్పటికప్పుడు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. త్వరితగతిన పూర్తయ్యేలా శ్రద్ధ పెట్టాలని, జూలై 10 నాటికి నీటి విడుదలకు సమాయత్తం కావాలని స్పష్టంచేశారు. అనంతరం ఛాయాపురంలో ప్రజావేదికలో స్థానికులనుద్దేశించి మాట్లాడారు. హంద్రీ-నీవా, పోలవరం-బనకచర్ల పథకాలు పూర్తయితే రాయలసీమలో కరువు మాటే వినిపించదన్నారు. ఇంకా సీఎం ఏమన్నారంటే..

రతనాల సీమ చేస్తానని ఆరోజే చెప్పా..

1996 మార్చి 11న ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీ-నీవాకు శంకుస్థాపన చేశాను. ఈ ప్రాజెక్టు ఎన్టీఆర్ కల. మిగులు జలాలు వాడుకోవడానికి ఆయన హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, రాయలసీమ దశ-దిశ మార్చారు. నేను సీఎం అయ్యాక సీమ ఎడారిగా మారకుండా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాం. రాయలసీమను రతనాల సీమగా చేస్తానని ఆరోజే చెప్పాను. రా కదలిరా కార్యక్రమంలో భాగంగా ఉరవకొండకు వచ్చాను. ఉమ్మడి జిల్లాలో 14 సీట్లూ ఇవ్వండి.. నా మీద నమ్మకం పెట్టండని కోరాను. 14 సీట్లతోపాటు రెండు ఎంపీ సీట్లను కూడా ఇచ్చారు. హంద్రీ-నీవాను వెడల్పు చేస్తానని చెప్పాను. చెప్పిన గంటలోనే జీవో జారీ చేశాను. ఇప్పటికి 37 శాతం పనులు పూర్తి చేశాం. ప్రాజెక్టు పూర్తయితే సీమలో ఫేజ్-1లో 1.98 లక్షలు, ఫేజ్-2లో 4.04 లక్షల ఎకరాలకు నీరందుతుంది.

ఎన్నికలొస్తే పక్కచూపులు..: ఇప్పుడు మీరంతా బాగుంటారు. ఎన్నికలొస్తే కొందరు పక్క చూపులు చూస్తారు. ఆ పక్క చూపుల వల్ల రాష్ట్రం ఇబ్బందుల్లో పడింది. నాలో తప్పుందా.. మీలో తప్పుందా అని ఆలోచిస్తూ ఉంటాను. హైదరాబాద్‌ను 9 సంవత్సరాల్లో అభివృద్ధి చేశాం. అయినా 2004లో ఎన్నికల్లో ఓడిపోయాం. 2014లో రాష్ట్రం విడిపోయి కష్టాల్లో ఉన్నా హంద్రీ-నీవా సహా అన్నీ ముందుకు తీసుకెళ్లాం. గొల్లపల్లి ప్రాజెక్టు పూర్తి చేసి, నీళ్లు చూపించి, కియా కంపెనీని జిల్లాకు తీసుకొచ్చాం. కరువు జిల్లా నుంచి ప్రపంచానికి కియా కార్లు వెళ్తున్నాయంటే అదీ టీడీపీ సత్తా. అలాంటి చరిత్ర సృష్టిస్తే మీరు 2019లో జిల్లాలో టీడీపీకి రెండే సీట్లు ఇచ్చారు. దాంతో వెనక్కి వెళ్లాం. జగన్ ఐదేళ్లలో హంద్రీ-నీవా కోసం ఒక్క రూపాయి ఖర్చు పెట్టారా..? ఏ రోడ్డుకైనా మట్టి వేశారా..? గుంతలు పూడ్చారా..? కాలువల్లో గంప మట్టి తీశారా? (లేదని జనం నినదించారు) ఇప్పుడు రూ.3,873 కోట్లు మంజూరు చేసి పనులు చేస్తున్నాం. కాలువను 16.05 మీటర్లకు వెడల్పు చేస్తున్నాం. ఇప్పుడు ప్రారంభించిన పనులన్నీ ఈ సీజన్‌లోనే పూర్తి చేస్తాం. 40 టీఎంసీల నీళ్లు తీసుకొస్తాం. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి కుప్పం వరకు హంద్రీ-నీవా కాలువ 773 కిలోమీటర్ల పొడవు ఉంది. ఆసియాలోనే ఎక్కువ పొడవైన కాలువ. ఈ సంవత్సరం వర్షాలు బాగా పడ్డాయి. సీమలోని అన్ని రిజర్వాయర్లు, చెరువుల్లో నీరు నింపాం. అవసరమైతే చిన్న చిన్న లిఫ్టులు పెట్టి ఉమ్మడి జిల్లాలోని అన్ని చెరువులకు నీళ్లు ఇచ్చే బాధ్యత నాది. గోదావరి నుంచి ఏటా 2 వేల టీఎంసీలు సముద్రంలో కలిసిపోతున్నాయి. అందులో 300 టీఎంసీలు తెచ్చుకోగలిగితే రాష్ట్రం మొత్తం సస్యశ్యామలమైపోతుంది. పోలవరం నుంచి బనకచర్లకు నీరు తేవాలంటే రూ.81 వేల కోట్లు కావాలి. సుసాధ్యం చేసే సంకల్పంతో ముందుకెళ్తున్నాం.

దేశంలో ఎక్కడా లేనంతగా..

గత 11 నెలల్లో దేశంలో ఎక్కడా చేయని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. 63 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. దీపం-2 కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే అన్నం పెడుతున్నాం. 16,500 పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేశాం. అన్నదాతకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తాం. కేంద్రం ఇచ్చిన తేదీనే రాష్ట్రం తరపున రూ.14 వేలు 3 విడతల్లో జమ చేస్తాం. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ డబ్బులిస్తాం.

గతంలో ఎక్కడ చూసినా గుంతల రోడ్లే..

గతంలో ఎక్కడ చూసినా రోడ్లన్నీ గుంతలే. ఇప్పుడు బాగుపడ్డాయా.. లేదా? (బాగున్నాయంటూ ప్రజలు చేతులెత్తి సమాధానం చెప్పారు). ఈ రోడ్లు ఇంకా బాగుపడాలి. సంపద సృష్టి జరగాలి. ఆదాయం పెరగాలి. పేదరికం నుంచి అందరినీ పైకి తీసుకురావాలి. నేను సాధారణ కుటుంబంలో పుట్టాను. మా నాన్నా రైతే. గాంధీజీ, అంబేడ్కర్, అబ్దుల్ కలాం, ఎన్టీఆర్, మోదీ.. వీరంతా సామాన్య వ్యక్తులే. అంబేడ్కర్‌కు బరోడా రాజు అండగా నిలబడ్డారు. ఆయనిచ్చిన డబ్బులతో లండన్‌లో చదువుకుని రాజ్యాంగం రచించారు. అబ్దుల్ కలాంకు అయ్యంగార్ అండగా నిలబడ్డారు. నేనూ అదే చేస్తున్నా. పైనున్న 10 శాతం మంది.. కింది స్థాయిలో ఉన్న 20 శాతం మందిని దత్తతకు తీసుకుని, ఆదుకోవాలి. 2029 నాటికి పీ-4తో పేదరికం లేని సమాజాన్ని తయారు చేయడమే లక్ష్యం.

సీఎస్ కంటే నేనే సుప్రీం!

- తీరు మార్చుకోని సీఐసీ బాషా
- ఆర్టీఐ కార్యదర్శికి సహకరించొద్దని పేర్కొంటూ సిబ్బందికి సర్క్యులర్
- ఆఫీసులోకి రానివ్వొద్దని హుకుం

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) ఇచ్చిన ఉత్తర్వులంటే ఏమాత్రం లెక్కలేదు. సమాచార కమిషన్ కార్యదర్శిగా సర్కారు నియమించిన అధికారి పట్ల కనీస మర్యాద కూడా లేదు. 'సీఎస్ కంటే నేనే సుప్రీం' అంటూ చెలరేగుతున్నారు చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్(సీఐసీ) ఆర్.ఎం.బాషా ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారి వి. ఆంజనేయులను ప్రభుత్వం సమాచార కమిషన్ సెక్రటరీగా నియమించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. కానీ, ఆంజనేయులుకు ఆర్టీఐ చీఫ్ కమిషనర్ ఎం. బాషా కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. పైగా సెక్రటరీ గదికి తాళాలు వేయించడంతో ఆంజనేయులు చాలా సేపు ఎదురుచూసి, అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఇదే విషయాన్ని జీఏడీ సెక్రటరీ శేషగిరిబాబుకు తెలియజేయడంతో పాటు సీఎస్ విజయానంద్‌కు రహస్య నివేదికను అందించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్టీఐ చీఫ్ కమిషనర్ ఎం. బాషా తాజాగా ఓ ఉత్తర్వు ఇచ్చారు. 'చీఫ్ కమిషనర్ నిర్ణయాలు, ఆదేశాల మేరకే ఆర్టీఐ కార్యాలయం నడుస్తుంది. దీనిలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడానికి వీల్లేదు.' అన్నట్టుగా సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రభుత్వం నియమించిన సెక్రటరీని విధుల్లో చేరనీయకుండా అడ్డుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. పైగా, ఆంజనేయులు తనకు జాయినింగ్ రిపోర్టు ఇవ్వలేదని, జాయినింగ్ రిపోర్టు ఇవ్వకుండా తన కార్యాలయంలోకి రావడానికి వీలు లేదని స్పష్టం చేశారు. సమాచార కమిషన్ సెక్రటరీని నియమించే క్రమంలో ఖచ్చితంగా ఆర్టీఐ చీఫ్ కమిషనర్ అనుమతి తీసుకోవాలని, ప్రభుత్వం ఆ నిబంధనను పాటించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం నియమించిన సెక్రటరీ అనవసరంగా సమాచార కమిషనర్ పరిపాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని, ఇది చట్ట విరుద్ధమని తెలిపారు. అంతేకాదు, కొత్త సెక్రటరీకి ఎలాంటి సహకారం అందించకూడదంటూ కమిషన్ కార్యాలయ ఉద్యోగులు, సెక్యూరిటీ, సిబ్బందికి సర్క్యులర్ జారీ చేశారు. ఆంజనేయులు తనకు ఎలాంటి జాయినింగ్ రిపోర్టు ఇవ్వలేదని, కానీ.. ఇది చాలా అవసరమని పేర్కొన్నారు. జాయినింగ్ రిపోర్టు ఇవ్వలేదు కాబట్టి పరిపాలనా వ్యవహారాల్లో ఆయనకు జోక్యం చేసుకునే అర్హత లేదన్నారు. అనధికారికంగా ఆంజనేయులు కార్యాలయంలోకి ప్రవేశిస్తున్నారన్న సమాచారం తమకు వచ్చిందని, కాబట్టి ఆయనను కార్యాలయంలోకి రానివ్వకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్టీఐ చీఫ్ కమిషనర్ రాత పూర్వక అనుమతి లేకుండా కార్యాలయంలోకి రానివ్వద్దని హుకుం జారీ చేశారు. ఈ ఉత్తర్వులు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మొత్తంగా సమాచార కమిషన్ కార్యాలయ వ్యవహారం ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. ప్రభుత్వం నియమించిన సెక్రటరీనే.. కార్యాలయంలోకి రావడానికి వీల్లేదని పరిపాలనా ఉత్తర్వులు జారీ చేయడం మరింత దుమారం రేపుతోంది.

జూన్ 13 నుంచి విశాఖ-అబుధాబీ విమాన సర్వీస్

- దేశీయంగా మరో రెండు సర్వీసులు కూడా జూన్‌లోనే..
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు ట్రావెలర్స్ అసోసియేషన్ కృతజ్ఞతలు

విశాఖపట్నం, మే 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 13వ తేదీ నుంచి విశాఖపట్నం-అబుధాబీ మధ్య అంతర్జాతీయ విమాన సర్వీస్ మొదలు కానుందని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం శుక్రవారం తెలిపింది. ఇది వారానికి నాలుగు రోజులు ఉంటుంది. అదేవిధంగా విశాఖపట్నం-భువనేశ్వర్ సర్వీస్ జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. విజయవాడ నుంచి బెంగళూరు సర్వీస్ జూన్ 2వ తేదీ నుంచే అందుబాటులోకి వస్తుందని పేర్కొంది. కొత్త విమాన సర్వీసులు వేసినందుకు మంత్రి కె.రామ్మోహన్‌నాయుడుకు ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కుమార్ రాజా, నరేశ్‌కుమార్, డీఎస్ వర్మ కృతజ్ఞతలు తెలిపారు.

పాక్‌కు ఐఎంఎఫ్ రుణం

- 100 కోట్ల డాలర్ల తక్షణ విడుదలకు ఓకే
- తీవ్రంగా అభ్యంతరం తెలిపిన భారత్



న్యూఢిల్లీ, ఇస్లామాబాద్, మే 9: అంతర్జాతీయ రుణ సంస్థల నుంచి తీసుకున్న అప్పులను చెల్లించకుండా.. ఆ డబ్బుతో సీమాంతర ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్థాన్‌కు కొత్తగా రుణం ఇవ్వొద్దంటూ భారత్ తీవ్రస్థాయిలో అభ్యంతరం చెప్పినా ఫలితం లేకపోయింది. ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ (ఈఎఫ్ఎఫ్) కింద.. దాయాది దేశానికి 100 కోట్ల డాలర్ల నిధులు (మన కరెన్సీలో దాదాపు రూ.8540 కోట్లు. పాకిస్థాన్ కరెన్సీలో దాదాపు రూ.28 వేల కోట్లు) తక్షణం ఇవ్వడానికి 'అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్)' ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని పాకిస్థాన్ ప్రధాని కార్యాలయం ధ్రువీకరించింది. పాకిస్థాన్‌కు ఈఎఫ్ఎఫ్ కింద ఇవ్వదలచిన 700 కోట్ల డాలర్లలో 100 కోట్ల డాలర్ల విడుదల, కొత్త అప్పు కింద మరో 130 కోట్ల డాలర్లు.. మొత్తం కలిపి 230 కోట్ల డాలర్ల రుణం ఇచ్చే ప్రతిపాదనలను పరిశీలించేందుకు ఐఎంఎఫ్ శుక్రవారం బోర్డు మీటింగ్ నిర్వహించింది. అయితే.. పాక్‌కు రుణ ప్రతిపాదనను భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. పాకిస్థాన్‌కు ఆర్థిక సాయం అందిస్తే ఆ డబ్బును ఉగ్రవాదుల కోసమే ఉపయోగిస్తుందని ఆందోళన వెలిబుచ్చింది. సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడుతున్న పాకిస్థాన్‌కు రుణమిస్తే.. అంతర్జాతీయ సమాజానికి తప్పుడు సంకేతం పంపినట్టవుతుందని, రుణసంస్థల ప్రతిష్ఠను సైతం అది దెబ్బతీస్తుందని అభిప్రాయపడింది. పాకిస్థాన్ చాలాకాలంగా ఐఎంఎఫ్ నుంచి అప్పులు తీసుకుంటూనే ఉందని.. గడిచిన 35 సంవత్సరాల్లో 28 సార్లు పాక్ అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి రుణాలు తీసుకుందని.. గడిచిన ఐదేళ్లలో నాలుగు ఐఎంఎఫ్ ప్రోగ్రామ్‌లు పాక్‌లో అమలయ్యాయని గుర్తుచేసింది. కానీ, ఆ రుణాలు ఇచ్చే సమయంలో ఐఎంఎఫ్ పెట్టే షరతులకు కట్టుబడి ఉండడంలో, వాటిని అమలు చేయడంలో మాత్రం పాక్‌కు మంచి రికార్డు లేదని ధ్వజమెత్తింది. అలా పేరుకుపోయిన బకాయిల కారణంగా.. పాక్‌కు ఐఎంఎఫ్ మళ్లీ మళ్లీ రుణాలు ఇవ్వక తప్పని స్థితి నెలకొందని ఆవేదన వెలిబుచ్చింది. గతంలో తీసుకున్న అప్పులను పాక్ సక్రమంగా వినియోగించి ఉంటే ఆదేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండేదని.. ఇప్పుడిలా ఉద్దీపన ప్యాకేజీ కోసం ఐఎంఎఫ్‌ను ఆశ్రయించాల్సిన పనే ఉండేది కాదని స్పష్టం చేసింది. "ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ రుణసంస్థల నుంచి నిధులు వస్తూ ఉంటే.. పాక్ వాటిని సైన్యానికి, ప్రభుత్వ ప్రాయోజిత సీమాంతర ఉగ్రవాదుల కోసం వినియోగిస్తుంది" అని హెచ్చరించింది. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణాల విషయంలో రాజకీయ జోక్యం ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యాపించి ఉందని వ్యాఖ్యానించింది. పాక్‌కు రుణాలు ఇచ్చే విషయంలో ఐఎంఎఫ్ కేవలం విధానపరమైన, సాంకేతిక అంశాలనే పరిగణనలోకి తీసుకుంటోందని ఆక్షేపించిన భారత్.. అంతర్జాతీయ రుణ సంస్థలు అప్పులు ఇవ్వడానికి అనుసరించే విధానాల్లో నైతిక విలువలను సైతం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. ఈ కారణాలతో.. పాక్‌కు రుణంపై ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్‌లో నిర్వహించిన ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది.

పాక్ మద్దతుగా సోషల్ మీడియా పోస్టులు

- పుణె, భీవండీలో ఇద్దరు విద్యార్థులు అరెస్ట్

పుణె, మే 9: పాకిస్థాన్ మద్దతుగా సోషల్‌మీడియాలో పోస్టులు చేసిన ఇద్దరు విద్యార్థులను రెండు వేర్వేరు ఘటనల్లో శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పుణెలోని ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 'పాకిస్థాన్ జిందాబాద్' అంటూ నినాదాలు పోస్ట్ చేసిందన్న ఆరోపణలతో కొంధ్వా పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కాగా థానే జిల్లాలోని భీవండీలో జరిగిన మరో ఘటనలో కూడా 18 ఏళ్ల యువకుడిని ఇవే ఆరోపణలతో అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

డ్రోన్లతో పాక్ కుట్రలు

కశ్మీర్‌లోని లేహ్ నుంచి గుజరాత్‌లోని సర్‌క్రీక్ వరకూ 36 నగరాల్లోని సైనిక శిబిరాలే లక్ష్యం

- 300-400 డ్రోన్లతో దాడికి యత్నం
- డ్రోన్లలో అత్యధికం కూల్చేశాం..
- విలేకరులతో విక్రమ్ మిస్రి, సోఫియా ఖురేషీ, వ్యోమికా సింగ్



సోఫియా ఖురేషీ | వ్యోమికా సింగ్ | విక్రమ్ మిస్రి

న్యూఢిల్లీ, మే 9: "అటు లేహ్ నుంచి ఇటు సర్‌క్రీక్ వరకూ జమ్ము కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో 36 నగరాలు, పట్టణాల్లోని భారత సైనిక శిబిరాలపై దాడికి గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాకిస్థాన్ 300-400 టర్కీ డ్రోన్లతో విఫల యత్నం చేసింది. లద్దాఖ్‌లోని సియాచిన్ బేస్ క్యాప్; గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలోనూ ఈ డ్రోన్లు కనిపించాయి. ఈ రెండు ప్రాంతాల మధ్య దాదాపు 1400 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అంటే.. పాకిస్థాన్ ఏ స్థాయిలో డ్రోన్లతో దాడి చేసిందో అర్థం చేసుకోవచ్చు. వాటిలో 50 డ్రోన్లను మన ఎయిర్ డిఫెన్స్ గన్స్ కూల్చేశాయి. రేడియో ఫ్రీక్వెన్సీలను జామ్ చేయడం ద్వారా మరో 20 డ్రోన్లను పనికిరాకుండా చేశాయి. అయితే, వీటిలో అత్యధిక డ్రోన్లలో ఎటువంటి ఆయుధాలూ లేవు. బహుశా.. భారత రక్షణ వ్యవస్థను పరీక్షించడానికే వీటిని ప్రయోగించి ఉండవచ్చు" అని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి వెల్లడించారు. చాలా డ్రోన్లలో కెమెరాలు బిగించి ఉన్నాయని, వాటితో చిత్రీకరించిన ఫుటేజీని నిఘా సమాచారాన్ని పాకిస్థాన్‌లోని క్షేత్ర స్థాయి స్టేషన్లకు పంపించడానికే వాటిని బిగించి ఉంటారని అభిప్రాయపడ్డారు. తమ గగనతల దాడులకు పౌర విమానాలను అడ్డుగా పెట్టుకుందని, గగనతలాన్ని తెరిచి ఉంచిందని తెలిపారు. అంతర్జాతీయ సరిహద్దు వద్ద అంతర్జాతీయ పౌర విమానాలు తిరుగుతూ ఉంటాయని, వాటిపై నిఘా ఉండదని, ఇటువంటి పరిస్థితుల్లో పాకిస్థాన్ తమ గగనతలాన్ని అడ్డుగా పెట్టుకోవడం మిగిలిన పౌర విమానాలకు ఏమాత్రం సురక్షితం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో విమానాల కదలికలకు సంబంధించిన స్ర్కీన్ షాట్లను ప్రదర్శించారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం రాత్రి కూడా పాకిస్థాన్ పలు డ్రోన్లతో దాడులు చేసిందని, మరీ ముఖ్యంగా ప్రార్థన స్థలాలను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. తప్పంతా భారతీయ సైన్యానిదేనంటూ ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించడానికి దుష్ట పన్నాగాలను పన్నుతోందని మండిపడ్డారు. అమృత్‌సర్‌లోని గురుద్వారాపై దాడి చేసిన పాకిస్థాన్.. ఆ తప్పును మన భద్రతా దళాలపై నెట్టేయడాన్ని గుర్తు చేశారు. తన సొంత నగరాలపై భారత్ దాడి చేసుకుంటుందనే అపరిపక్వ అంచనాల్లో పాకిస్థాన్ ఉందని, అటు వంటివన్నీ పాకిస్థాన్ అలవాట్లని దుయ్యబట్టారు. భారత సైనిక స్థావరాలు, పౌర ఆవాసాలపై పాకిస్థాన్ దాడులు చేయడం రెచ్చగొట్టే చర్యలేనని మండిపడ్డారు. చాలా డ్రోన్లను కూల్చేశామని, నిర్వీర్యం చేశామని, వాటి శిథిలాలపై దర్యాప్తు సాగుతోందని, ప్రాథమిక వివరాల ప్రకారం టర్కీ తయారు చేసిన ఆసిస్ గార్డ్ సోంగార్ డ్రోన్లుగా గుర్తించారని కల్నల్ సోఫియా ఖురేషీ వివరించారు. సైనిక స్థావరాలపై దాడులు చేస్తే భారత్ నుంచి తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని పాకిస్థాన్‌కు తెలుసునని, అందుకే, ప్రతి దాడులు చేయకుండా పౌర విమానాలను అడ్డుగా పెట్టుకుందని ఆరోపించారు. భఠిండాపై సాయుధ యూఏవీ దాడిని కూడా అడ్డుకున్నామని తెలిపారు. పాకిస్థాన్ వందలాది డ్రోన్లను ప్రయోగించిందని, వాటన్నిటినీ మన వాయు రక్షణ వ్యవస్థ అడ్డుకోవడమో, కూల్చడమో చేసినా.. ఈ చర్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని యథేచ్ఛగా ఉల్లంఘించడమేనని తప్పుబట్టారు. అలాగే, చిన్న చిన్న ఆయుధాలతోనూ కాల్పులు జరిపిందని, జమ్ము కశ్మీరులో నియంత్రణ రేఖ వెంబడి గుళ్ల వర్షం కురిపించిందని, ఈ ఘటనల్లో ఓ జవాను సహా 16 మంది చనిపోయారని వెల్లడించారు. ఇందుకు బదులుగా భారత బలగాలు వందలాది పాక్ డ్రోన్లు, క్షిపణులను కూల్చేయడమే కాకుండా ఆ దేశ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాయని తెలిపారు. కూల్చేసిన డ్రోన్లు, క్షిపణుల శిథిలాలను సేకరించామని, వాటిని విశ్లేషించి.. భారత్‌లో ఉగ్రవాద దాడుల వెనక పాకిస్థాన్ ఉందనే ఆధారాలకు వీటిని కూడా జత చేస్తామని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన కొన్ని శిథిలాలు పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో దొరికాయన్నారు. పాకిస్థాన్ భారీ ఎత్తున డ్రోన్లతో దాడి చేసింది మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను పరీక్షించడం కోసమేనని వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ చెప్పారు. భారత సైన్యం కూడా సాయుధ డ్రోన్లతో నాలుగు పాక్ వాయు రక్షణ వ్యవస్థలపై దాడి చేసిందని, వాటిలో ఒకటి ఎయిర్ డిఫెన్స్ రాడార్‌ను ధ్వంసం చేసిందని వివరించారు. అంతర్జాతీయ విమానాల రక్షణ కోసం భారత వాయు సేన నియంత్రణ పాటించిందని తెలిపారు.

గగనతలంపై భారత్ పట్టు

పాకిస్థాన్ డ్రోన్లను కూల్చేయడం ద్వారా గగనతలంపై భారత్ తన పట్టును నిలుపుకొందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గగనతలంలో తనను తాను కాపాడుకోవడమే కాకుండా దానిపై ఆధిపత్యం కూడా సాధించగలదని తాజా ఘటనతో రుజువైందని వివరించాయి.

బలూచిస్థాన్ రెబెల్స్ వశం!

- పాక్ సైన్యంపై వరుసగా తిరుగుబాటుదారుల దాడులు
- కీలక నగరం క్వెట్టా సహా చాలా భాగం మూడు రెబెల్ గ్రూపుల స్వాధీనం!
- మరోవైపు దాడులకు దిగిన టీటీపీ 20 మంది పాకిస్థాన్ సైనికులు హతం

న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్న బలూచిస్థాన్ తిరుగుబాటుదారులు ఆ ప్రాంతాన్ని తమ వశం చేసుకున్నారు. ఓవైపు భారత్‌పై డ్రోన్లు, క్షిపణి దాడులకు పాక్ తెగబడుతున్న సమయంలో... బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) సహా మూడు తిరుగుబాటు గ్రూపులు అక్కడి పాక్ సైనిక స్థావరాలపై దాడులకు దిగాయి. క్వెట్టాలోని ఫైజాబాద్ ప్రాంతంలో పాక్ దళాలు, తిరుగుబాటుదారుల మధ్య తీవ్ర స్థాయిలో కాల్పులు జరిగాయి. సిబ్బిలోని మిలటరీ క్యాంపుపై తిరుగుబాటుదారులు గ్రనేడ్లతో దాడికి దిగారు. పాకిస్థాన్ ఆర్మీని తరిమికొడుతూ, అక్కడి కీలక నగరం క్వెట్టా సహా చాలా ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఆరు ప్రాంతాల్లో పాక్ దళాలపై ఐఈడీలు, గ్రనేడ్లు, ఆటోమేటిక్ ఆయుధాలతో దాడులు చేశామని బీఎల్ఏ అధికార ప్రతినిధి జియాంద్ బలూచ్ ప్రకటించారు. మరోవైపు క్వెట్టాలో, ఇతర ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలు, ఇతర ప్రాంతాల్లో పాకిస్థాన్ జెండాలను తొలగించి.. బలూచిస్థాన్ జెండాలను ఎగురవేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

దెబ్బ మీద దెబ్బ

పాకిస్థాన్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. తెహ్రిక్ ఈ తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) తీవ్రవాదులు చేసిన దాడిలో పాకిస్థాన్‌కు చెందిన 20 మంది సైనికులు హతమయ్యారు. పాకిస్థాన్, దక్షిణ వజిరిస్థాన్‌లోని షకాయి సబ్ డివిజన్‌లో ఉన్న ఓ మిలటరీ ఔట్‌పోస్టుపై గురువారం అర్ధరాత్రి తర్వాత ఈ దాడి జరిగినట్టు రిపబ్లిక్ వరల్డ్ సంస్థ ఓ కథనంలో పేర్కొంది. లేజర్ రైఫిల్స్ ఉపయోగించి టీటీపీ చేసిన తొలి దాడిలో ఆరుగురు పాక్ సైనికులు మరణించారు. మిలటరీ ఔట్‌పోస్టు రక్షణకు బయలుదేరిన రెండు సైనిక వాహనాలపైనా టీటీపీ దాడి చేసింది. మొత్తంగా 20 మంది పాక్ సైనికులు మరణించారని, ఐదుగురు గాయపడ్డారని టీటీపీ ప్రకటించింది.

సీఏ పరీక్షలు వాయిదా!

న్యూఢిల్లీ, మే 9: దేశవ్యాప్తంగా సీఏ పరీక్షలు వాయిదా పడ్డాయి. భారత్-పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా పరీక్షలు వాయిదా వేయాలని నిర్ణయించినట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) అధికారికంగా ప్రకటించింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సీఏ పరీక్షలు మే 2 నుంచి 14 వరకు జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా నిర్దేశించిన తేదీలలో అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. అయితే మే 9 నుంచి 14 వరకు జరగాల్సిన మిగిలిన సీఏ ఇంటర్మీడియట్, ఫైనల్, పోస్ట్ క్వాలిఫికేషన్ పరీక్షలు వాయిదా పడ్డాయని.. పరీక్షల కొత్త షెడ్యూలును త్వరలో వెల్లడిస్తామని ఐసీఏఐ పేర్కొంది. ఈ పరీక్షలకు హాజరుకావాల్సిన అభ్యర్థులు మరిన్ని వివరాలను ఐసీఏఐ అధికారిక వెబ్‌సైట్ icai.orgలో చూసుకోవచ్చని తెలిపింది.


భారత్- నేపాల్ సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం

పిథోరాగఢ్, మే 9: భారత్- పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో భారత్- నేపాల్ సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. నేపాల్‌తో సరిహద్దును పంచుకుంటున్న ఉత్తరాఖండ్‌లోని పిథోరాగఢ్, చంపావత్ జిల్లాల్లో గస్తీని ముమ్మరం చేశారు. సరిహద్దుల్లోని ప్రధాన వంతెనల వద్ద విస్తృత తనిఖీలు చేస్తున్నామని, గస్తీ బృందాల సంఖ్యను కూడా పెంచామని పిథోరాగఢ్ ఎస్పీ రేఖ యాదవ్ తెలిపారు. అన్ని చెక్ పోస్టులను అప్రమత్తం చేశామని, దేశంలోకి అనుమానాస్పద వ్యక్తులు చొరబడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నైనిసైని విమానాశ్రయంలో కూడా అదనపు భద్రతా సిబ్బందిని మోహరించడంతో పాటు విమానాశ్రయంలోకి ప్రవేశించే ప్రతిఒక్కరి కదలికలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నామని రేఖ యాదవ్ పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

సైనికుల ఫొటోలు, వీడియోలు తీయొద్దు



రాజమౌళి

భారత్ - పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కొందరు సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలు, ఫొటోలు షేర్ చేస్తున్నారు. ఈ క్రమంలో దర్శకుడు రాజమౌళి స్పందించారు. పాజిటివ్‌గా, అప్రమత్తంగా ఉంటే విజయం మనదేనని, సాయుధ దళాలని మెచ్చుకోవాల్సిందే అని అన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 'ఒకవేళ భారత సైనిక చర్యలను చూస్తే ఫొటోలు, వీడియోలు తీయొద్దు. వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయొద్దు. అలా చేస్తే శత్రువుకు సాయం చేసినట్టే. అనధికార ప్రకటనలు, అసత్య ప్రచారం నమ్మకండి' అని పేర్కొన్నారు.

వేడుక వాయిదా



కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపుదిద్దుకుంటోన్న పాన్ ఇండియా చిత్రం 'థగ్ లైఫ్'. జూన్ 5న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ఈనెల 16న ఆడియో లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించాలని చిత్రబృందం భావించింది. అయితే, ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో ఏర్పడిన ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో వేడకను వాయిదా వేసినట్టు చిత్రబృందం తెలిపింది. ఈ మేరకు కమల్‌హాసన్ 'ఆర్ట్ కెన్ వెయిట్ - ఇండియా కమ్స్ ఫస్ట్' అంటూ ఓ ప్రకటన విడుదల చేశారు.

భైరవం రాక ఖరారు



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న యాక్షన్ థ్రిలర్ చిత్రం 'భైరవం'. అదితి శంకర్, ఆనంది, దివ్య పిళ్ళై కథానాయికలు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పవర్‌ఫుల్ పోస్టర్లు, యాక్షన్‌తో నిండిన టీజర్, రెండు సూపర్ హిట్ పాటలతో సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా మేకర్స్ ఈ చిత్రాన్ని మే 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. హరి కె వేదాంతం సినిమాటోగ్రఫీ, శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు.

అందర్నీ ఆకట్టుకుంటుంది



మంగపుత్ర కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'వృశ్చికం'. శివరామ్ నిర్మిస్తున్నారు. యశ్విక కథానాయిక. గురువారం ఈ సినిమాను ప్రారంభించారు. ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. నటుడు కోసూరి సుబ్రమణ్యం కెమెరా స్విచ్ఛాన్ చేయగా, సుప్రీంకోర్టు అడ్వకేట్ హబీబ్ సుల్తానా క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా నటుడు, దర్శకుడు మంగపుత్ర మాట్లాడుతూ "మంచి నిర్మాణ విలువలతో, ఉన్నతమైన సాంకేతికతతో తెరకెక్కుతోందీ చిత్రం. అందర్నీ ఆకట్టుకుంటుంది" అని తెలిపారు.

పవర్‌ఫుల్ లుక్



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రవి కిరణ్ కోలా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. త్వరలో చిత్రీకరణ ప్రారంభించనున్నారు. 'ఎస్‌వీసీ 59' వర్కింగ్ టైటిల్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. శుక్రవారం విజయ్ దేవరకొండ పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్ర బృందం కొత్త పోస్టర్‌ను పంచుకుంది. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రమిది.

ధ్యానముద్రలో...

అలాగే రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ కథానాయకుడిగా మరో చిత్రం రూపుదిద్దుకుంటోంది. 'వీడీ 14' వర్కింగ్ టైటిల్. రష్మిక మందన్న కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్, టీ సిరీస్ నిర్మిస్తున్నాయి. బ్రిటిష్ కాలం నాటి నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ధ్యానముద్రలో ఉన్న విజయ్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. త్వరలో చిత్రీకరణ ప్రారంభించనున్నారు.

సైనికులకు సాయంగా నిలుస్తాం

అల్లు అరవింద్



'సైనికులు దేశం కోసం పోరాడుతుంటే మేం సినిమా సెలబ్రేషన్స్ చేసుకోవడం సరికాదు అనిపించింది. అందుకే 'సింగిల్' సినిమా వసూళ్లలో కొంత భాగాన్ని మన కోసం పోరాడుతున్న సైనికులకు అందజేస్తాం. మేం ఊహించిన దానికి మించి ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. శ్రీ విష్ణు కథానాయకుడిగా కార్తీక్ రాజు దర్శకత్వం వహించిన 'సింగిల్' చిత్రం ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శుక్రవారం మీడియాతో ముచ్చటించింది. అల్లు అరవింద్ మాట్లాడుతూ 'ఒక ఆహ్లాదకరమైన సినిమాను ఇవ్వాలని ప్రయత్నించాం. ప్రేక్షకులు సినిమాను అద్భుతంగా ఆస్వాదిస్తున్నారు. 'సింగిల్'తో గీతా ఆర్ట్స్ హ్యాట్రిక్ విజయాన్ని అందుకొంది' అన్నారు. శ్రీ విష్ణు మాట్లాడుతూ 'యుద్ధం వస్తుందని అనుకోలేదు. అందుకే ముందు ప్రకటించిన తేదీకే సింగిల్ సినిమాను విడుదల చేశాం. అన్ని ఏరియాల నుంచి మంచి స్పందన వస్తోంది. బాగా నవ్వుకున్నామని ప్రేక్షకులు చెప్పడం సంతోషాన్నిచ్చింది' అని తెలిపారు. 'సింగిల్‌కు బ్లాక్‌బస్టర్ రెస్పాన్స్ వస్తోంది, ఈ అవకాశం ఇచ్చిన అల్లు అరవింద్ గారికి, మా నిర్మాతలకు ధన్యవాదాలు' అని కార్తీక్‌రాజు అన్నారు.

మీ వెంట మేమున్నాం




పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని ప్రదర్శిస్తూ జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లో దాడులకు తెగబడడం, వీటిని భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టడం తెలిసిందే. ఈ క్రమంలో పలువురు సినీ ప్రముఖులు భారత సైన్యంపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ధైర్యంగా ముందుకు సాగండి.. మీ వెంట మేమున్నాం అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మరోవైపు సాయుధ దళాలకు సాయం చేసేందుకు విజయ్ దేవరకొండ ముందుకొచ్చారు. తన రౌడీ బ్రాండ్ దుస్తులు వారికి అందించనున్నట్లు ప్రకటించారు.

ఉగ్రవాదం నుంచి మనల్ని రక్షించుకునేందుకు చేసే పోరాటం యుద్ధం కాదు. ఈ పోరాటానికి మద్దతిచ్చే వారిని యుద్ధాన్ని కాంక్షించే వారిగా పేర్కొనొద్దు. దేశ భద్రత, న్యాయం కోసం ఆరాటపడే పౌరులు వారు. దూకుడు ధోరణి, అత్యవసర ఆత్మరక్షణకు మధ్య చాలా నైతిక భేదం ఉంటుంది. కుట్రపూరితంగా జరిగిన ఉగ్రవాద చర్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోయినప్పుడు, దానికి ప్రతీకారం తీర్చుకోవడం బాధ్యతే అవుతుంది తప్ప అవకాశం కాదు. శాంతిని కోరుకోవడమంటే జరిగిన హానిని మౌనంగా అంగీకరించడం కాదు

\- రష్మిక మందన్న

భారత సైన్యానికి మరింత శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను. మన రక్షణ దళాలు ధైర్యంగా సాగుతూ, శత్రువుల గుండెల్లో భయాన్ని నింపాలి.

\- సాయి దుర్గాతేజ్




దీన్ని వాళ్లు ప్రారంభించారు. మనం ముగిస్తాం. భారత సాయుధ దళాల కోసం ఎప్పుడూ ప్రార్థిస్తూనే ఉంటాం

\- మంచు విష్ణు

శత్రుదేశం జమ్మూను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజలంతా జాగ్రత్తగా ఉండండి


\- కంగనా రనౌత్



జాతీయ రక్షణ నిధి కోసం ఎన్టీఆర్ తొలి అడుగు

సరిగ్గా అరవై ఏళ్ల క్రితం అంటే 1965లో మనదేశంపై పాకిస్థాన్ తొలిసారిగా దాడి చేసిన తరుణంలో తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి మొదట స్పందించిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జాతీయ రక్షణ నిధి కోసం విరాళాలు సేకరిస్తామని ఆనాటి పత్రికల ద్వారా ప్రకటించి మిగిలిన వారిలో స్ఫూర్తి నింపారు. చిత్ర పరిశ్రమలోని తన సహచర నటీనటులను సంప్రదించి, ఆంధ్రప్రదేశ్ ప్రజారక్షణ కమిటీ సహాయంతో మే 16, 17, 18 తేదీల్లో విజయవాడ, హైదరాబాద్, కర్నూలు పట్టణాల్లో ఎన్టీఆర్ సారథ్యంలో నటీనటులు వినోద ప్రదర్శనలు నిర్వహించి, విరాళాలు సేకరించారు.





జయం మనదే!!


జై హింద్!

మీ ఎన్. టి. రామారావు

ఎన్టీఆర్‌తో పాటు ఎస్వీ రంగారావు, జగ్గయ్య, కాంతారావు, గుమ్మడి, రాజనాల, సత్యనారాయణ, పద్మనాభం, సావిత్రి, జమున, రాజసులోచన, కన్నాంబ, లక్ష్మీ రాజ్యం,, రేలంగి, గిరిజ.. వంటి ప్రముఖ తారలు విరాళాల సేకరణలో ఉత్సాహంతో పాల్గొన్నారు. వినోద ప్రదర్శనలతో అలరించారు. అప్పటివరకూ తెర మీద మాత్రమే కనిపించే తమ అభిమాన తారలు ఇలా తమ ఊరికి వచ్చి విరాళాలు సేకరించడం, వినోద ప్రదర్శనలు ఇవ్వడంతో జనం ఆనందానికి అవధులు లేవు. అందుకే తారలకు విరాళాలు అందివ్వడానికి పోటీ పడేవారు. ఆ రోజుల్లోనే మొత్తం ఎనిమిది లక్షల రూపాయలు వసూలు చేసి నాటి ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రికి అందజేశారు ఎన్టీఆర్.

అదే స్ఫూర్తితో 1969లో తుపాను బాధితుల కోసం వారం రోజుల పాటు భిక్షా యాత్ర నిర్వహించారు ఎన్టీఆర్. ఆ రోజుల్లో ఆర్టిస్టులు, ఇతరులు కలిపి మొత్తం 180 మంది ఎన్టీఆర్ వెనుక నడవడం విశేషం. అలాగే 1977లో దివిసీమ ఉప్పెన వల్ల భారీగా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగినప్పుడు తను సోదరుడిగా భావించే అక్కినేని నాగేశ్వరరావుతో కలసి విరాళాలు సేకరించి, వినోద ప్రదర్శనలు ఇచ్చి రూ 15 లక్షల రూపాయలు వసూలు చేసి, ప్రభుత్వానికి అందజేశారు ఎన్టీఆర్. అలా ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొని తను రాజకీయాల్లోకి ప్రవేశించడానికి చాలా ముందుగానే ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకొన్నారు ఎన్టీఆర్.





సింధు జలాలపై మేమేం చేయలేం!

» కేవలం సహాయకులం మాత్రమే: ప్రపంచ బ్యాంకు చీఫ్

» పాక్‌కు మరోసారి గట్టి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ, మే 9: సింధు జలాల విషయంలో పాకిస్థాన్‌కు మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌ను అష్టదిగ్బంధనం చేసిన భారత ప్రభుత్వం కీలకమైన సింధు జలాల ఒప్పందం అమలును నిలిపివేసిన విషయం తెలిసిందే. దీనిని ప్రపంచ దేశాల దృష్టికి తీసుకువెళ్లి.. భారత్‌ను బూచిగా చూపించే ప్రయత్నం చేసిన దాయాది దేశానికి భారీ షాక్ తగిలింది. ముఖ్యంగా సింధు జలాల విషయంలో ఇరు దేశాలకు మధ్యవర్తిగా ఉన్న ప్రపంచ బ్యాంకు ఈ విషయంలో జోక్యం చేసుకునేది లేదని తెగేసి చెప్పింది. శుక్రవారం ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా స్పందిస్తూ.. సింధు జలాల ఒప్పందంపై తామేమీ చేయలేమని తేల్చి చెప్పారు. తాము కేవలం సహాయకులుగా మాత్రమే ఉంటామన్నారు. ఈ విషయంలో తాము ఎలాంటి పాత్రనూ పోషించలేమని స్పష్టం చేశారు. "సింధు జలాల విషయంలో ప్రపంచ బ్యాంకు జోక్యం చేసుకుని ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తుందనే అంశంపై మీడియాలో అనేక కథనాలు వస్తున్నాయి. కానీ, ఇవన్నీ ఊహాజనితాలు. దీనిలో మా పాత్ర ఏమీ ఉండదు. కేవలం సహాయకులం మాత్రమే." అని అజయ్ పేర్కొన్నారు.

నాలుగు రాష్ట్రాలకు సింధు జలాల మళ్లింపు!

» రాజస్థాన్, హరియాణా, ఢిల్లీ, హిమాచల్ అవసరాలకు వాడుకోవాలని కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, మే 9: నాలుగు రాష్ట్రాల అవసరాలు తీర్చుకునేందుకు సింధు నదీ జలాలను మళ్లించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రాజస్థాన్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ అవసరాలకు సింధు జలాలను వినియోగించుకోవాలని, దీని అమలుకు అవసరమైన మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేసేందుకు కేంద్ర జలశక్తి శాఖ పనిచేస్తోందని ఏఎన్ఐ వర్గాలు తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌తో సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే చుక్క నీటిని కూడా పాకిస్థాన్‌కు పోనివ్వకూడదని కేంద్రం భావిస్తోంది. సింధు జలాల వినియోగంపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. గంట పాటు జరిగిన ఈ సమావేశంలో జలాల మళ్లింపుపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిసింది.

ఉగ్ర పాక్‌కు మద్దతిస్తారా?


» తుర్కియే ద్వంద్వ ప్రమాణాలను ప్రశ్నించిన ఒవైసీ



న్యూఢిల్లీ, మే 9: సొంతగడ్డపై దేశ భద్రతకు ప్రాధాన్యమిస్తున్న తుర్కియే అంతర్జాతీయ ఉగ్రవాదానికి నెలవుగా మారిన పాకిస్థాన్‌కు ఎలా తిరుగులేని మద్దతునిస్తుందని హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. 'మనం తుర్కియేను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. తన సొంతగడ్డపై ఉగ్రవాద సంస్థ కుర్దిష్ గ్రూపుపై బాంబుల వర్షం కురిపిస్తుంది. ఇరాక్‌లోనూ ఉగ్రవాదులపై బాంబులు వేయడానికి వెనుకంజ వేయదు. తాజాగా సిరియాలోని ఉగ్రవాద శిబిరాలపై బాంబులేస్తుంది. విదేశీ గడ్డపై ఉగ్రవాదులను అంతమొందిస్తారు. కానీ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా స్పందిస్తున్న భారత్‌ను ఎలా ప్రశ్నిస్తారని ఆ దేశాన్ని నిలదీయాల్సిన అవసరం ఉంది..?' అని ఒవైసీ స్పష్టం చేశారు. తమ దేశ భద్రతకు ఉగ్రవాదులపై అవసరమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని గత డిసెంబర్‌లో తుర్కియే మంత్రి హకన్ ఫిదాన్ పేర్కొన్నారు.

పహల్గాం బాధితులకు న్యాయం: ఆర్‌ఎస్ఎస్

» కేంద్రం చేపడుతున్న చర్యలపై మోహన్ భాగవత్ హర్షం



న్యూఢిల్లీ, మే 9: ఆపరేషన్ సిందూర్‌పై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్పందించింది. పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం, భారత సైన్యం చేపడుతోన్న చర్యలను ఆర్‌ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ప్రశంసించారు. పహల్గాం బాధితులకు న్యాయం లభించినట్లైందని వ్యాఖ్యానించారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల పీచమణచడం దేశ భద్రతకు అవసరమని చెప్పారు. కర్ణాటక బెళగావిలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కీలక సమయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా కేంద్ర ప్రభుత్వానికి, సైన్యానికి అండగా నిలుస్తున్నారని చెప్పారు. సమాజంలో ఐక్యతను దెబ్బతీసేందుకు యత్నిస్తున్న వారిపై అప్రమత్తంగా ఉండాలని మోహన్ భాగవత్ సూచించారు. సైన్యానికి, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించేందుకు సన్నద్ధంగా ఉండాలని ఆయన దేశ పౌరులకు పిలుపునిచ్చారు.

పాక్ ప్రధాని పిరికిపంద

(మొదటపేజీ తరువాయి)

విమర్శించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ పేరు పలికేందుకే షెహబాజ్ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా టిప్పు సుల్తాన్ కొటేషన్‌ను ఆయన ఉటంకించారు. సింహాల సైన్యాన్ని నక్క నడిపిస్తే అవి యుద్ధంలో పోరాడలేక ఓడిపోతాయన్నారు. సరిహద్దుల్లో ఉన్న పాక్ సైనికులు ధైర్యంగా పోరాడాలనుకున్నా దేశ ప్రధానికే ధైర్యం లేనప్పుడు ఎలా పోరాడగలరని ఆయన ప్రశ్నించారు. పిరికిపందలా ఉన్న ప్రధాని సరిహద్దుల్లో ఉన్న సైనికులకు ఏం ఆదేశాలు ఇవ్వగలరని షెహబాజ్‌ను ఉద్దేశించి షాహిద్ వ్యాఖ్యానించారు.

భారత డ్రోన్లను అందుకే కూల్చలేదు

భారత డ్రోన్లను ఎందుకు కూల్చలేకపోయారంటూ నేషనల్ అసెంబ్లీలో విపక్ష సభ్యులడిగిన ప్రశ్నలకు పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ సమాధానమిచ్చారు. తమ గగనతల రక్షణ వ్యవస్థల లొకేషన్ల వివరాలు తెలియకూడదనే వ్యూహాత్మకంగా భారత డ్రోన్లను కూల్చలేదన్నారు. అంతే తప్ప సామర్థ్యం లేక కాదన్నారు.

ఉద్రిక్తతలు పెరిగితే మదర్సా విద్యార్థులను వాడుకుంటాం

మదర్సాల్లోని విద్యార్థులను మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ద్వితీయ శ్రేణి రక్షణ దళాలుగా పేర్కొన్నారు. భారత్‌తో ఉద్రిక్తతలు పెరిగితే పరిస్థితులను బట్టి మదర్సా విద్యార్థులను వంద శాతం వాడుకుంటామన్నారు. మదర్సా విద్యార్థులను భారత్‌కు వ్యతిరేకంగా వాడుకుంటామంటూ పాక్ మంత్రి ఒకరు నేషనల్ అసెంబ్లీలో బహిరంగంగా అంగీకరించడం ఇదే ప్రథమం. పాక్‌లోని మదర్సాల్లో నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఇస్లామిక్ విద్యను అభ్యసిస్తుంటారు.

టర్కీ షూట్!

(మొదటిపేజీ తరువాయి)

తాము కూల్చివేశామని భారత ఆర్మీ, వైమానిక దళ ప్రతినిధులు శుక్రవారం వెల్లడించారు. ఈ డ్రోన్ దాడులు ఆసరాగా భారత్‌లోకి టెర్రరిస్టులు చొరబడేలా పాక్ ప్రయత్నించిందని తెలిపారు. ఇప్పటివరకూ పాక్ వాడిన డ్రోన్లలో అత్యధికం తుర్కియే నుంచి దిగుమతి చేసుకున్న అసిస్‌గార్డ్ సొంగర్ డ్రోన్లు అని వారు చెప్పారు. ఈ డ్రోన్లతోపాటు అనేక క్షిపణుల్ని, ఎగిరే బాంబుల్ని పాక్ భారత్‌పైకి గురిపెట్టింది. ఈ ఆయుధాల వివరాల్ని పరిశీలిస్తే

అసిస్‌గార్డ్ సొంగర్ డ్రోన్లు



5కిలోమీటర్ల రేంజ్ కలిగిన ఈ డ్రోన్లు అత్యంత ప్రమాదకరమైనవి. వీటిని 2020 నుంచి తుర్కియే సైన్యం వాడుతోంది. ఈ డ్రోన్లు సుమారు 3 కిలోమీటర్ల ఎత్తు వరకూ ఎగురుతాయి. అంతేకాదు దీనికి అమర్చిన తుపాకీ ద్వారా గాలిలో నుంచి బులెట్ల వర్షం కురిపిస్తాయి. ఒక్కో డ్రోన్‌లో 200 బులెట్లు ఫైర్ చేయగల గన్ అమర్చుతారు. ఈ ఫైరింగ్‌ను ఆపరేటర్ కంట్రోల్ చేయవచ్చు. లేదంటే దానంతట అదే ఫైర్ చేసేలా కూడా ఏర్పాటు చేయవచ్చు. అంటే ఒక్కో డ్రోన్ అనేకమందిని చంపగలుగుతుంది. 2024లో దీనిని అప్‌గ్రేడ్ చేసి గ్రెనేడ్‌ను కూడా ఫైర్ చేసే సామర్థ్యం కల్పించారు.

షాపార్ డ్రోన్

300 కిలోమీటర్లకు పైగా రేంజ్ కలిగిన డ్రోన్ ఇది. నిఘాకు, దాడులకు దీనిని ఉపయోగించవచ్చు.

ఎగిరే బాంబులు

చైనా నుంచి, టర్కీ నుంచి దిగుమతి చేసుకున్న ఈ లాయిటరింగ్ మ్యూనిషన్లను ఎయిర్‌బేస్‌లు, రాడార్ల మీదికి ప్రయోగించవచ్చు.

అబ్దాలీ బాలిస్టిక్ క్షిపణి

200 కిలోమీటర్ల రేంజ్ కలిగిన ఈ క్షిపణితో మిలిటరీ రవాణా కేంద్రాలు, ఆయుధాగారాలపై దాడి చేయవచ్చు.

బాబర్ క్రూజ్ క్షిపణి

ధ్వని కంటే తక్కువ వేగంతో భూమికి సమాంతరంగా ప్రయాణిస్తూ రాడార్లకు దొరకకుండా ప్రయాణించే సామర్థ్యం ఉంది. 900 కిలోమీటర్ల రేంజ్ ఉండడంతో సరిహద్దుకు దూరంగా ఉన్న లక్ష్యాలపైకి దీనిని ప్రయోగించవచ్చు.

నాసర్ బాలిస్టిక్ క్షిపణి

సుమారు 70 కిలోమీటర్ల రేంజ్ కలిగిన టాక్టికల్ క్షిపణి. అణు దాడులకు, మామూలు దాడులకు కూడా దీనిని వాడవచ్చు. సరిహద్దు సమీపంలోని స్థావరాలపై వీటితో దాడులు చేస్తున్నట్టు సమాచారం.

బురాక్ అన్‌మ్యాన్డ్ కాంబాట్ వెహికిల్

పాకిస్థాన్ దేశీయంగా తయారుచేసింది. వెయ్యి కిలోమీటర్ల రేంజ్ కలిగిన ఈ డ్రోన్ లేజర్ గైడెడ్ క్షిపణులతో కచ్చితత్వంతో దాడి చేయగలదు.

ఇలాంటి ఆయుధాలతో పాక్ భారత సైన్యంపై, సైనిక స్థావరాలపై దాడులు చేసినా భారత్ వాటిని చాలా సమర్థంగా అడ్డుకుంది. సాధారణంగా ఏ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ అయినా శత్రువులు ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లు అన్నింటినీ అడ్డుకోవడం అసాధ్యం. 80 శాతం ఆయుధాల్ని అడ్డుకోగలిగితే ఆ వ్యవస్థలు చాలా గొప్పగా పనిచేస్తున్నట్లు లెక్క. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఇజ్రాయెలీ ఐరన్ డోమ్ వ్యవస్థ కూడా 90 శాతం టార్గెట్లనే అడ్డుకోగలుగుతోంది. కానీ తాజా ఘర్షణల్లో భారత ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ 90 శాతానికి మించి టార్గెట్లను ధ్వంసం చేసినట్లు చెబుతున్నారు. భారత ఎయిర్ డిఫెన్స్‌లో రష్యన్ ఎస్-400, స్వదేశీ ఆకాశ్ క్షిపణులు ప్రధాన పాత్ర పోషించాయి. తాజాగా పాకిస్థాన్‌కు చెందిన జేఎఫ్ 17 విమానాన్ని కూల్చింది కూడా మన ఆకాశ్ క్షిపణే. ఇవి కాకుండా భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తయారు చేసిన డ్రోన్ జామింగ్ వ్యవస్థలు, లేజర్ వ్యవస్థలు, స్పైడర్, బరాక్-8, ఎంఆర్‌శామ్, క్యూఆర్‌శామ్ వంటి క్షిపణులు కూడా కీలక పాత్ర వహించినట్లు సమాచారం. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఉంటే సరిపోదు. వాటిని ఎక్కడ మోహరించాలి అనే విషయంలో చాలా జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలి. భారత సైన్యం వాటిని సరైన ప్రదేశాల్లో మోహరించడం వల్లే ఎక్కువ టార్గెట్లను ధ్వంసం చేయగలిగింది. అలాగే ఈ వ్యవస్థల్ని ఉపయోగించడంలో సైన్యానికి నిరంతర శిక్షణ, అప్రమత్తత అవసరం. అంతేకాదు... వివిధ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఒకదానితో ఒకటి సమన్వయంతో పనిచేయాలి. ఒక వ్యవస్థకు అందిన సమాచారాన్ని సకాలంలో మరో వ్యవస్థతో పంచుకోవాలి. ఇవన్నీ సమర్థంగా చేయడంలో భారత సైన్యం విజయవంతమైంది.

అయితే భారత ఎయిర్ డిఫెన్స్‌ను దెబ్బతీయడానికి పాక్ మరో ఎత్తుగడ వేసింది. పెద్దసంఖ్యలో పనికిరాని చౌకబారు క్షిపణుల్ని, ఆయుధాల్లేని డ్రోన్లను కూడా భారత్‌పైకి ప్రయోగించింది. వీటి వల్ల పెద్దగా నష్టం లేకపోయినా మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్ని అయోమయంలోకి నెట్టడానికి ఇవి ఉపయోగపడతాయి. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు వీటిని కూల్చే పనిలో ఉన్నప్పుడు ఇతర డ్రోన్లు, క్షిపణులు దాడులు చేసేస్తాయి. ఇలాంటి ఎత్తుగడల్ని కూడా భారత సైన్యం తిప్పికొట్టగలిగింది. తుర్కియే డ్రోన్లలో చాలావాటిని యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్స్‌తోను, మరికొన్నింటిని ఎలక్ట్రానిక్ వ్యవస్థలతోను అడ్డుకుంది. మన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలన్నింటినీ సమన్వయం చేయగలిగే ఇంటెగ్రేటెడ్ ఎయిర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ భారత్ స్వీయ రక్షణ వ్యూహంలో ప్రధానమైనది. వివిధ రేంజ్‌లు కలిగి, వివిధ ఎత్తుల నుంచి దాడి చేసే క్షిపణులు, డ్రోన్లు, ఎగిరే బాంబులను ఆపాలంటే అంచెలంచెలు కలిగిన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. వివిధ రాడార్లు, సెన్సర్లు, కమాండ్ పోస్టుల మధ్య అనుసంధానం ఏర్పరచుకోవాలి. యుద్ధాల్లో డ్రోన్లను పెద్ద సంఖ్యలో ఉపయోగించడం అనే ధోరణి ఇటీవలే మొదలైంది. మూడేళ్లకు పైగా జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో డ్రోన్లు అతి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఆ యుద్ధం నుంచి పాఠాలు నేర్చుకుని వాటిని అతి త్వరగా, సమర్థంగా ఆచరణలో పెట్టడం వల్లే భారత్ పాక్ ఆకాశ దాడులను అద్భుతంగా తిప్పికొడుతోందని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి రక్షణ ప్రత్యేక ప్రతినిధి



రాఫెల్స్ కూల్చివేత వార్తల్లో నిజమెంత?


మూడు భారత్ రాఫెల్ విమానాలను కూల్చివేసినట్లు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రకటించారు. అదిగో పులి అంటే ఇదిగో తోక అన్నట్టుగా "ఇవిగో రాఫెల్ విమాన శకలాలు" అంటూ పాకిస్థాన్ న్యూస్ వెబ్‌సైట్లు ఫొటోలు, వీడియోలతో సహా వార్తలు ఇచ్చాయి. భారత్-పాక్ సరిహద్దులో ఒక రాఫెల్ విమానం కూలిపోయిన మాట నిజమేనని ఫ్రాన్స్‌కు చెందిన ఒక ఇంటెలిజెన్స్ అధికారి ధ్రువీకరించినట్లు సీఎన్ఎన్ తెలిపింది. దీనితో పాక్ మీడియా ఇచ్చిన ఫేక్ వార్తలకు మరింత బలం చేకూరింది. కానీ దీనిపై లోతుగా ఆరా తీయగా ఆ ఫ్రెంచ్ అధికారి భారత్‌కు చెందిన ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక వెబ్‌సైట్‌లో వచ్చిన వార్త ఆధారంగా అలా చెప్పినట్లు స్పష్టమైంది. దీనిపై ఆ పత్రికను సంప్రదించగా తాము పొరపాటున తప్పుడు వార్త ఇచ్చామని, దానిని తమ వెబ్‌సైట్ నుంచి తొలగించామని సమాధానం ఇచ్చారు. ఒక మిరాజ్ విమానం డ్రాప్ ట్యాంక్ తాలూకు శకలాలను తాము విమాన శకలాలుగా పొరబడినట్లు తెలిపారు. (డ్రాప్ ట్యాంక్ అంటే... యుద్ధ విమానాలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వచ్చినప్పుడు వాటి కింది భాగంలో తాత్కాలికంగా అమర్చే ఇంధన ట్యాంకులు. యుద్ధ విమానాలు వేగంగా ప్రయాణించాలని అనుకున్నప్పుడు, బరువు తగ్గించుకోవాలనుకున్నప్పుడు ఈ డ్రాప్ ట్యాంకుల్ని కిందికి జారవిడిచి వెళ్లిపోతాయి) ఈ డ్రాప్ ట్యాంకుపై ఫ్రెంచ్ అక్షరాలు ఉండడంతో దానిని రాఫెల్ విమానంగా ఆ పత్రిక పొరపాటుపడిందని సమాచారం. ఇక పాక్‌కు చెందిన యుద్ధ విమానం ఒకటి భారత రాఫెల్ విమానాన్ని కూల్చివేసిందంటూ ఒక వీడియోను పాక్ మీడియా చూపుతోంది. అయితే ఆ వీడియో 2025 ఏప్రిల్‌లో పొలాల్లో కూలిపోయిన పాక్ మిరాజ్ విమానం తాలూకుదని ఫ్యాక్ట్ చెక్‌లో వెల్లడైంది. భారత్‌కు చెందిన ఒక డ్రోన్‌ను కూల్చివేసినట్లు పాక్ ఆర్మీ సోషల్ మీడియా ద్వారా ప్రకటిస్తూ ఒక ఫొటో పోస్టు చేసింది. అయితే ఈ ఫొటోలో ఉన్నది రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో 2022లో కూలిన ఇరాన్ డ్రోన్ తాలూకుదని బయటపడింది.

పాక్ ఆకాశ నేత్రం నేలమట్టం

'అవాక్స్'ను కూల్చివేసిన భారత సైన్యం

వైమానిక రాడార్ వ్యవస్థకు కోలుకోలేని దెబ్బ

న్యూఢిల్లీ, మే 9: భారత్‌లోని 15 నగరాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో పాకిస్థాన్ చేసిన దాడి ప్రయత్నాలను భారత సైన్యం సమర్థవంతంగా భగ్నం చేసింది. పాక్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను ధ్వంసం చేయడమే కాకుండా.. ఆ దేశానికి అత్యంత కీలకమైన ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (అవాక్స్)ను కూడా కూల్చివేసింది. ఆకాశ నేత్రంగా పిలిచే అవాక్స్ అనేది ఒక వైమానిక రాడార్ వ్యవస్థ. రాత్రివేళ దాడి కోసం పాక్ దీన్ని యాక్టివేట్ చేసింది. ముందే గుర్తించిన భారత్... పంజాబ్ ప్రావిన్స్‌లో దాన్ని కూల్చివేసింది. ఇది పాక్‌కు కోలుకోలేని ఎదురుదెబ్బే. ఎందుకంటే ఈ విమానం ఓ సాధారణ రాడార్ కాదు. శత్రు విమానాలు, క్షిపణుల కదలికలపై నిఘా పెట్టి, కీలక సమాచారం అందించే ఆకాశ నేత్రం. ఇలాంటి వ్యవస్థ నాశనం కావడమంటే పాక్ వైమానిక వ్యూహం అర్ధంతరంగా నిలిచిపోవడమే. పాకిస్థాన్ వద్ద మొత్తం 9 అవాక్స్ విమానాలున్నాయి.



అవాక్స్ ఏం చేస్తుంది..?

అవాక్స్ అంటే ఒక ఎగిరే రాడార్ స్టేషన్. దీన్ని విమానంపైన అమర్చుతారు. ఇది దూరం నుంచి వచ్చే వైమానిక, ఉపరితల దాడులను గుర్తిస్తుంది.

- అవాక్స్‌లో ఉన్న ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు దాడి జరిగే ప్రమాదాన్ని గుర్తించి కమాండ్ సెంటర్లకు సమాచారం అందిస్తాయి.
- శత్రువులు.. విమానాలు, డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించినప్పుడు అవి గ్రౌండ్ స్టేషన్ రాడార్ల పరిధిలోకి ప్రవేశించకముందే అవాక్స్ గుర్తిస్తుంది.
- 360 డిగ్రీల మేరకు నిఘా చేయగల అవాక్స్ రాడార్ పరిధి 350 నుంచి 400 కిలోమీటర్లు.
- అవాక్స్‌ను పర్యవేక్షించేందుకు, కమ్యూనికేషన్ చేసేందుకు 5-6 మంది ఆపరేటర్లు ఉంటారు. ఇది గాల్లో ఉన్నప్పుడు 20-25 లక్ష్యాలను పర్యవేక్షించి.. యుద్ధ విమానాలకు సూచనలు ఇవ్వగలదు.
- అవాక్స్ వ్యవస్థలో సురక్షితమైన ఉపగ్రహ కమ్యూనికేషన్, ఎన్‌క్రిప్టెడ్ డేటా వంటి అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయి.
- ఇది యుద్ధ విమానాలు, భూ ఆధారిత రాడార్లు, ఉపరితలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థలు, నౌకలకు సమాచారం అందిస్తుంది

భారత సైన్యం దాడులతో

కరాచీ పోర్టు బాగా దెబ్బతింది!

» పోర్ట్ ట్రస్ట్ అధికారిక 'ఎక్స్'లో పోస్ట్

» తర్వాత మాటమార్చి మరో పోస్ట్

» తమ ఖాతా హ్యాకయ్యిందని.. పోర్ట్ సురక్షితంగానే ఉందని వివరణ


కరాచీ పోర్టు(ఫైల్)

న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్‌కు వాణిజ్యపరంగా అత్యంత కీలకమైన కరాచీ ఓడరేవుపై భారత నౌకాదళం దాడి చేసిందా? అంటే.. చేసిందని, భారత్ దాడుల కారణంగా గణనీయమైన డ్యామేజ్ జరిగిందని సాక్షాత్తూ కరాచీ పోర్ట్ ట్రస్టే తన 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించింది! కరాచీ పోర్టుపై భారత నేవీ ఐఎన్ఎస్ విక్రాంత్ బ్యాటిల్ గ్రూప్ నుంచి బ్రహ్మోస్ క్షిపణుల వర్షం కురిపించిందంటూ గురువారం రాత్రి వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ వార్తలను ఖండిస్తూ కరాచీ పోర్ట్ ట్రస్ట్ తొలుత శుక్రవారం ఉదయం 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టింది. పోర్టుపై దాడి జరిగిందంటూ మీడియాలో వచ్చిన కథనాలన్నీ పూర్తిగా అసత్యాలని, ఆధారాల్లేని కథనాలని కొట్టిపారేసింది. పోర్టులో ఓడల రాకపోకలు, కార్గో హ్యాండ్లింగ్ ఎప్పటిలాగానే జరుగుతున్నట్టు వెల్లడించింది. కానీ, ఆ తర్వాత గంటకే మాట మార్చి.. భారత దాడుల కారణంగా పోర్టు ఆస్తులకు ఆమోదయోగ్యం కానంత హాని జరిగిందని.. ఈ నేపథ్యంలో అత్యవసర స్పందన చర్యలు చేపట్టామని.. పునరుద్ధరణపై తరచుగా అప్‌డేట్లు ఇస్తామని పేర్కొంది. ఈ నష్టం నుంచి తాము కోలుకుంటామని ధీమా వ్యక్తం చేసింది. మళ్లీ కొద్దిసేపటికే.. తమ 'ఎక్స్' ఖాతా హ్యాక్ అయ్యిందంటూ అదే అధికారిక ఖాతాలో మరో పోస్టు పెట్టింది. "కరాచీ పోర్ట్ సురక్షితంగా, భద్రంగా ఉంది" అని అందులో వివరించింది. మరోవైపు.. పాక్ ఆర్థిక శాఖ కూడా 'అంతర్జాతీయ భాగస్వాములందరూ తమను రుణాలిచ్చి ఆదుకోవాల'ని కోరుతూ తన 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్టు పెట్టింది. భారత్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతలను తగ్గించడంలో సహకరించాలని అందులో విజ్ఞప్తి చేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికే.. తమ ఎక్స్ ఖాతా హ్యాక్ అయిందంటూ మరో పోస్టు పెట్టింది. రుణమిచ్చి ఆదుకోవాలంటూ అంతకుముందు పెట్టిన పోస్టు తమది కాదని అందులో పేర్కొంది.

పాక్‌కు అమెరికా ఝలక్!

తాజా సంక్షోభంలో జోక్యం చేసుకోం.. చేతులెత్తేసిన ట్రంప్ యంత్రాంగం

» ఆయుధాలు వదిలేయాలని ఎవరినీ కోరం

» తేల్చిచెప్పిన ఉపాధ్యక్షుడు వాన్స్



న్యూయార్క్/న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్ పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పుడు, భారత్ నుంచి దానికి ప్రమాదం పొంచి ఉన్నప్పుడల్లా రంగంలోకి దిగి ఆదుకునే మిత్ర దేశమైన అమెరికా.. తొలిసారి ఆ దేశానికి మొండి చేయి చూపింది. పహల్గాంలో ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను పొట్టనపెట్టుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన భారత్.. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీవోకే)లోని ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగా పాక్ డ్రోన్లతో భారత స్థావరాలపై దాడికి ప్రయత్నించి చావుదెబ్బ తిన్నది. భారత బలగాలు... చైనా నుంచి పాక్ దిగుమతి చేసుకున్న ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలన్నిటినీ ధ్వంసం చేశాయి. కరాచీపై బ్రహ్మోస్ క్షిపణులతో దాడిచేశాయి. భారత్ ప్రతిస్పందన ఇంత తీవ్రంగా ఉంటుందని పాకిస్థాన్, చైనా, తుర్కియేతో పాటు అమెరికా కూడా ఊహించలేదు. ఉగ్రస్థావరాలపై ఇండియా చేసిన దాడులను సమర్థించిన అధ్యక్షుడు ట్రంప్.. కవ్వింపులకు దిగవద్దని పాక్‌ను ముందే హెచ్చరించారు. అయినా 15 భారతీయ నగరాలను డ్రోన్లు, రాకెట్లతో ధ్వంసం చేయడానికి పాక్ సైన్యం ప్రయత్నించింది. వాటిని సమర్థంగా అడ్డుకుని నాశనం చేసిన భారత్.. నిర్ణయాత్మక దాడులకు సర్వసన్నద్ధంగా ఉంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో గురువారం పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్‌కు ఫోన్ చేసి ఉద్రిక్తతలు పెంచవద్దని సూచించారు. అయినా పరిస్థితుల్లో మార్పు లేకపోవడం, భారత్‌పై డ్రోన్ దాడులను పాక్ కొనసాగించడంతో.. అమెరికా ప్రభుత్వం ఇండియాకే సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సంక్షోభంలో జోక్యం చేసుకోబోమని ఉపాధ్యక్షుడు జేమ్స్ వాన్స్ శుక్రవారం తేల్చి చెప్పారు. ఆయన 'ఫాక్స్ న్యూస్'తో మాట్లాడుతూ.. దౌత్యం ద్వారా ఉద్రిక్తతలు చల్లార్చేందుకు ప్రోత్సహిస్తామని.. కానీ సైనికంగా తలదూర్చబోమని స్పష్టం చేశారు. ఆయుధాలు వదిలేయాలని ఎవరినీ కోరబోమని, దౌత్య చర్చలతోనే ఉద్రిక్తతలు చల్లార్చుకోవాలని సూచించారు. పాక్‌కు దన్నుగా నిలిచేది లేదని అమెరికా బహిరంగంగా ప్రకటించడంతో పాక్ ప్రధాని షెహబాజ్‌కు, ఆర్మీ చీఫ్ మునీర్‌కు ఏమీ పాలుపోవడం లేదు. పైగా ఎప్పుడూ అండగా నిలిచే సౌదీ అరేబియా, యూఏఈ కూడా భారత్‌కే మద్దతిస్తున్నాయి. ఇప్పుడు పాక్‌కు మిగిలింది తుర్కియే, చైనా, అజర్‌బైజాన్ మాత్రమే. తాజా సంక్షోభంలో తుర్కియే డ్రోన్లు, రాకెట్లు.. చైనా హెచ్‌క్యూ 9, ఎల్‌వై 80 వంటి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను భారత్ నిర్వీర్యం చేసింది. పాక్‌తో కలిసి తాను అభివృద్ధి చేసిన జేఎఫ్-17 ఫైటర్లను సైతం నేలకూల్చడం చైనాకు మింగుడుపడడం లేదు. సంక్షోభం తీవ్ర రూపం దాల్చితే పై మూడు దేశాలు ముమ్ముందు మరింత సాయం అందించడం అనుమానమేనని దౌత్యవేత్తలు అంటున్నారు.

సంక్షోభాన్ని త్వరగా ముగించేలా చర్యలు తీసుకోవాలి

భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ ట్రంప్ సూచన

వాషింగ్టన్ : భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తగ్గేలా త్వరగా చర్యలు తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరుకుంటున్నట్లు వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు. రెండు దేశాల నేతలతో ట్రంప్‌నకు సత్సంబంధాలున్నాయని ఆమె గుర్తు చేశారు. సంక్షోభాన్ని పరిష్కరించేందుకు విదేశాంగ మంత్రి మార్కో రుబియో ఇప్పటికే భారత్-పాక్ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని లీవిట్ తెలిపారు.





జమ్మూలో చొరబాటుకు ఉగ్రవాదుల యత్నం

▸▸ ఏడుగురిని హతమార్చిన బీఎస్ఎఫ్

న్యూఢిల్లీ/జమ్మూ, మే 9: దేశంలోకి ఉగ్రవాదుల చొరబాటు యత్నాలను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) భగ్నం చేసింది. జమ్మూలోని భారత్-పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ముష్కరుల ప్రయత్నాలను అడ్డుకుని ఏడుగురిని హతమార్చడమే కాకుండా ఒక రేంజర్స్ పోస్ట్‌ను ధ్వంసం చేసినట్టు శుక్రవారం బీఎస్ఎఫ్ పేర్కొంది. సాంబ జిల్లాలో గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఉగ్రవాదులకు సంబంధించిన పెద్ద గ్రూప్‌ను గుర్తించామని, అనంతరం వారి చొరబాటు చర్యలను అడ్డుకుని ఏడుగురిని మట్టుబెట్టినట్టు తెలిపింది. అలాగే పాకిస్థాన్‌లోని ధంధర్ పోస్ట్‌ను ధ్వంసం చేసినట్టు పేర్కొంది. ఈ చొరబాటు యత్నానికి పాకిస్థాన్ రేంజర్స్ పోస్ట్ నుంచి కాల్పుల మద్దతు ఉన్నట్టు బీఎస్ఎఫ్ అధికారప్రతినిధి ఒకరు పేర్కొన్నారు.



త్రివిధ దళాధిపతులతో రాజ్‌నాథ్ భేటీ

న్యూఢిల్లీ, మే 9: సరిహద్దు రాష్ట్రాల్లో గురువారం రాత్రి పాకిస్థాన్ దాడులను భారత సైన్యం తిప్పికొట్టిన వేళ.. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శుక్రవారం త్రివిధ దళాధిపతులతో కీలక సమావేశం నిర్వహించారు. సీడీఎస్ అనిల్‌చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి హాజరు కాగా.. దేశ భద్రతపై రాజ్‌నాథ్ సమీక్షించారు. పాక్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితులను అంచనా వేయడం, తదుపరి చర్యలకు ప్రణాళిక రూపొందించడంపై ఇందులో చర్చించినట్లు తెలుస్తోంది. వాస్తవానికి రాజ్‌నాథ్ శుక్రవారం పట్నాలో పర్యటించాల్సి ఉండగా.. రద్దు చేసుకుని ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. మరోవైపు కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోభాల్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరళ్లు, హోంశాఖ అధికారులతో తన నివాసంలో సమావేశమయ్యారు. దేశంలోని అన్ని కీలకమైన సంస్థలు, విమానాశ్రయాలు, విద్యుత్తు ప్లాంట్లు, పరిశోధన సంస్థల వద్ద భద్రత పెంచాలని ఆదేశించారు.

సైన్యం కదలికలపై ప్రత్యక్ష ప్రసారాలొద్దు

▸▸ మీడియా సంస్థలకు రక్షణ శాఖ సూచన

న్యూఢిల్లీ/అల్వాల్, మే 9 (ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణ కార్యకలాపాలు, భద్రతా దళాల కదలికలపై ప్రత్యక్ష ప్రసారాల విషయంలో మీడియా సంయమనం పాటించాలని రక్షణ శాఖ సూచించింది. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో ఓ పోస్టు చేసింది. సైన్యానికి సంబంధించిన సున్నిత సమాచారాన్ని ముందస్తుగా బహిర్గతం చేయడం వల్ల కార్యాచరణ ప్రభావం దెబ్బతినడంతో పాటు వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లవచ్చు. కార్గిల్ యుద్ధం, 26/11 దాడులు, కాందహార్ హైజాక్ ఘటనల వేళ ముందస్తు మీడియా నివేదికలే ప్రమాదాలకు దారితీశాయి. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్(సవరణ) చట్ట నిబంధనల మేరకు ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు జరుగుతున్నప్పుడు సంబంధిత అధికారులే వివరాలు వెల్లడిస్తారు. మీడియా బాధ్యతాయుతంగా ఉండాలని కోరుతున్నాం' అని పేర్కొంది.

న్యూఢిల్లీ, మే 9: పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అవసరమైతే ప్రాదేశిక సైన్యం (టెరిటోరియల్ ఆర్మీ)ని కూడా రంగంలోకి దించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రాదేశిక సైన్యంలోని అధికారులను, నమోదు చేసుకున్న సిబ్బందిని పిలవాల్సిందిగా ఆర్మీ చీఫ్‌కు సూచించింది. ఇప్పటికే డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసిన పాక్‌ను భారత్ సమర్థంగా అడ్డుకున్న విషయం తెలిసిందే. పాక్ చేసిన ఆ రెండు ప్రయత్నాలు విఫలం కావడంతో ఆ దేశం మరో కుతంత్రానికి తెర తీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో దాడులు చేసి భారత్‌ను ఇబ్బంది పెట్టేలా పాక్ పన్నాగం పన్నుతోంది. పాక్‌కు ఆ అవకాశం ఇవ్వకుండా భారత ఆర్మీని మరింత దృఢంగా తయారు చేసేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భారత ఆర్మీ చీఫ్‌కు మరిన్ని అధికారాలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతకు

రంగంలోకి ప్రాదేశిక సైన్యం!

అవసరమైతే పిలిపించాలన్న కేంద్రం.. ఆర్మీ చీఫ్‌కు మరిన్ని అధికారాల అప్పగింత

టెరిటోరియల్ ఆర్మీలో 50 వేల మంది సిబ్బంది.. వీరిలో క్రీడాకారులు, రాజకీయ నేతలు కూడా

ముందు కూడా ప్రాదేశిక సైన్యం సిబ్బంది పలు సందర్భాల్లో యుద్ధాల్లో పాల్గొన్నారు. 1962లో చైనాతో, 1965, 1971లో పాకిస్థాన్‌తో యుద్ధాల్లో ప్రాదేశిక సైన్యం.. భారత ఆర్మీతో కలిసి పని చేసింది. ప్రకృతి వైపరీత్యాల్లోనూ వీరు సేవలందించారు.

ప్రాదేశిక సైన్యం అంటే?

ప్రాదేశిక సైన్యం అనేది భారత సైన్యానికి రిజర్వ్ ఫోర్స్. దేశంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు భారత ఆర్మీకి సహకారం అందించేందుకు ఈ సైన్యం సిద్ధంగా ఉంటుంది. వీరంతా రెగ్యులర్ ఆర్మీలో భాగమే అయినా.. నిరంతరం సైన్యంతో ఉండరు. యుద్ధంలో అవసరమైన సందర్భాల్లో, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రంగంలోకి దిగుతారు. వీరంతా బయట ఇతర ఉద్యోగాలు, స్వయం ఉపాధి పొందుతూనే స్వచ్ఛందంగా సైన్యంతో పనిచేస్తుంటారు. ప్రాదేశిక సైన్యం రెండు యూనిట్లుగా ఉంది. మొదటిది.. ప్రభుత్వరంగ సంస్థలు, భారత రైల్వే, మాజీ సైనికోద్యోగులతో కూడిన డిపార్ట్‌మెంటల్ యూనిట్. రెండోది.. సాధారణ పౌరులతో కూడిన నాన్ డిపార్ట్‌మెంటల్ యూనిట్. శారీరకంగా, మానసికంగా తగిన ఫిట్‌నెస్ ఉన్నవారినే ఈ సైన్యంలోకి తీసుకుంటారు. ఇందులోని సిబ్బంది, అధికారులకు రెగ్యులర్ ఆర్మీ తరహాలోనే శిక్షణ ఇస్తారు. కనీసం ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారికి పింఛనుతోపాటు ఇతర ప్రయోజనాలు అందజేస్తారు. ప్రస్తుతం 32 బెటాలియన్లలో దాదాపు 50 వేల మంది ఈ ఆర్మీలో ఉన్నట్లు సమాచారం. పలువురు పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు కూడా వీరిలో ఉంటారు. మలయాళ నటుడు మోహన్‌లాల్, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎం.ఎస్.ధోనీ, దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్, రాజకీయ పార్టీల నేతలు సచిన్ పైలట్, అనురాగ్ ఠాకూర్, అభినవ్ బింద్రా తదితరులు ప్రాదేశిక సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్ హోదా కలిగి ఉన్నారు.

ఉద్రిక్తంగానే..!

(మొదటిపేజీ తరువాయి)

స్థావరమే లక్ష్యంగా చేసిన దాడిని భారత్ సమర్థంగా అడ్డుకుంది. అయితే, అవంతిపుర వైమానిక స్థావరం చుట్టుపక్కల పేలుళ్లు వినిపించాయి. పాకిస్థాన్ డ్రోన్లను గగనతలంలోనే పేల్చేయడంతో బారాముల్లాలో ఆకాశం అరుణ వర్ణాన్ని తలపించింది. పాక్ డ్రోన్ బాంబు దాడిలో పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌కు చెందిన కుటుంబంలోని ముగ్గురు శుక్రవారం రాత్రి గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. జమ్ము కశ్మీరులోని జమ్ము, సాంబ, రాజౌరి; పంజాబ్‌లోని పఠాన్‌కోట; అమృత్‌సర్, రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌ల్లో డ్రోన్ దాడులు జరిగాయి. కుప్వారా, సాంబ, పూంచ్, యురి, నౌగమ్ హంద్వారాల్లో నియంత్రణ రేఖ వెంట భారీగా శతఘ్ని గుళ్ల వర్షం కురిపించింది. అలాగే, జమ్ము, పఠాన్ కోట్‌ల్లో రెండో రోజూ సైరన్లు వినిపించాయి. చిమ్మ చీకట్లు నెలకొన్నాయి. అమృత్‌సర్‌లో భారీగా కాల్పులు జరిగినట్లు తెలిసింది. డ్రోన్లు తిరగడం కనిపించింది. జమ్ము, కశ్మీర్, పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్, జైసల్మేర్‌ల్లో పేలుళ్లు వినిపించాయి. పంజాబ్‌లోని గురుదాస్‌పూర్, తరణ్ తరణ్ వాసులు కూడా తమకు పేలుళ్లు వినిపించాయని చెప్పారు. వరుసగా రెండో రోజు కూడా జైసల్మేర్‌లో డ్రోన్ దాడులను మన దళాలు అడ్డుకున్నాయి. ఇక, భారీ పేలుళ్లు తనకూ వినిపించాయని జమ్ము కశ్మీరు సీఎం ఒమర్ అబ్దుల్లా తెలిపారు. "అప్పుడప్పుడు భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపిస్తున్నాయి. అవి భారీ శతఘ్నులు కావచ్చు. ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా.. ఎవరూ వీధుల్లో తిరగొద్దు. మరికొన్ని గంటలపాటు ఇళ్లల్లోనే ఉండండి. వదంతులను నమ్మొద్దు" అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అలాగే, ఇళ్లల్లో లైట్లను ఆర్పేయాలంటూ మసీదుల్లోని లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రకటిస్తున్నారు. మరోవైపు, జమ్ము, సాంబ జిల్లాల్లోని సుచేత్‌గఢ్, రామ్‌గఢ్ సెక్టార్లలో చొరబాట్లకు అనుకూలంగా భారీగా గుళ్ల వర్షం మొదలైంది. ప్రస్తుత పరిస్థితిపై తమలో భయాందోళనలు నెలకొన్నాయని, అయినా, పాకిస్థాన్ కుట్రలను మన సైన్యం తిప్పికొడుతుందన్న భరోసా ఉందని పఠాన్‌కోట్‌లో స్థానికులు చెప్పారు.



శ్రీనగర్‌లో బ్లాక్అవుట్ ప్రకటించడంతో చీకట్లో వీధులు

అమృత్‌సర్‌లో లోహ శకలాలు

అమృత్‌సర్‌లోని జెథువాల్ గ్రామంలో స్థానికులు లోహ శకలాలను గుర్తించారు. అవి క్షిపణి భాగాలుగా అనుమానిస్తున్నారు. స్థానిక పోలీసులు దానిపై సైన్యానికి సమాచారమిచ్చారు. దర్యాప్తు తర్వాతే వివరాలు వెల్లడవుతాయని వారు వివరించారు. అలాగే, కచ్ జిల్లాలోని మారుమూల ఖావ్డా గ్రామంలోనూ డ్రోన్ శకలాలను గుర్తించారు. అలాగే, పాకిస్థాన్‌కు చెందిన పలు సైనిక పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయి. సంబంధిత వీడియోను భారత సైన్యం విడుదల చేసింది. రాజస్థాన్ జైసల్మేర్ జిల్లాలోని కిషన్‌ఘాట్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం బాంబులా ఉన్న దాన్ని గుర్తించారు. ముందు జాగ్రత్త చర్యగా ఆ ప్రాంతాన్ని దిగ్బంధించారు. ఆర్మీ నుంచి నిపుణులు వచ్చి దానిని పరిశీలిస్తున్నారు.



ఆ ఇద్దర్నీ అప్పగించండి!

▸▸ మసూద్ అజర్, హాఫీజ్ సయీద్‌ను అప్పగించాల్సిందిగా భారత్ డిమాండ్?

▸▸ అధికార వర్గాలను ఉటంకిస్తూ న్యూస్18 కథనం

న్యూఢిల్లీ, మే 9: ఉద్రిక్తతలను వీలైనంత త్వరగా తగ్గించాల్సిన బాధ్యత పాక్ మీదే ఉందని, లేనిపక్షంలో భారీ మూల్యం చెల్లించక తప్పదనిని కేంద్రంలో అత్యున్నత స్థాయి అధికార వర్గాలు హెచ్చరించాయి. అంతేకాదు.. భారత్‌లో దాడులకు పాల్పడిన ఉగ్రవాద సంస్థలు జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజర్, లష్కరే తాయిబా వ్యవస్థాపకుడు సయీద్‌ను తమకు అప్పగించాల్సిందిగా కూడా ఇస్లామాబాద్‌ను భారత్ డిమాండ్ చేసినట్టు ఆ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఆ వర్గాలను ఉటంకిస్తూ న్యూస్18 వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. "పాకిస్థాన్ ఈ సమస్యకు అసలు కారణంపై దృష్టి సారించాలి. వారి గడ్డపై ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలి" అని అధికార వర్గాలు పేర్కొన్నట్టు అందులో వెల్లడించింది. మసూద్ అజర్, హాఫీజ్ సయీద్‌ను అప్పగిస్తే పాక్‌కు ఈ యుద్ధాన్ని తప్పించుకోవడానికి ఒక దారి దొరికినట్టవుతుందని.. అదే సమయంలో, పాకిస్థాన్ ఉగ్రవాదుల స్వర్గధామమన్న అపప్రథను తొలగించుకునే అవకాశం కూడా కలుగుతుందని ఆ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

భద్రతపై ప్రధాని ఉన్నతస్థాయి సమావేశం

▸▸ త్రివిధ దళాధిపతులు, రాజ్‌నాథ్‌తో భేటీ

▸▸ మాజీ అధికారులతో కీలక చర్చలు

న్యూఢిల్లీ, మే 9: పాక్‌తో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం రక్షణశాఖకు సంబంధించి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోభాల్, సీడీఎస్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు.. ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠితో ప్రధాని భేటీ అయ్యారు. దేశ భద్రత సన్నద్ధతపై ఆరా తీశారు. భవిష్యత్తు కార్యాచరణపైనా వారితో చర్చించినట్లు సమాచారం. అంతకుముందు త్రివిధ దళాల మాజీ అధ్యక్షులు, వాటిలో పనిచేసి రిటైరయిన పలువురు సీనియర్ అధికారులతో ప్రధాని మోదీ మాట్లాడారు. వారితో కీలక విషయాలపై చర్చించారు. మరోవైపు గుజరాత్ ముఖ్యమంత్రికి ప్రధాని ఫోన్ చేశారు. సరిహద్దుల్లో ఉద్రిక్తత నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతల దృష్ట్యా గుజరాత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా బాణసంచా, డ్రోన్లపై నిషేధం విధిస్తున్నట్లు ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి ప్రకటించారు.



త్రివిధ దళాధిపతులతో నిర్వహించిన సమావేశంలో ప్రధాని మోదీ, రాజ్‌నాథ్

ఏ పరిస్థితులకైనా సిద్ధం!

(మొదటిపేజీ తరువాయి)

డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. కీలక సంస్థల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు కీలక స్థావరాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, మాల్స్ పార్కులు, మెట్రో స్టేషన్లలో నిఘాను; వీవీఐపీల నివాస ప్రాంతాల్లో భద్రతను పెంచారు. పర్యాటక ప్రదేశాలు, కేంద్ర కార్యాలయాల వద్ద దుకాణాలు మూసివేయించారు. "సైరన్లను అమర్చుతున్నాం. ఎత్తయిన భవనాలపై ఏర్పాటు చేసి, వీటి పనితీరును పరిశీలిస్తున్నాం. ఢిల్లీలోని 11జిల్లాల పరిధిలో 10 సైరన్లు ఏర్పాటు చేశాం" అని అధికారులు వెల్లడించారు. ఇవి శబ్దం చేసినప్పుడు ఎలా స్పందించాలనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు దేశవ్యాప్తంగా ఆస్పత్రుల సన్నద్ధతపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా సమీక్ష నిర్వహించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఢిల్లీలోని ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్, రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది సెలవులను రద్దు చేశారు.

పలు రాష్ట్రాల్లో ఉద్యోగుల సెలవులు రద్దు

ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగుల సెలవులు రద్దయ్యాయి. అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేలా వైద్య, విపత్తు నిర్వహణ విభాగాల సంసిద్ధతను సమీక్షిస్తున్నారు. బ్లాక్ అవుట్ విషయంలో ప్రజలకు సూచనలు చేశారు. ఢిల్లీ విమానాశ్రయంలో రెండ్రోజుల్లో 228 విమానాలు రద్దయ్యాయి. శుక్రవారం ఒక్కరోజే 138విమానాలు రద్దయ్యాయి. శ్రీనగర్, చండీగఢ్ సహా ఈశాన్య, పశ్చిమ భారతంలోని 24విమానాశ్రయాలను 15వరకు మూసివేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా అన్ని ఎయిర్‌పోర్టుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.



ఢిల్లీలో ఓ భవనంపై ఏర్పాటు చేసిన సైరన్

జమ్మూ నుంచి ఢిల్లీకి ప్రత్యేక రైళ్లు

జమ్మూలోనూ శుక్రవారంఉదయం సైరన్లు మోగాయి. తెల్లవారుజామున పేలుడు శబ్దాలు వినిపించినట్లు తెలుస్తోంది. దీంతో నగరాన్ని బ్లాక్‌అవుట్ చేశారు. శ్రీనగర్‌లోనూ లైట్లు ఆర్పేసి ఇళ్లలోనే ఉన్నట్లు స్థానికులు తెలిపారు. జమ్మూ, ఉధంపూర్ నుంచి ఢిల్లీకి మూడు ప్రత్యేక రైళ్లను నడిపే యోచనలో ఉన్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. కాగా, దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అన్ని ప్రధాన స్టేషన్లకు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేసినట్లు సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. గుజరాత్, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాలకు రైళ్లు యథావిధిగా నడుస్తున్నాయని.. ఆ యాప్రాంతాలకు అత్యవసరమైతేనే వెళ్లాలని, లేకుంటే రద్దు చేసుకోవాలని ప్రయాణికులకు సూచించారు.

గుజరాత్ సీఎంకు మోదీ ఫోన్

సరిహద్దుల్లో ఉద్రిక్తతలవేళ భద్రతా సన్నద్ధతపై గుజరాత్ ముఖ్యమంత్రికి ఫోన్‌చేసి ప్రధాని ఆరా తీశారు. సున్నిత ప్రాంతాలైన కచ్, బనస్కంతా, పటాన్, జామ్‌నగర్‌లో పౌరుల భద్రత కోసం చేపడుతున్న చర్యల గురించి అడిగారు. ఉద్రిక్తతల నేపథ్యంలో గుజరాత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా బాణసంచా, డ్రోన్లపై నిషేధం విధిస్తున్నట్లు ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి ప్రకటించారు.

ఎయిర్‌పోర్టుల్లో హైఅలర్ట్

▸▸ తిరుపతి, విశాఖ, విజయవాడ విమానాశ్రయాల్లో గట్టి నిఘా

▸▸ తిరుమలలో భద్రత కట్టుదిట్టం.. విస్తృత తనిఖీలు

తిరుమల, విజయవాడ, విశాఖపట్నం, సూళ్లూరుపేట, మే 9(ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు విమానాశ్రయాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) హెచ్చరికల నేపథ్యంలో, కేంద్రం ఆదేశాలతో రాష్ట్రంలోని ప్రధాన విమానాశ్రయాలైన విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అన్ని ఎయిర్‌పోర్టుల్లోనూ సీఐఎస్ఎఫ్, ఎస్‌పీఎఫ్, స్థానిక పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. శుక్రవారం ఉదయం నుంచే విజయవాడ విమానాశ్రయం మూడంచెల భద్రతా వలయంలోకి వచ్చింది. తిరుపతి ఎయిర్‌పోర్టు లోపల ఇప్పుడు రెండంచెలుగా ఉన్న భద్రత, తనిఖీలను నాలుగు అంచెలకు పెంచారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలలో భద్రతా బలగాలను అప్రమత్తం చేశారు. 130 మంది సివిల్, ఏఆర్, ఏపీఎస్పీ, విజిలెన్స్, బాంబ్, డాగ్ స్క్వాడ్, ఆక్టోపస్ బృందాలతో శుక్రవారం సాయంత్రం తిరుమలలో ఏరియా డామినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పరిసరాలు, మాడవీధులు, కాటేజీలు, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, క్యూకాంప్లెక్స్‌లు, బస్టాండ్ వంటి రద్దీ ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టారు. అలిపిరి నుంచి శ్రీవారి ఆలయం వరకు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఘాట్‌రోడ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇదిలా ఉంటే, తిరుమల క్షేత్రం మీదుగా ఉదయం 7 గంటల నుంచి 11 గంటల మధ్య దాదాపు 12 విమానాలు రాకపోకలు సాగించడం ఆందోళనకు దారితీసింది. అవి సాధారణ విమానాలేనని నిర్ధారించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోనూ హై అలర్ట్ ప్రకటించారు. షార్ చుట్టు పక్కల ఉన్న అడవుల్లోనూ నిఘా పెంచారు. సీఐఎస్ఎఫ్ సిబ్బందితో అంతరిక్ష కేంద్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.



గన్నవరం విమానాశ్రయంలో భద్రతా చర్యలు



తిరుమల ఆలయం ముందు పోలీసులు, ఆక్టోపస్ బలగాలు

నిత్యావసరాలకు ఎలాంటి కొరత లేదు

▸▸ దేశంలో అవసరానికి మించి ఆహార ధాన్యాల నిల్వలున్నాయి

▸▸ ధరలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం: కేంద్ర మంత్రి ప్రహ్లాద్

న్యూఢిల్లీ, మే 9: సరిహద్దు రాష్ట్రాల్లో హడావుడిగా నిత్యావసరాలు కొని నిల్వ చేసుకుండటంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. దేశంలో పప్పులు, కూరగాయలు సహా ఎలాంటి నిత్యావసరాలకు కూడా కొరత లేదని.. సరిపడా నిల్వలు ఉన్నాయని ప్రకటించింది. జనం ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భారీగా సరుకులు నిల్వ చేసుకుని, కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "దేశంలో నిత్యావసరాల కొరత తలెత్తుతోందంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దు. దేశంలో అవసరానికి మించి ఆహార పదార్థాల నిల్వలు ఉన్నాయి. ట్రేడర్లు, హోల్‌సేల్, రీటైల్ వ్యాపారులు ప్రభుత్వానికి సహకరించాలి. భారీగా నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే.. కఠిన చర్యలు చేపడతాం. ధరలనూ నిత్యం పర్యవేక్షిస్తున్నాం.." అని తెలిపారు. దీనికి సంబంధించి వివిధ రాష్ట్రాల్లో ఆహార, నిత్యావసర సరుకుల సరఫరా, నిల్వలపై రాష్ట్రాల కార్యదర్శులు, సరుకుల ఉత్పత్తిదారులతో కేంద్ర ప్రభుత్వం సమావేశాలు నిర్వహిస్తోందని వెల్లడించారు. కాగా, సరిహద్దు రాష్ట్రాల్లో జనం పెట్రోల్ బంకులకు పోటెత్తడం, వంటగ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకుంటుండటంపై ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ స్పందించాయి. "దేశవ్యాప్తంగా గణనీయంగా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలు ఉన్నాయి. ఎలాంటి ఆటంకం లేకుండా సరఫరా జరుగుతోంది. ఎవరూ హడావుడి కొనుగోళ్లు, నిల్వ చేసుకోవడం వంటివి చేయవద్దు.." అని పేర్కొన్నాయి. మరోవైపు.. పౌర రక్షణ విభాగాలకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసుకునే అధికారం ఇవ్వాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. మరోవైపు.. మొబైల్ సేవలకు ఎలాంటి ఆటంకం తలెత్తవద్దన్న కేంద్రం సూచన మేరకు టెలికం కంపెనీలు చర్యలు చేపట్టాయి. ప్రతి సంస్థ జాతీయ స్థాయిలో కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయడం, ఒక నోడల్ అధికారిని నియమించడం, విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు సర్వీసులకు ఆటంకం కలగకుండా టవర్ల వద్ద జనరేటర్ల కోసం సరిపడా డీజిల్ నిల్వ ఉంచడం వంటి చర్యలు చేపట్టాయి. మరోవైపు ఏటీఎంలలో నగదు రావడం లేదని, కొరత ఏర్పడిందన్న ప్రచారాన్ని ఎస్‌బీఐ, పీఎన్‌బీసహా జాతీయ బ్యాంకులన్నీ ఖండించాయి. దేశంలోని అన్ని బ్యాంకులు, ఏటీఎంల్లో సరిపడా నగదు ఉందని స్పష్టం చేశాయి.



జస్టిస్ మన్మథరావు వీడ్కోలు సభలో ప్రసంగిస్తున్న హైకోర్టు సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్

జస్టిస్ మన్మథరావుకు హైకోర్టు ఘన వీడ్కోలు

అమరావతి, మే 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీపై వెళ్తున్న జస్టిస్ కె.మన్మథరావుకు రాష్ట్ర హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో న్యాయమూర్తులు హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ మాట్లాడుతూ జస్టిస్ మన్మథరావు అందించిన న్యాయసేవలను కొనియాడారు. స్వల్ప వ్యవధిలో 11,972 కేసులు పరిష్కరించారన్నారు. పలు కీలక తీర్పులు ఇచ్చారని పేర్కొన్నారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ మాట్లాడారు. జస్టిస్ మన్మథరావుకు న్యాయవ్యవస్థలో అపార అనుభవం ఉందన్నారు. అనంతరం న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు మాట్లాడుతూ న్యాయమూర్తిగా నియమితులైనప్పటి నుండి 727 రోజుల్లో 11,972 కేసులు పరిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. విధి నిర్వహణలో సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, జస్టిస్ మన్మథరావు కుటుంబసభ్యులు, అడిషనల్ అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, హైకోర్టు రిజిస్ట్రార్‌లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు ఆర్‌అండ్‌బీ పాతర

- ఈఈ, ఎస్ఈల సీనియారిటీలో గోల్‌మాల్
- ఎస్సీ, ఎస్టీ అధికారులకు అన్యాయం
- కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ తుంగలోకి
- హైకోర్టుకు ఇచ్చిన హామీకి పూర్తి విరుద్ధం
- దళిత, గిరిజన అధికారుల ఆవేదన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రోడ్లు, భవనాల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ), సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ)ల సీనియారిటీ జాబితాలో దళితులు, గిరిజన అధికారులకు అన్యాయం జరిగింది. కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు పాతర వేసి కేవలం ఓ రెండు వర్గాలకు చెందినవారిని శరవేగంగా అందలం ఎక్కించేలా, వారే సీఈ, ఈఎన్‌సీ కావాలనే ఉద్దేశంతో జాబితా రూపొందించారనే విమర్శలు వస్తున్నాయి. కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఇంజనీర్ల సీనియారిటీ ఖరారు చేస్తూ, ఈఈ, ఎస్ఈల తుది సీనియారిటీ జాబితాలను ప్రకటిస్తూ శుక్రవారం ఆర్‌అండ్‌బీ శాఖ ఉత్తర్వులు(జీఓ 22, 23) జారీ చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 85ను ఉల్లంఘిస్తూ కేవలం కొన్ని వర్గాల అధికారులకు ప్రయోజనం కలిగించేలా సీనియారిటీ జాబితా తయారు చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి.

నాడు చంద్రబాబు హయాంలోనే..

దళిత, గిరిజనులకు ఉద్యోగ నియామకాలు, ఆ తర్వాత సర్వీసు పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2001లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 85ని సవరించింది. పదోన్నతుల్లో అణగారిన వర్గాలకు కాన్సిక్వెన్షియల్ సీనియారిటీని అమలు చేయాలని రాజ్యాంగ సవరణ ద్వారా అమల్లోకి తీసుకొచ్చింది. ఇది దేశవ్యాప్తంగా 1995 నుంచే వర్తిస్తుందని స్పష్టం చేసింది. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు 2002లో దీనికి అనుగుణంగా సంచలన నిర్ణయం తీసుకున్నారు. దళిత, గిరిజన వర్గాలకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించారు. 2003 ఏప్రిల్ 14న దాన్ని అమల్లోకి తీసుకొస్తూ జీఓ 5ను జారీ చేశారు. ఈ ఉత్తర్వు దేశంలోనే సంచలనం సృష్టించింది. దళిత, గిరిజన వర్గాలకు మేలు చేసిన తొలిరాష్ట్రంగా ఏపీకి పేరు వచ్చింది. చంద్రబాబు నిర్ణయం వల్ల వేలాది మంది అణగారిన వర్గాల ఉద్యోగులకు పదోన్నతుల్లో మేలు జరుగుతోంది. అయితే.. ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగానే ఆర్‌అండ్‌బీలో దళిత, గిరిజన అధికారులకు అన్యాయం జరుగుతోంది. వారి చట్టబద్ధమైన ప్రయోజనాలను బుట్టదాఖలు చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, కాన్సిక్వెన్షియల్ సీనియారిటీలను తొక్కి పెట్టి ఈఈ, ఎస్ఈల సీనియారిటీని ఖరారు చేశారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లు అందుకొని సీనియారిటీలో ముందు వరసలో ఉండాల్సిన ఎస్సీ, ఎస్టీ అధికారులను ఎక్కడో చివర చేర్చారు. మరో రెండు వర్గాల అధికారులను జాబితాలో టాప్‌లోకి తీసుకొచ్చి పట్టంకట్టారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఖరారు చేసిన తుది సీనియారిటీలో తమకు దక్కాల్సిన పదోన్నతులను ఇతర వర్గాల వారికి ఇచ్చారని బాధిత అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

హైకోర్టుకు హామీ ఇచ్చినా...

గత ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శిగా ఎంటీ కృష్ణబాబు ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ అధికారులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో పాటు ఆర్టికల్ 85 ప్రకారం కాన్సిక్వెన్షియల్ సీనియారిటీని వర్తింప చేస్తామని 10128 కేసులో హైకోర్టుకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. నాటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న నీరబ్‌కుమార్ ప్రసాద్ నేతృత్వాన సీనియర్ ఐఏఎస్‌లతో హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్ఓఆర్‌తో పాటు కాన్సిక్వెన్షియల్ సీనియారిటీని అమలు చేయాలని ఈ కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో ఈ విధానం అమలు చేస్తామని కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే సంవత్సరం వారీగా ప్యానల్స్ తయారు చేశారు. సామాజిక న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. కానీ ఇప్పుడు జీఓల్లో ఆ సామాజిక న్యాయం కనిపించకుండా చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్‌అండ్‌బీ కార్యదర్శిగా దళిత అధికారి ఉన్నా తమకు న్యాయం చేయలేకపోయారని బాధిత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీనియారిటీ గోల్‌మాల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లేందుకు దళిత, గిరిజన ఉద్యోగులు, అధికారులతో పాటు సంఘాలు రెడీ అవుతున్నాయి.

'బుగ్గమఠం' విచారణకు పెద్దిరెడ్డి డుమ్మా

- న్యాయవాదిని పంపి గడువు కోరిన మాజీ మంత్రి

తిరుపతి, మే 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బుగ్గమఠం భూముల ఆక్రమణలకు సంబంధించి దేవదాయ శాఖ చేపట్టిన విచారణకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గైర్హాజరయ్యారు. ఆయన తరఫున ఓ న్యాయవాది హాజరైనప్పటికీ భూములకు సంబంధించి ఎలాంటి రికార్డులు, ఆధారాలూ సమర్పించలేదు. బుగ్గమఠం భూములు ఆక్రమించుకున్నారని, వాటి నుంచి వైదొలగాలని ఆదేశిస్తూ అధికారులు ఇదివరకే పెద్దిరెడ్డికి నోటీసులు జారీ చేయడం.. దీనిపై ఆయన హైకోర్టును ఆశ్రయించడం.. వ్యక్తిగతంగా హాజరై రికార్డులు సమర్పించేందుకు పెద్దిరెడ్డికి అవకాశమివ్వాలని కోర్టు ఆదేశించడం తెలిసిందే. దానికనుగుణంగా కలెక్టరేట్‌లో తిరుపతి జిల్లా దేవదాయ అధికారి రామకృష్ణారెడ్డి ఎదుట శుక్రవారం హాజరై రికార్డులు, ఆధారాలు అందజేయాలని పెద్దిరెడ్డికి బుగ్గమఠం తరఫున రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ తుది నోటీసులు జారీ చేశారు. కానీ ఆయన రాలేదు. తన తరఫున పురుషోత్తంరెడ్డి అనే న్యాయవాదిని పంపారు. బుగ్గమఠం భూములు ఏయే సర్వే నంబర్లలో ఎక్కడెక్కడ ఎంతెంత ఉన్నాయి.. మఠం జరిపిన భూముల క్రయ విక్రయాల వంటి వివరాలు అందజేయాలని దేవదాయ శాఖ అధికారిని లాయర్ అడిగినట్లు తెలిసింది. దేవదాయశాఖ కోరిన సమాచారమివ్వడానికి గడువు కావాలంటూ వినతిపత్రం అందజేసినట్లు సమాచారం.

కల్తీ నెయ్యి కేసులో...
12 మందిపై 'సిట్' తొలి చార్జిషీటు

తిరుపతి, మే 9(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో 12మంది నిందితులపై సిట్ అధికారులు నెల్లూరు ఏసీబీ కోర్టులో ఈ నెల 7న తొలి చార్జిషీటు దాఖలు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు... కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించి దర్యాప్తు చేపట్టిన సిట్ తొలుత నలుగురిని, ఆపై మరో ఇద్దరిని కలిపి ఇప్పటి వరకూ ఆరుగురిని అరెస్టు చేసింది. బుధవారం నెల్లూరు ఏసీబీ కోర్టులో వీరిపై తొలి చార్జిషీటు దాఖలు చేసినట్టు తెలిసింది. వీరిలో ఇప్పటికే అరెస్టయిన ఆరుగురు మినహా మరో ఆరుగురు ఎవరనేది తెలియరాలేదు. ఈ కేసులో పది రోజుల్లో రెండో చార్జిషీటు దాఖలు చేస్తారని, అందులో ఏడు నుంచీ 12మందిని నిందితులుగా చూపే అవకాశముందని సమాచారం.

ధర్నా చేయడానికి వెళుతున్నట్టు చెప్పారు

టీడీపీ కార్యాలయంపై దాడి విషయం తెలియదు.. సీఐడీ అధికారుల విచారణలో సజ్జల వెల్లడి

- నాకు అనుచరులే లేరు..దాడిలో పాల్గొనలేదు
- విచారణలో దేవినేని అవినాశ్ తీరు

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : 'తెలియదు..సంబంధం లేదు".. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ నేత దేవినేని అవినాశ్ సీఐడీ విచారణను ఎదుర్కొన్న తీరు ఇది. అప్పటి దాడి దృశ్యాలను చిత్రీకరించిన వీడియోలను ముందుపెట్టి ప్రశ్నించినా.. అదే దాటవేత ధోరణిలో వారిద్దరూ మాట్లాడారు. జగన్‌పై టీడీపీ నేత పట్టాభి వ్యాఖ్యలతో మనస్తాపం చెందిన అభిమానులు టీడీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేయడానికి వెళుతున్నారని తనకు చెప్పారని సజ్జల విచారణాధికారులకు తెలిపినట్టు సమాచారం. అవినాశ్ కూడా దాదాపు ఇదే సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. వైసీపీ హయాంలో 2021 అక్టోబరు 19వ తేదీన మంగళగిరిలోని తెలుగుదేశం కేంద్ర కార్యాలయంపై వైసీపీకి చెందిన అరాచక శక్తులు, రౌడీలు దాడి చేసిన విషయం తెలిసిందే. గుంటూరు సీఐడీ కార్యాలయంలో జరిగిన ఈ కేసు విచారణకు సజ్జల రామకృష్ణారెడ్డి, దేవినేని అవినాశ్ హాజరయ్యారు. ఉదయం 11.40 గంటల నుంచి 12.40 గంటల వరకు సజ్జలను, ఆ తర్వాత మరో గంటపాటు అవినాశ్‌ను విచారించారు.

విచారణలో సజ్జల తీరు...

సీఐడీ: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడిని తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయం నుంచి మీరు పర్యవేక్షించారు కదా?

సజ్జల: ఆ రోజు నేను బద్వేల్ ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్నాను. దాడి సంగతి నాకు తెలియదు.

ప్రశ్న : ఆరోజు బద్వేల్‌లో ఉన్నట్లు ఆధారాలు చూపగలరా?

సజ్జల: ఆధారాలను తర్వాత అందిస్తాను

సీఐడీ: వైసీపీలో కీలకంగా ఉన్న మీ ఆదేశాలు లేకుండానే దాడి జరుగుతుందా?

సజ్జల: నేనుగానీ, మా పార్టీ నాయకులు గానీ దాడికి ఆదేశాలు ఇవ్వలేదు. ఆ దాడితో నాకు సంబంధం లేదు.

సీఐడీ: మీ ఆదేశాలతోనే కేసును నాడు పోలీసులు నీరుగార్చారు కదా?

సజ్జల: నాకు ఎటువంటి సంబంధం లేదు.

సీఐడీ: టీడీపీ కార్యాలయంపై దాడికి కారణం?

సజ్జల: జగన్‌ను టీడీపీ నేత పట్టాభి దూషించడంతో ఆయన అభిమానులు కలత చెంది దాడి చేసి ఉంటారు.

సీఐడీ: దాడి విషయం మీకు ముందే తెలుసు కదా?

సజ్జల: తెలియదు. జగన్‌ను పట్టాభి దూషించడంపై మనస్తాపం చెందిన అభిమానులు టీడీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేయడానికి వెళుతున్నట్లు చెప్పారు.



న్యాయవాదులతో కలసి సీఐడీ కార్యాలయంలోకి వెళుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి

మా వాళ్లు లేరు: అవినాశ్

సీఐడీ: టీడీపీ కార్యాలయంపై దాడిలో మీ ఆదేశాలతో మీ అనుచరులే కీలకంగా వ్యవహరించారు కదా?

అవినాశ్: నాకు సంబంధం లేదు, నా అనుచరులెవరూ దాడిలో పాల్గొనలేదు. నాకు అనుచరులే లేరు.

సీఐడీ: మీ అనుచరులే దాడి చేసినట్లు సాక్షులు చెప్పారు.

అవినాశ్: ఆ దాడిలో నేను లేను. మా వాళ్లు కూడా ఎవరు వెళ్లలేదు. (దాడికి పాల్పడిన అవినాశ్ అనుచరులు ఫొటోలు ముందుపెట్టగా..) నాకు తెలియదు. వాళ్లను నేను గుర్తు పట్టలేను.

సీఐడీ: మీ ఆదేశాల ప్రకారం విజయవాడ,గుంటూరు నుంచి వచ్చిన మీ అనుచరులు దాడిచేసినట్టు సాక్షులు చెప్పారు

అవినాశ్: దాడి చేయమని నేను ఎవరికీ చెప్పలేదు. ఆ విషయం నాకు తెలియదు.

రెడ్‌బుక్ పాలన పెరుగుతోంది

- సజ్జల

గుంటూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : "మీరు నాటుతున్న విత్తనం మరీ ప్రమాదకరమైంది. దాని నుంచి వచ్చే చెట్టు భయంకరంగా ఉంటుంద'ంటూ ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసు విచారణ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో విచారణకు పిలిస్తే వచ్చానని తెలిపారు. ఆ దాడి విషయం తనకు తెలియదని, అదే విషయం విచారణాధికారులకు తెలిపానని సజ్జల పేర్కొన్నారు. రాష్ట్రంలో రోజురోజుకీ రెడ్ బుక్ పాలన పెరిగిపోతోందన్నారు. కాగా, సుప్రీంకోర్టు ఆదేశంతో టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఇప్పటికి రెండుసార్లు విచారణకు హాజరయ్యానని వైసీపీ నేత దేవినేని అవినాశ్ మీడియాకు తెలిపారు. ఆ దాడితో తనకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.